Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు


జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :24 | సంచిక :295 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | బుధవారం 18 ఫిబ్రవరి 2026 | పేజీలు :12 | వేల రూ5 /-


# ఆర్గానిక్ వస్తువుల కోసం యాప్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. సేంద్రియ ఉత్పత్తులకు ప్రత్యేక యాప్ తీసుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ను సిద్ధం చేస్తోంది. నకిలీల నుంచి విముక్తి కల్పించేలా యాప్ తీసుకొస్తున్నారు. ఈ యాప్‌లో సమగ్ర సమాచారం ఉండేలా ప్లాన్ చేశారు. అటు రైతులు, ఇటు ప్రజలకు ఉపయోగంగా ఉండేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. త్వరలోనే ఈ యాప్ అందుబాటులోకి వస్తుంది అంటున్నారు.తెలంగాణలో రైతులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. కొంతకాలంగా ప్రజలు ఆర్గానిక్ ఉత్పత్తులు ఉపయోగిస్తున్నారు.. కొంతకాలంగా విక్రాలు కూడా పెరిగాయి. ఇదే క్రమంలో ఆర్గానిక్ పేరుతో నకిలీవి కూడా మార్కెట్‌లోకి వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.. అసలు ఏదో, నకిలీవి ఏవో తెలియడం లేదు.. రైతులు కూడా ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. ఓ యాప్‌ను తీసుకొస్తోంది. త్వరలోనే ఆర్గానిక్ యాప్‌ను సిద్ధం చేస్తామని అధికారులు చెబుతున్నారు. రైతులు వారి ఉత్పత్తులతో ఆదాయం పెంచుకునేందుకు ఈయాప్ ఎంతో ఉపయోగంగా ఉంటుంది. సాగును ప్రోత్సహించేందుకు



రాయితీలూ ఇవ్వనుంది.తెలంగాణలో 50వేల ఎకరాల్లో 10వేలమంది వరకు రైతులు ఆర్గానిక్ వ్యసాయం చేస్తున్నారు. వరితో పాటుగా కూరగాయలు, నూనె గింజలు, పప్పుధాన్యాలు సాగు చేస్తున్నారు. మరికొందరు రైతులు పండ్ల తోటలు కూడా సాగు చేస్తున్నారు. రైతులు ఈ ఆర్గానిక్ - మిగతా3లో

## ముస్లిం ఉద్యోగులకు

# పనివేళల్లో మార్పు..

**తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వులు**



**హైదరాబాద్, ఫిబ్రవరి17 :** రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యం కల్పించింది. ఉపవాసాలు పాటించే ఉద్యోగుల సౌకర్యార్థం సాయంత్రం 4 గంటలకే విధులు ముగించుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. ఉపవాసాలు పాటించే ముస్లిం ఉద్యోగుల ఆరోగ్యం, ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. ఈ నెల 19వ తేదీ నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు ముస్లిం ఉద్యోగులు తమ విధులను సాయంత్రం 4 గంటలకే ముగించుకునే అవకాశం ఉంటుంది.

**ప్రభుత్వ నిర్ణయం వెనుక ఉద్దేశం..**

సాయంత్రం వేళల్లో ముస్లిం సోదరులు ఇఫ్తార్ (ఉపవాస విరమణ), ప్రత్యేక ప్రార్థనల (నమాజ్) కోసం తగిన సమయం కేటాయించుకునేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. సాధారణ పనివేళల కంటే ఒక గంట ముందే విధులను ముగించుకోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వారు సమయానికి ఇంటికి చేరుకునే అవకాశం ఉంటుంది. రంజాన్ మాసంలో ముస్లింలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం ఉండడం వల్ల సాధారణ విధుల్లో కొంత ఇబ్బంది ఎదురవుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా ప్రభుత్వం ఈ ప్రత్యేక వెసలుబాటును ప్రకటించింది. ఈ ఉత్తర్వులు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ సెక్టార్ సంస్థలు, ప్రభుత్వ ఆధీనంలోని కార్యాలయాలకు వర్తిస్తాయని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. సంబంధిత శాఖాధికారులు ఈ ఉత్తర్వులను అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిర్ణయాన్ని ముస్లిం ఉద్యోగులు స్వాగతిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## హంగ్ అసెంబ్లీలో

# విచిత్రపొత్తులు

## స్థానిక అవసరాలు ప్రధానం.....

**హైదరాబాద్, ఫిబ్రవరి 17:**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విచిత్రమైన , ఆసక్తికరమైన సమీకరణాలకు తెరలేపాయి. సిద్ధాంతపరంగా బద్ధశత్రువులుగా కనిపించే పార్టీలు క్షేత్రస్థాయిలో అధికారం కోసం చేతులు కలపడం 'అవకాశవాద రాజకీయం'గా కనిపిస్తున్నా, దీని వెనుక లోతైన వ్యూహాలు దాగి ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల కంటే స్థానిక గెలుపు గుర్రాలే కీలకం కావడంతో చాలా చోట్ల అనూహ్య పొత్తులు కనిపించాయి. బీజేపీ-కాంగ్రెస్, బీఆర్ఎస్-బీజేపీ వంటి అసంభవమైన కలయికలు కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పీఠాలను కైవసం




చేసుకున్నాయి. నిజామాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్-మజ్లిస్ జతకట్టడం - మిగతా3లో

## గ్రేటర్ కోసం..

# పక్కా వ్యూహం



**హైదరాబాద్, ఫిబ్రవరి 17:**మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్‌కు దారితీశాయి. ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి చాలా సీరియస్‌గా ఫోకస్ చేసింది. ఎన్నికల సైరన్ మోగక ముందే..ఒక్కో పార్లమెంట్ సెగ్మెంట్‌కు మంత్రులను ఇంచార్జ్‌లుగా నియమించి..ఎప్పటికప్పుడు సీఎం రేవంత్ రెడ్డి సమీక్షలు చేశారు. ఎన్నికలు జరిగేంత వరకు సీరియస్‌గా ఫాలో అప్ చేయడంతో..మెరుగైన ఫలితాలు సాధించింది హస్తం పార్టీ.కొన్ని చోట్ల హంగ్ వచ్చిన వాటిని కూడా నయానో బయానో తమ ఖాతాలోకి వేసుకోగలిగింది కాంగ్రెస్. కానీ హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న మున్సిపాలిటీల్లో వచ్చిన రిజల్ట్స్ కాంగ్రెస్‌ను కలవరపెడుతున్నాయట. తాము సీరియస్‌గా ఎంత ఫోకస్ చేసినా..హైదరాబాద్ చుట్టూ ఉన్న మున్సిపాలిటీల్లో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేయడంతో..ఫలితాలు ఇలా ఎందుకు వచ్చాయని ఆరా తీస్తున్నారట హస్తం పార్టీ నేతలు.గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కలున్న నియోజకవర్గాల్లో కూడా ఖాతా తెరవలేకపోయింది. గ్రేటర్ పరిధిలోని 23 అసెంబ్లీ సెగ్మెంట్లతో పాటు పక్కనున్న చేవెళ్ల, మహేశ్వరం, మేడ్చల్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. దాంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక..గ్రేటర్ హైదరాబాద్‌పై స్పెషల్ ఫోకస్ పెట్టి పనిచేస్తున్నారు హస్తం పార్టీ లీడర్లు.రాష్ట్రానికి గుండెకాయ లాంటి హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో పట్టు సాధించేందుకు అన్ని అస్త్రాలను వాడుతున్నారు. హైదరాబాద్ విషయంలో - మిగతా3లో

## ప్రపంచ వ్యాక్సిన్ తయారీ

# కేంద్రంగా హైదరాబాద్

## బయోఏషియా సదస్సు లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌కు స్వాగతం. బయోఏషియాకు స్వాగతం. 23 సంవత్సరాల క్రితం బయోఏషియా ప్రారంభమైనప్పుడు, హైదరాబాద్ అంటే చార్మినార్, బిర్యానీ, ఔషధ తయారీ ,సాఫ్ట్‌వేర్ నగరం అన్న గుర్తింపు ఉండేది. ఈ రోజు, హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా నిలిచింది. దూరదృష్టి గల నాయకత్వం, స్పష్టమైన విధానాలు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు --- ఈ బలాల ఆధారంగా హైదరాబాద్ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు, పరిశోధన, డిజైన్‌లో విశిష్టతకు ప్రపంచ కేంద్రంగా ఎదిగింది.గత రెండు సంవత్సరాల్లోనే, జీవవిజ్ఞాన రంగంలో 73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. కొద్ది వారాల క్రితం దావోస్‌లో మా కొత్త లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించాం. జీనోమ్ వ్యాలీని విస్తరించాం. ప్రపంచ స్థాయి పరిశోధన, ఆవిష్కరణలకు "వన్-బయో"ను ప్రారంభించాం. గ్రీన్ ఫార్మా సిటీని వేగవంతం చేసాం. అనేక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఆహ్వానించాం. ఇది సాధారణ అభివృద్ధి కాదు. ఇది దృఢమైన దృష్టి ఫలితం. దానికి ప్రత్యక్ష సాక్ష్యం బయోఏషియా 2026. ఈ సభను చూస్తుంటే నేను గర్వంగా చెప్పగలను.బయోఏషియా తన పేరును దాటి, బయో-వరల్డ్‌గా మారుతోంది. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా ఉన్న 500 ప్రముఖ సంస్థలకు చెందిన 4,000 మందికి పైగా ప్రతినిధులు ఇక్కడ హాజరయ్యారు. ఫార్మా, బయోసైన్సెస్, బయోటెక్, బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్లు, ఆరోగ్య రంగాల్లో ప్రముఖులు, బిజినెస్ లీడర్స్ మనతో ఉన్నారు. సైన్స్, ఫా×, బయోటెక్ వంటి రంగాల్లో ప్రముఖులను కలిసినప్పుడు అసాధారణమైన ఫలితాలు వస్తాయి.హైదరాబాద్‌లో జరుగుతున్న బయోఏషియా సదస్సు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం లాంటి అంతర్జాతీయ గుర్తింపు పొందుతుంది అన్న నాకు నమ్మకం ఉంది. తెలంగాణ తో పాటు ముఖ్యంగా జీవవిజ్ఞాన రంగంపై మా దృష్టిని మీతో పంచుకుంటాను. ఇటీవల మేము "తెలంగాణ రైజింగ్ 2047" విజన్‌ను ప్రకటించాం. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం మా లక్ష్యం.ప్రస్తుత జీవ విజ్ఞాన ధోరణులను చూస్తే పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు , ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరం. మీరు విశ్వసనీయమైన, స్థిరమైన, భవిష్యత్తు కోసం మంచి వాతావరణాన్ని కోరుకుంటున్నారు. తెలంగాణ అది అందిస్తుంది , హైదరాబాద్ మీ




సమాధానం. బల్క్ డ్రగ్స్ నుండి బయాలజిక్స్ వరకు,తయారీ నుండి ఆవిష్కరణ వరకు, భారతదేశం నుండి ప్రపంచ స్థాయి వరకు తెలంగాణ ముందుకు సాగుతోంది. మేము కేవలం భారతదేశంలోనే పోటీ పడటం లేదు, ప్రపంచంలోని అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతున్నాం. హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లకు ప్రాధాన్య గమ్యస్థానంగా మారింది. ఇప్పుడు మనం కలిసి దీన్ని సమగ్ర జీవవిజ్ఞాన రంగానికి ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దుదాం. ఇక్కడ పెట్టుబడులు పెట్టండి,మీ +జజలను స్థాపించండి,ఆవిష్కరణ కేంద్రాలను నిర్మించండి.మాలిక్యూల్స్, ఔషధాలను డిజైన్ చేయండి, క్లినికల్ అనలిటిక్స్‌ను నడపండి, AI ప్లాట్‌ఫారమ్‌లను అభివృద్ధి చేయండి, డిజిటల్ తయారీని ముందుకు తీసుకెళ్లండి. మా ప్రభుత్వం, అధికారులు, శాస్త్రవేత్తలు, నైపుణ్యంతో కూడిన యువత మీ విజయానికి భాగస్వాములుగా ఉంటారు. మనమంతా కలిసి పనిచేస్తే హైదరాబాద్ ప్రపంచ వ్యాక్సిన్ రాజధానిగా ఉన్న స్థితి నుండి ప్రపంచ జీవవిజ్ఞాన రాజధానిగా ఎదుగుతుంది. ప్రపంచానికి తెలంగాణ సిద్ధంగా ఉంది. తెలంగాణ అంటే వ్యాపారం. తెలంగాణ ఎదుగుతోంది ఈ ఎదుగుదలలో మీరు భాగస్వాములుకండి..

## కేసీఆర్ ది...

# రుద్రమ జాతి



**హైదరాబాద్, ఫిబ్రవరి 17:**బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారని, ఆయన ఏ జాతికి జాతిపిత అని ఎద్దేవా చేస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది రాణీ రుద్రమ, సమ్మక్క సారక్క, దొడ్డి కొమురయ్య వంటి తెలంగాణ మహాపురుషుల జాతి అని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తాము ప్రతిపక్షంలోకి వచ్చాక కేసీఆర్‌ను తూలనాడుతూ కొంతమంది వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ జాతి గురించి అడుగుతున్నారని, కానీ తెలంగాణ మట్టితో మమేకమైన వారికి, ఉద్యమాల ఉగ్గుపాలు తాగిన వారికి, ఆత్మగౌరవ పోరాటంలో కలిసి నడిచిన వారికి మాత్రమే జాతి అంటే ఏమిటో తెలుస్తుందని అన్నారు. కానీ సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని అన్నారు.ఇటీవల ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్‌ది ఏ జాతి, ఎవరికి జాతిపిత అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో తెలంగాణ వాదుల జాతి, తెలంగాణ ద్రోహుల జాతులు ఉన్నాయని అన్నారు."సమైక్యాంధ్రవాదుల సంచులు మోసే సన్నాసులకు జాతి తెలియదు. నీతి తెలియదు. లాఠీ దెబ్బలు తిన్నవారికి, జైళ్లకు వెళ్లిన వారికి, తుపాకీలకు ఎదురొడ్డి నిలబడ్డ వారికి జాతి అంటే, జాతి అస్థిత్వం అంటే ఏమిటో తెలుసు. ఉద్యమకారుల పైకి తుపాకులు తీసుకెళ్లిన ద్రోహులకు జాతి నిర్వచనం ఎలా తెలుస్తుంది. రక్తంలో పౌరుషం ఉంటే, డీఎన్ఏలో - మిగతా3లో

వార్తాతరంగాలు

బుధవారం 18 ఫిబ్రవరి 2026

# సంపాదకీయం


## ఈ ఒప్పందంతో.. దేశ రైతాంగానికి ఉరే!

భారత్–అమెరికా మధ్య కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందం దేశ రాజకీయాల్లోనే కాకుండా వ్యవసాయ రంగంలోనూ తీవ్ర చర్చకు దారి తీసింది. అమెరికా అధికార వర్గాలు దీన్ని తమ రైతులకు లాభదాయకమని పేర్కొనడంతో..ఈ ఒప్పందం రైతాంగానికి ముప్పుగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతు న్నాయి. ఈ నేపథ్యంలో, ఈ వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడం సైతం సర్వత్రా విమర్శలకు కారణమైంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, పలువురు ప్రతిపక్ష నేతలు ఈ వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, పాడి పరిశ్రమలకు సంబంధించిన ప్రయోజనాలను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా, మోడీ ప్రభుత్వం ఎవరి విజ్ఞప్తులను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఇప్పటికే మోడీ ప్రభుత్వ నిరంకుశపూరిత వైఖరికి నిరసనగా.. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా రైతు సంఘాలు సమ్మె నిర్వహించాయి. ఈ ఒప్పందం మీద అమెరికా మంత్రి బ్రూక్ రోలిన్స్ మాట్లాడుతూ.. ఈ నిర్ణయం అమెరికా రైతులకు లాభదాయకమని అభివర్ణించారు.. కానీ, భారతీయ రైతులకు ఈ ఒప్పందం శరఘాతంలా మారిన విషయం ప్రధాని మోడీ ఆయన పరివారం ఎందుకు గుర్తించడం లేదో? కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అమెరికా సోయాబీన్ ఆయిల్, డిస్టిలర్స్ గ్రెయిన్స్‌కు భారత మార్కెట్ తలుపులు తెరవడం ద్వారా దేశీయ రైతును తన నేలపైనే పోటీ చేయలేని స్థితికి నెట్టివేస్తున్నారు. చౌక విదేశీ దిగుమతులు పాడి, పశుసంవర్ధక రంగాలను కూల్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తాయి. 'పంట మనది – లాభం పరాయిది' అనే దోపిడీ విధానాన్ని దేశంపై ప్రధాని మోడీ బలవంతంగా రుద్దుతున్నారు.. ఎంఎస్పీ హామీలతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం నేడు అంతర్జాతీయ డంపింగ్‌కు ద్వారాలు తెరిచి రైతును బలి చేస్తోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.. రైతు రక్షణ ముసుగులో అమెరికా బహుళజాతి సంస్థల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నది. ఈ ఒప్పందం భారత ఆహార భద్రతను బలహీనపరిచే కుట్రనే. దేశానికి సంబంధించిన ఇంతటి కీలక నిర్ణయం తీసుకునే ముందు... రాష్ట్రాలను సంప్రదించక పోవడం, పార్లమెంటులో చర్చ జరపకపోవడం, రైతు సంఘాల అభిప్రాయాన్ని లెక్కలోకి తీసుకోకపోవడం ప్రజాస్వామ్య విలువల స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించారు. ఇది రాజ్యాంగ విలువల్నీ పాతరేయడం కిందకు వస్తుంది. ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసి రైతుకు చట్టబద్ధ రక్షణ కల్పించాల్సిన అసవరముంది. దేశాన్ని పోషించే రైతును బలి చేసి ఏ ప్రభుత్వం నిలబడలేదన్న విషయం మోడీ గుర్తించుకోవాలి. ఈ ఒప్పందం పాడి పరిశ్రమపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. అమెరికా నుండి పౌల్ట్రీ ఉత్పత్తులు, డిస్టిలర్స్ గ్రెయిన్స్ (పశువుల మేతగా వాడేవి) దిగుమతి అయితే, దేశీయ పశు గ్రాసం ధరలు పడిపోయతాయి. పాడి రైతులకు ఆదాయం తగ్గుతుంది. మన అవసరాలకు సరిపడా ఆహారాన్ని మనమే పండించుకోకుండా, దిగుమతులపై ఆధారపడితే.. భవిష్యత్తులో అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల దేశంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. అందుకే రైతులు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, దానిని ఒక చట్టపరమైన హక్కుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర జాబితాలో ఉన్న వ్యవసాయం గురించి కేంద్రం నిర్ణయాలు తీసుకునేటప్పుడు రాష్ట్రాలను సంప్రదించ కపోవడంపై ఆగ్రహం కల్పించడం జరుగుతున్నది. వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థల ప్రవేశం వల్ల రైతు కేవలం ఒక 'కూలీ'గా మారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశం. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ఇలాంటి ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల కేంద్ర–రాష్ట్రాల సయోధ్య పోతుంది. ఇంతటి కీలకమైన మార్కెట్ మార్పులపై పార్లమెంటులో చర్చ జరగకపోవడం వల్ల, భవిష్యత్తులో తలెత్తే లోటుపాట్లను సరిదిద్దే అవకాశం లేకుండా పోతుంది. అమెరికా వంటి దేశాల్లో యాంత్రీకృత వ్యవసాయం వల్ల ఖర్చులు తక్కువ, కానీ భారత్‌లో ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు.. వీరిద్దరి మధ్య పోటీ అనేది అసమానమైనది. ఈ విషయాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ఒప్పందాన్ని వెనక్కి తీసుకొని... భారత రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్

# నేడు భాగ్యరెడ్డి వర్మ వర్ధంతి

## దళిత ఆత్మగౌరవ పతాక భాగ్యరెడ్డి వర్మ

దళితులు పంచములు కాదు.. ఆది హిందువులు అంటూనే జోగిని, దేవదాసి వంటి దురాచారాలను రూపుమాపేందుకు ఉద్యమించారు. మన్యం సంఘాన్ని స్థాపించి దళితుల్లో చైతన్యం తెచ్చారు. జగన్ మిత్ర మండలి పేరిట దళిత బాలబాలికలకు విద్య నేర్పించారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డారు. పలు సేవా కార్యక్రమాలతో దళిత జనోద్ధారకుడిగా, సంఘ సంస్కర్తగా, వైతాళికుడిగా నిలిచారు.. భాగ్యరెడ్డి వర్మ. మాదరి భాగయ్యగా జన్మించి.. సమాజ సేవా కార్యక్రమాలతో భాగ్యరెడ్డి వర్మగా ప్రసిద్ధి చెందిన ఆయన వర్ధంతి ఈ రోజు.. నిజాం పాలిత హైదరాబాద్ రాజ్యంలో అనగారిన వర్గాల గొంతుక భాగ్యరెడ్డి వర్మ.. 1888 సం. మే 22 నాడు మాదిరి వెంకయ్య, రంగమాంబ దంపతులకు జన్మించారాయన.. తొలిపేరు భాగయ్య.. అయితే వారి కుల గురువు భాగ్యరెడ్డి అనే పేరు పెట్టారు.. (రెడ్డి అంటే పాలకుడు అనే అర్థం కూడా ఉంది) చిన్నప్పటి నుండి సామాజిక స్పృహను అలవరచుకున్న భాగ్యరెడ్డిపై ఆర్యసమాజం, బ్రహ్మసమాజం, బౌద్ధం ప్రభావం కూడా ఉంది. అంటరానితనం, దేవదాసీ వ్యవస్థ, మద్యపానం తదితర రుగ్మతలపై పోరాటాలు చేయడమే కాదు, స్వయంగా దళితులకు విద్య, ఉపాధి, సామాజిక హోదాల కోసం తన వంతు కృషి చేశారు. ఆయన సామాజిక సేవా కార్యక్రమాను



భాగ్యరెడ్డి వర్మ (మాదరి బాగయ్య)

జననం: 22-05-1888, మరణం: 18-02-1939

చూసి ఆర్యసమాజం వర్మ అనే బిరుదును ఇచ్చింది.. అలా బాగ్యరెడ్డి వర్మ పేరు వచ్చింది. అంబేద్కర్ కన్నా ముందే దేశ వ్యాప్తంగా దళితులకు అనాదిగా జరుగుతున్న అన్యాయాలపై గొంతెత్తిన మహానాయకుడు భాగ్యరెడ్డి వర్మ.. తదనంతర కాలంలో బాబా సాహెబ్ తో కలసి ఉద్యమాల్లో పాల్గొన్నారు ' మేము పంచములం కాదు.. ఈ దేశ మూల వాసులం.. ఆది హిందువులం..' అని సగర్వంగా చాటారు.. అనగారిన కులాలను ఆది హిందువులు అని పిలవాలని పిలుపునిచ్చారు. భాగ్యరెడ్డి వర్మ సూచన మేరకు హైదరాబాద్, మద్రాసు ప్రభుత్వాలు వారిని ఆది హిందువులుగా గుర్తించాయి. ప్రారంభంలో జగన్ మిత్ర మండలి, ఆ తర్వాత కాలంలోఆది హిందూ మహా సభ పేరిట తన సేవా కార్యక్రమాలు నిర్వహించారు.. 1910లో చాదర్ఘాట్ దగ్గర ఆది హిందూ పాఠశాల ప్రారంభించారు. మహాత్మా గాంధీ ఈ పాఠశాలను సందర్శించారు. కాలక్రమంలో ఆది హిందూ పాఠశాలలు 26కు విస్తరించాయి. భాగ్యరెడ్డి వర్మ సేవలు హైదరాబాద్ (తెలంగాణ) సంస్థానానికే పరిమితం కాలేదు.. 1917లో విజయవాడలో అంటరాని కులాల సదస్సును నిర్వహించారు. ఆంధ్ర జిల్లాల్లో కూడా పర్యటించి అనగారిన వర్గాల్లో చైతన్యం తీసుకు వచ్చారు. లక్నో, అలహాబాద్, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరిగిన దళిత చైతన్య మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. భాగ్యరెడ్డి వర్మ 1939 ఫిబ్రవరి 18న క్షయ వ్యాధితో కన్నుమూశారు. 51 ఏళ్లకే ఆయన అకాల మరణంతో ఆది హిందూ ఉద్యమం, అనగారిన వర్గాల అభివృద్ధి, అభ్యున్నతికి విఘాతం కలిగించింది. భాగ్యరెడ్డి వర్మ గారి వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను గుర్తు చేసుకుందాం.

# రాజకీయ రొచ్చులోకి హీరోయిన్లు

## తెలంగాణలో రకుల్.. తమిళంలో త్రిష

**చెన్నై, ఫిబ్రవరి 17:** అమ్మ, ఆలి, చెల్లి... ఆడవాళ్ళ ప్రస్తావన లేకుండా తిట్టు చూద్దాం అని ఓ సినిమాలో విలన్‌కు సవాల్ విసురుతాడు హీరో. ఇప్పుడు రాజకీయ నాయకులకు సైతం ఈ విధమైన సవాల్ విసరాలేమో!? హీరోయిన్లను అడ్డు పెట్టుకుని విమర్శలు వద్దని, కేవలం రాజకీయాలకు మాత్రమే పరిమితం కావాలని! ఎందుకంటే... తెలంగాణలో రకుల్ ప్రీత్ సింగ్, తమిళనాడులో త్రిషను కొందరు నేతలు తమ స్వార్థం కోసం రాజకీయాల్లోకి లాగుతూ ప్రత్యర్థి పార్టీ నాయకులను టార్గెట్ చేశారు. త్రిషకు, రాజకీయాలకు సంబంధం లేదు. ప్రత్యేక్షంగా ఎవరికీ, ఏ రాజకీయ పార్టీకి త్రిష మద్దతు ఇచ్చిన సందర్భాలు లేవు. కానీ, ఇప్పుడు తమిళ రాజకీయాలు ఆమె చుట్టూ తిరుగుతున్నాయి. అందుకు కారణం కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పార్టీ స్థాపించి రాజకీయాల్లోకి రావడం. తమిళ రాజకీయాల్లో తాను ఒంటరిగా పోటీ చేస్తానని దళపతి విజయ్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దాంతో మిగతా రాజకీయ పార్టీలు ఆయనపై కత్తి కట్టాయి. అది సహజం. విజయ్ 'జన నయగన్' విడుదలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. అందులో రాజకీయ కోణం చూస్తున్నారు కొందరు. నిజానిజాలు పక్కన పెడితే... విజయ్ వరకు సంబంధించిన వ్యవహారం అది. విజయ్ మీద విమర్శలు గుప్పించే క్రమంలో తమిళనాడు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్ ఓ



అడుగు ముందుకేసి... త్రిష ఇంటి నుంచి విజయ్ బయటకు రావాలని కామెంట్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై విజయ్ – త్రిష అభిమానులు, మహిళా సంఘాలు భగ్గుమన్నాయ్. తెలంగాణలోనూ ఈ విధమైన నీచ రాజకీయాలు ఇటీవల జరిగాయి. భారతీయ రాష్ట్ర సమితి నాయకుడు, కేసీఆర్ తనయుడు కల్వకుంట్ల తారక రామారావు (కేఆర్ఆర్)కు, కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్‌కు ముడి పెడుతూ విమర్శలు చేశారు, ఇంకా చేస్తున్నారు ప్రత్యర్థులు. ఆ మధ్య సమంత వ్యక్తిత్వాన్ని తక్కువ చేసేలా విమర్శలు చేసి తర్వాత క్షమాపణలు చెప్పారు కొండా సురేఖ. తెలంగాణ రాజకీయ విమర్శల్లో అప్పుడప్పుడూ సురేఖా వాణి పేరూ వినిపిస్తూ ఉంటుంది. ఆ మధ్య తమిళనాడు రాజకీయాల్లో ప్రదీప్ రంగనాథన్ 'డ్రాగన్', విశ్వక్ సేన్ 'ఫంకీ' హీరోయిన్ కయాదు లోహర్ పేరు హైలైట్ అయ్యింది. ఎందుకు? రాజకీయాల్లో హీరోయిన్లను టార్గెట్ చేయడం ఎందుకు? ఇప్పుడు చిత్ర పరిశ్రమ నుంచి కాదు... సామాన్యుల నుంచి వ్యక్తం అవుతున్న ప్రశ్న. విలువలతో కూడిన రాజకీయాలను కొందరు ఎప్పుడో వదిలేశారు. కనీసం ఆడవాళ్లను తీసుకు రాకుండా రాజకీయాలు చేయలేరా? సినిమాల్లో విజయ్ – త్రిషది హిట్ పెయిర్. కొన్ని సినిమాలు చేసిన హీరో హీరోయిన్ల మధ్య పరిచయం ఉంటుంది. సినిమాల్లో ఉన్నట్టు బయట ఉంటారని విమర్శలు చేయడం ఎంత వరకు సబబు? అసలు రాజకీయాలతో సంబంధాలు లేని రకుల్ పేరు లాగడం ఎందుకు??తమిళనాడులో త్రిష... తెలంగాణలో రకుల్... రాజకీయాలకు సాఫ్ట్ టార్గెట్ కింద మారారు. సినిమాల్లో నటించడం, తమ పని ఏదో తాము చూసుకోవడం తప్ప ఈ తరహా రాజకీయ విమర్శలకు బదులు ఇవ్వరు. ఒకవేళ ఇస్తే మళ్ళీ మళ్ళీ వచ్చే రాజకీయ విమర్శలు అన్నిటికీ బదులు ఇవ్వవలసి ఉంటుంది. అందుకని, త్రిష – రకుల్ మౌనం వహిస్తున్నారు. విమర్శలను వాదిస్తున్నారు. దాంతో కొందరు రాజకీయ నాయకులు – వాళ్ళ అనుచరులకు చెందిన సోషల్ మీడియా ఖాతాల్లో హీరోయిన్లపై వ్యక్తిత్వ దాడి కొనసాగిస్తోంది. దీనికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

# కాంగ్రెస్‌ను ఓడించే పని ప్రారంభించిన కాంగ్రెస్ నేతలు....

## మణిశంకర్ అయ్యర్‌తో స్టార్ట్ !

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:** అస్సాం నుండి కేరళ వరకు కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న తాజా పరిణామాలు ఆ పార్టీ అంతర్గత సంక్షోభాన్ని మరోసారి బట్టబయలు చేశాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా మోగకముందే నాయకుల మధ్య మొదలైన విభేదాలు, వివాదాస్పద వ్యాఖ్యలు పార్టీకి పెద్ద తలనెప్పిగా మారాయి. అస్సాం కాంగ్రెస్ అధ్యక్షుడు భూపేన్ బోరా తన పదవికి రాజీనామా చేస్తూ ఆత్మగౌరవం దెబ్బతిందని వ్యాఖ్యానించడం పార్టీలో పెను ప్రకంపనలు సృష్టించింది. అధిష్టానం జోక్యం చేసుకుని ఆయనను బుజ్జగించడంతో రాజీనామా వెనక్కి తీసుకున్నప్పటికీ, పార్టీలో ఉన్న విభేదాలు మాత్రం సమసిపోలేదు. రాష్ట్ర యూనిట్‌లో గౌరవ్ గొగోయ్, రాకిబుల్ హుస్సేన్ వంటి ఇతర కీలక నేతల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుండటం వల్ల, ఎన్నికల నాటికి కేడర్ ఏకతాటిపైకి రావడం కష్టంగా కనిపిస్తోందకాంగ్రెస్ గెలుపుపై గట్టి ఆశలు పెట్టుకున్న కేరళలో, సీనియర్ నేత మణిశంకర్



అయ్యర్ చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ అద్భుతమైన నాయకుడని, వచ్చే ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. సొంత కూటమి గెలుపు కోసం పోరాడాల్సిన సమయంలో, మిత్రధర్మాన్ని విస్మరించి ప్రత్యర్థిని కొనియాడటం కేడర్ మనోధైర్యాన్ని దెబ్బతీసింది. మణిశంకర్ అయ్యర్ కేవలం రాష్ట్ర రాజకీయాలకే పరిమితం కాకుండా, రాహుల్ గాంధీ నాయకత్వ శైలిని కూడా పరోక్షంగా విమర్శిస్తున్నారు. పార్టీలో జరుగుతున్న తప్పులను ఎత్తిచూపుతూనే, ఒక రకమైన నిరాశ ను తన మాటల్లో వ్యక్తం చేశారు. పార్టీలో ఉత్పన్నమవుతున్న ఇలాంటి అంతర్గత విభేదాలను, కీలక నేతల అసంతృప్తిని పరిష్కరించే ఒక శక్తివంతమైన ట్రబుల్ షూటర్ ' నాయకత్వ స్థాయిలో కనిపించకపోవడం కాంగ్రెస్‌కు ఉన్న అతిపెద్ద బలహీనతగా మారింది. మొత్తంగా చూస్తే, కాంగ్రెస్ పార్టీ బయటి శత్రువుల కంటే లోపల ఉన్న విభేదాల వల్లే ఎక్కువ నష్టపోతోంది. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం, రాష్ట్ర స్థాయి నేతలు ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం ప్రయత్నించడం పార్టీని క్రమంగా బలహీనపరుస్తోంది. ఈ అంతర్గత చిచ్చును ఆర్పకపోతే, రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ తనను తాను ఓడించుకునే బాటలో పయనించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# శశికళ కొత్త పార్టీ...

**చెన్నై, ఫిబ్రవరి 17:** తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు మొదలయ్యాయి. మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వి.కె. శశికళ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సొంత పార్టీని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అన్నాడీఎంకేలో తిరిగి చేరేందుకు ఆమె చేసిన ప్రయత్నాలను ఎడప్పాడి పళనిస్వామి వర్గం పూర్తిగా తిరస్కరించడంతో, ఆమె తన మద్దతుదారులతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జయలలిత జయంతి రోజైన ఫిబ్రవరి 24, 2026న రామనాథపురం సమీపంలో శశికళ తన కొత్త పార్టీ పేరు , జెండాను ఆవిష్కరించే అవకాశం ఉంది. 2021 ఎన్నికల్లో రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించిన ఆమె, ఈసారి మాత్రం సుమారు 40 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత అన్నాడీఎంకే నాయకత్వం ఎంజీఆర్ , జయలలిత ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, పార్టీని మళ్లీ గాడిలో పెట్టడమే తన ఉద్దేశమని ఆమె అనుచరులు పేర్కొంటున్నారు. అవినీతి కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించిన శశికళకు ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో ఇప్పటికీ సాంకేతిక ఇబ్బందులు ఉన్నాయి. ఆమె అనర్హత కాలం వచ్చే ఏడాది ప్రారంభంలో ముగుస్తుంది, కాబట్టి ఆమె ఈ ఏడాది ఎన్నికల్లో నేరుగా పోటీ చేసే అవకాశం లేదు. అయినప్పటికీ, పార్టీని నడిపించడం , తన మద్దతుదారులను బరిలోకి దింపడం ద్వారా తన రాజకీయ బలాన్ని నిరూపించుకోవాలని ఆమె భావిస్తున్నారు. శశికళ కొత్త పార్టీ వల్ల ప్రధానంగా అన్నాడీఎంకే కే ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ తమిళనాడులో బలమైన పట్టున్న తేవర్ సామాజిక వర్గం ఓట్లు అన్నాడీఎంకే నుండి శశికళ వైపు మళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే విజయ్ పార్టీ ఎంట్రీతో తమిళ రాజకీయాలు వేడెక్కగా, ఇప్పుడు శశికళ రంగంలోకి రావడం వల్ల ఓట్లు మరింతగా చీలిపోనున్నాయి. ఇది పరోక్షంగా అధికార డీఎంకే కు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. శశికళ ప్రకటన అన్నాడీఎంకేలోని ఈపీఎస్ వర్గానికి పెద్ద సవాలుగా మారింది. ఇప్పటికే ఓ. పన్నీర్ సెల్వం, టీటీవీ దినకరన్ వంటి నేతలు విడిపోయి ఉన్న తరుణంలో, శశికళ సొంత కుంపటి పెట్టడం వల్ల పార్టీ సంస్థాగతంగా మరింత బలహీనపడవచ్చు. అవినీతిపరులను పార్టీలోకి చేర్చుకోము అని పళనిస్వామి గట్టిగా చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కేడర్ విడిపోవడం ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. తమిళనాడు రాజకీయాల్లో ఈసారి ద్విముఖ పోరాటం కాకుండా, డీఎంకే కూటమి, అన్నాడీఎంకే కూటమి, విజయ్–శశికళ వంటి చిన్న పార్టీల మధ్య బహుముఖ పోటీ సాగనుంది. శశికళ కేవలం 40 సీట్లలోనే ప్రభావం చూపినప్పటికీ, అన్నాడీఎంకే గెలుపోటములను శాసించే శక్తిగా మారే అవకాశం ఉంది. జయలలిత వారసురాలిగా ఆమెకు ఉన్న గుర్తింపు ప్రజల్లో ఎంతవరకు పనిచేస్తుందనేది 2026 అసెంబ్లీ ఎన్నికలే తేల్చాలి.

# లక్కీడ్రాలోనూ బీఆర్ఎస్‌కు నిరాశే..

## జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ విజయం

**వరంగల్, ఫిబ్రవరి 17:**రెండు రోజుల హైడ్రామా తరువాత జరిగిన జనగామ, తొర్రూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. మున్సిపాలిటీ కోసం జరిగిన ఓటింగ్ లో రెండు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులకు సమానంగా ఓట్లు రావడంతో నిర్వహించిన లక్కీ డ్రాలో కాంగ్రెస్ పార్టీని అదృష్టం వరించింది. దాంతో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి.జనగామ మున్సిపాలిటీ ఎన్నికల్లో గత రెండు రోజులుగా నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. అత్యంత ఆసక్తికరంగా సాగిన పోరులో కాంగ్రెస్ పార్టీ జనగామ మున్సిపల్ పీఠాన్ని దక్కించుకుంది. ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ (దీ=హా) అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మెజార్టీ తేల్చేందుకు ఓటింగ్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపు సమయంలో కాంగ్రెస్ చైర్మన్ అభ్యర్థికి 16 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి గోపగాని సుగుణాకర్‌కు కూడా సరిగ్గా 16 ఓట్లు వచ్చాయి. ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓట్లు రావడంతో (టై కావడంతో), ఎన్నికల అధికారి నిబంధనల ప్రకారం 'డ్రా' ప్రక్రియ పాటించారు. ఈ లక్కీ డ్రాలో అదృష్టం కాంగ్రెస్ పార్టీని వరించింది. దీంతో జనగామ మున్సిపల్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన కడకంచి బాలమణి ఎన్నికైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు.తొర్రూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థికి సమానంగా ఓట్లు రావడంతో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల అధికారి డ్రా పద్ధతిలో విజేతను నిర్ణయించారు. డ్రా తీయగా కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. దాంతో తొర్రూర్ మున్సిపాలిటీ చైర్మన్‌గా తూణం శ్రవణ్ ఎన్నికైనట్లు ప్రకటించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి వెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఎంపీ కడియం కావ్య అక్రమంగా ఓటు వేస్తున్నారని ఆరోపిస్తూ ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఎంపీకి అక్రమ ఓటు వేసే హక్కు ఎక్కడిదని ఎర్రబెల్లి ప్రశ్నించారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎర్రబెల్లి దయాకర్ రావుకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు



మాజీ మంత్రి ఎర్రబెల్లిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసులు ఆయనను నరసింహులపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎర్రబెల్లిని అక్రమంగా అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

కాగజ్ నగర్ కాంగ్రెస్ కైవసం.. బీజేపీ, కాంగ్రెస్ కలిసి బీఆర్ఎస్ ను ఓడించాయి బీజేపీ మద్దతుతో కొమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మున్సిపాలిటీని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 09ం బీజేపీ 03ం ఇండిపెండెంట్ 02 ం ఇద్దరు ఎక్స్ అఫిషియో లతో కలిపి కాంగ్రెస్ అభ్యర్థి షాహీన్ సుల్తానా విజయం సాధించారు.బీఆర్ఎస్ అభ్యర్థికి 15 మంది కౌన్సిలర్ల మద్దతు తెలపగా.. ఒక ఓటు అధిక్యంతో కాంగ్రెస్ కాగజ్‌నగర్ మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్ ఓట్ల మద్దతో చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. వైస్ చైర్మన్‌గా కొత్తపల్లి అనిత (బీజేపీ) ఎన్నికయ్యారు.

**కన్నీటి పర్యంతమైన ఎర్రబెల్లి**

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికలు మంగళవారం అత్యంత నాటకీయ పరిణామాల మధ్య ముగిశాయి. సుదీర్ఘ కాలం పాటు ఈ నియోజకవర్గంలో ఆధిపత్యం చలాయించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు ఈ ఫలితం కోలుకోలేని దెబ్బ తీసింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక కౌన్సిలర్ అనూహ్యంగా చివరి నిమిషంలో కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో సమీకరణాలన్నీ మారిపోయాయి. తన కేడర్‌ను కాపాడుకోవడానికి ఎర్రబెల్లి క్యాంపు స్థలాలను మారుస్తూ విశ్వప్రయత్నాలు చేసినప్పటికీ, ఫలితం మాత్రం కాంగ్రెస్ పక్షాన నిలిచింది. లాటరీ పద్ధతిలో కాంగ్రెస్ కౌన్సిలర్ తూనం శ్రవణ్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.తొర్రూరు మున్సిపాలిటీలో మొత్తం 16 వార్డులు ఉండగా భారత రాష్ట్ర సమితి 9 సీట్లు గెల్చుకుంది. కాంగ్రెస్ పార్టీకి ఏడు వచ్చాయి. కేవలం వార్డు సభ్యుల సంఖ్యను చూస్తే దీ=హా స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. ఎక్స్ అఫీషియో ఓట్లతో మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల్లో ఇరు పార్టీల బలం సమానం కావడంతో, అధికారులు లాటరీ పద్ధతిని అనుసరించారు. ఈ లాటరీలో అదృష్టం కాంగ్రెస్ పార్టీని వరించింది. దీంతో తొర్రూరు మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ దక్కించుకుంది. ఈ రాజకీయ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఎర్రబెల్లి దయాకర్ రావు మీడియా ముందు బహిరంగంగానే కన్నీరు పెట్టుకున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు అసహ్యం కలిగిస్తున్నాయని, విలువలు లేని రాజకీయాల్లో తానూ కొనసాగాలా వద్దా అనే ఆలోచనలో ఉన్నట్లు ఆయన భావోద్వేగంతో వ్యాఖ్యానించారు. రాజ్యాంగ విరుద్ధంగా అధికార యంత్రాంగాన్ని వాడుకుంటూ కాంగ్రెస్ పార్టీ అప్రజాస్వామికంగా వ్యవహరించిందని ఆయన మండిపడ్డారు. రాత్రింబవళ్లు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు తాను ఏ సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదని చెబుతూ ఆయన బావోద్వేగానికి లోనయ్యారు. మున్సిపల్ ఎన్నికల వేళ ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు ఎర్రబెల్లి దయాకర్ రావును అదుపులోకి తీసుకుని నర్సింహులపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలియగానే మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ తమ మద్దతుదారులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ పోలీసుల తీరుపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రబెల్లిని పరామర్శించిన నేతలు, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించడం తగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# జీవన్ రెడ్డికి కాంగ్రెస్ షాక్..

**కరీంనగర్, ఫిబ్రవరి 17:**జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాలు తీవ్రంగా ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు తమ వర్గానికి చెందిన వారికే చైర్మన్ పదవి ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో కాంగ్రెస్ పెద్దలు రంగంలోకి వారి మధ్య సయోధ్య కుదర్చేందుకు చర్చలు జరిపారు. చివరికి కాంగ్రెస్ అధిష్టానం ఆ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డికి బిగ్ షాకిచ్చింది.జగిత్యాల చైర్మన్ పీఠం సంజయ్ వర్గానికే కట్టబెడుతూ నిర్ణయించింది.జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలంటే కనీసం 25 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 23 చోట్ల, స్వతంత్రులు 15 చోట్ల గెలుపొందారు. బీజేపీ ఆరు, బీఆర్ఎస్ నాలుగు, ఎంఐఎం రెండు స్థానాలు గెలుచుకుంది.కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గం నుంచి 33 మంది పోటీ చేయగా 14మంది, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గం నుంచి 17 మంది పోటీ చేయగా తొమ్మిది మంది విజయం సాధించారు. స్వతంత్రుల్లో తొమ్మిది మంది జీవన్ రెడ్డి వర్గం కాగా.. నలుగురు ఎమ్మెల్యే వర్గీయులు, ముగ్గురు బీజేపీ రెబల్స్ ఉన్నారు.ఈ క్రమంలో చైర్మన్ పీఠం కోసం జీవన్ రెడ్డి, సంజయ్ కుమార్ పోటీ పడ్డారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలు రంగంలోకి దిగారు. జీవన్ రెడ్డితో పలు దఫాలుగా చర్చలు జరిపారు. ఈ చర్చల్లో భాగంగా సంజయ్ వర్గానికి చైర్‌పర్సన్ పదవి అప్పగించేందుకు నిర్ణయించారు.జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ గా సంజయ్ వర్గానికి చెందిన సమిండ్ల వాణిని కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది. భవిష్యత్తులో జడ్పీటీసీ, మార్కెట్ కమిటీ పదవుల విషయంలో ప్రాధాన్యత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ పెద్దలు జీవన్ రెడ్డికి హామీ ఇవ్వడంతో ఆయన వెనక్కు తగ్గినట్లు తెలిసింది. దీంతో గత రెండు రోజులుగా జీవన్ రెడ్డి వర్సెస్ సంజయ్ కుమార్ మధ్య జరుగుతున్న వార్ లో పార్టీ పెద్దలతో సహకారంతో సంజయ్ కుమార్ పంతం నెగ్గించుకున్నట్లయింది.

# ఆర్గానిక్ వస్తువుల కోసం యాప్

- మొదటి పేజీ తరువాయి

సాగు కోసం ఎలాంటి పురుగుల మందు, ఎరువులు, ఇతర కెమికల్స్ ఉపయోగించరు. కేవలం జీవ పదార్థాలతో పంటల్ని సాగు చేస్తారు. అయితే పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెటింగ్ ఎలా చేయాలో తెలియని పరిస్థితి. వీరు షాపులు, షాపింగ్ మాల్స్, షాపులకు ఈ ఉత్పత్తుల్ని పంపిస్తారు. ఆర్గానిక్ ఉత్పత్తుల్ని పెద్దగా ఎగుమతి కూడా చేయడం లేదు.ఆర్గానిక్ విత్తనాలు, ఉత్పత్తులకు 2015లో టీఎస్ఎస్ఓసీఏ (తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ) ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆర్గానిక్ ఉత్పత్తుల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.. లైసెన్స్ వచ్చిన తర్వాత లేబుల్స్‌తో ఈ ఉత్పత్తుల్ని విక్రయించాల్సి ఉంటుంది. అయితే తెలంగాణలో 200 సంస్థలు లైసెన్సులు తీసుకున్నాయి. రైతులు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే చాలామంది



రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడం లేదు. కొందరు రైతులు వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సమస్యను వివరించారు. తాము నకిలీ ఉత్పత్తుల కారణంగా నష్టపోతున్నామని మంత్రికి ఫిర్యాదు చేశారు. దీంతో స్పెషల్‌గా యాప్ తీసుకురావాలని మంత్రి తుమ్మల సూచించారు. ఈ క్రమంలో యాప్‌ను సిద్ధం చేస్తున్నారు.టీఎస్ఎస్ఓసీఏ (తెలంగాణ విత్తన, సేంద్రియ ధ్రువీకరణ ప్రాధికార సంస్థ) యాప్ ద్వారా సమాచారాన్ని పొందుపరుస్తారు. ఈ మేరకు రాష్ట్రంలో ఏ రైతు, ఏ పంట సాగు చేస్తున్నారో, ఎక్కడ సాగు చేస్తున్నారో, ఆ ఉత్పత్తులు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో వివరాలు అందుబాటులో ఉంటాయి. రైతుల సమాచారం (అడ్రస్, మొబైల్ నంబర్, ఫోటోలు, వీడియోలు) నమోదు చేస్తారు. ఈ యాప్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన యాప్‌ను కనెక్ట్ చేస్తారు. ఆర్గానిక్ ఉత్పత్తులు కొనుగోలు చేయడం.. ఎగమతుల సంస్థల వివరాలు కూడా ఉంటాయి. ఉత్పత్తులకు సంబందించిన వివరాలు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి.

# గ్రేటర్ కోసం పక్కా వ్యూహం

- మొదటి పేజీ తరువాయి

పాలనా పరమైన సంస్కరణలు తీసుకొచ్చింది ప్రభుత్వం. ఔటర్ రింగ్ రోడ్డు వరకు హైదరాబాద్‌ను విస్తరించి ఉన్న ఏరియాను కోర్..రిజనల్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి ఉన్న ప్రాంతాన్ని ప్యూర్, మిగతా తెలంగాణ ప్రాంతాన్ని రేర్‌గా విభజిస్తూ..పరిపాలనకు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు తోడుగా కొత్తగా ఫ్యూచర్ సిటీని డెవలప్ చేసే పనిలో పడింది.హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలపై ఇంత ఫోకస్ పెట్టినా.. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితాలు రాలేదు. ఎంతో గొప్పగా చెప్పుకునే ఫ్యూచర్ సిటీ ఏరియాలో ఉండే ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని కూడా కాంగ్రెస్ గెలుచుకోలేకపోయింది. ఇక్కడ బీఆర్ఎస్ మెజారిటీ సాధించింది. ఫ్యూచర్ సిటీకి పక్కనే ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమన్‌గల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ఆధిక్యత ప్రదర్శించింది.కానీ బీఆర్ఎస్ కౌన్సిలర్‌ను తమవైపునకు తిప్పుకుని కారు పార్టీ నేతకు ఛైర్మన్ పోస్ట్ ఇచ్చి పరువు నిలబెట్టుకునే ప్రయత్నం చేసింది కాంగ్రెస్. అలాగే మేడ్చల్ జిల్లాలో ఉన్న మూడు మున్సిపాలిటీలు కూడా హస్తం పార్టీకి దక్కలేదు. మూడు చింతలపల్లి, ఎల్లంపేట్, అలియాబాద్ మున్సిపాలిటీలలో ఒక్క అలియాబాద్ మాత్రమే కాంగ్రెస్‌కు దక్కింది. మిగతా రెండుచోట్ల బీఆర్ఎస్ కైవసం చేసుకుంది.చేవెళ్ల



నియోజకవర్గంలోని మొయినాబాద్‌లో మెజారిటీ లేకపోయినా..ఇండిపెండెంట్ అభ్యర్థులతో కలిసి పీఠాన్ని చేజిక్కించుకుంది కాంగ్రెస్. పటాన్ చెరు నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో కారు జోరు కాంగ్రెస్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోందట. ఇక పరిగి, వికారాబాద్ మున్సిపాలిటీలలో పూర్తిస్థాయి మెజారిటీ సాధించలేకపోయింది హస్తం పార్టీ.హైదరాబాద్ చుట్టుపక్కల చాలాచోట్ల ఇప్పటికీ పట్టు సాధించకపోవడంతో హస్తం పార్టీ నాయకత్వం ఆలోచనలో పడిందట. ఇంత చేసినా..మున్సిపాలిటీల్లో ఇలాంటి ఫలితాలు రావడంతో..అసంతృప్తితో ఉన్నారట. సిటీ శివారు ప్రాంతాల్లో వచ్చిన ఫలితాల ఎఫెక్ట్..రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎఫెక్ట్ పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారట.జీహెచ్ఎంసీ ఎన్నికలకు రెడీ అవుతున్న కాంగ్రెస్ పార్టీని..హైదరాబాద్‌లో నాయకత్వం లేమి సమస్య ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. దీన్ని అధిగమించేందుకు రాష్ట్ర నాయకత్వం ఒక ప్లాన్ చేస్తోందట. +ఎవీజ కాల పరిమితి ముగిసినా..ఆరు నెలల సమయం తీసుకొని..పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి..ప్రజల్లోకి వెళ్లాలనుకుంటుందట. ఆరు నెలల్లో పరిస్థితిని తమ ఆధీనంలోకి తెచ్చుకున్న తర్వాతే ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన చేస్తోందట హస్తం పార్టీ.గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం ఇప్పటికే కొన్ని సంస్కరణలు తీసుకొచ్చి..ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించి..మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసింది. విభజిత జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లకు కూడా ఆరు నెలల తర్వాతే ఎన్నికలు పెట్టాలని చూస్తోంది. ఆరు నెలల తర్వాతైనా అధికార కాంగ్రెస్ పట్టు సాధిస్తుందా.? లేక పరిస్థితులు అనుకూలంగా లేవని కార్పొరేషన్ ఎన్నికలపై మళ్లీ ఆలోచనలో పడుతుందా అనేది వేచి చూడాలి.

## కేటీఆర్ మెడకు ఈ ఫార్ములా..

- మొదటి పేజీ తరువాయి



అరవింద్ కుమార్ ను విచారించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో ఏసీబీ మరో రెండు రోజుల్లో ఛార్జ్ షీట్ దాఖలు చేస్తుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అరవింద్ కుమార్ ను విచారించడానికి కేంద్రం అనుమతి ఇవ్వడం విశేషం.2023లో హైదరాబాద్ నగరంలో ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహించారు. దీనికి సంబంధించి ఓ విదేశీ సంస్థకు నిబంధనలు పక్కనపెట్టి నిధులు చెల్లించారు. తద్వారా 54.88 కోట్ల నష్టం ప్రభుత్వానికి వాటిల్లిందని ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలోనే నాడు మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశాలు జారీ చేయడం వల్లే విదేశీ సంస్థకు నిధులు మంజూరు చేశామని.. నాటి పురపాలకు శాఖ స్పెషల్ సెక్రెటరీ అరవింద్ కుమార్ ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా స్టేట్మెంట్ కూడా ఇచ్చారు.అప్పట్లో ఏసీబీ విచారణ నిర్వహించినప్పుడు అరవింద్ కుమార్ ఇదే విషయాన్ని అంగీకరించారు . ఈ కేసులో కేటీఆర్ ను విచారించడానికి గవర్నర్ గతంలోనే అనుమతి ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన తర్వాత.. ఆ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వచ్చిన తర్వాత.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రముఖంగా ఈ కేసు మీద దృష్టి సారించినట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డికి అనేక సందర్భాలలో కేటీఆర్ సవాళ్లు విసిరారు. పొట్టోడు అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ కేసును తెరపైకి తీసుకొచ్చారని ప్రచారం జరుగుతుంది. అన్ని విధాలుగా పరిశీలించిన తర్వాత ఈ కేసును ప్రభుత్వం వ్యూహాత్మకంగా తెరపైకి తీసుకు వచ్చిందని తెలుస్తోంది. అయితే అరవింద్ కుమార్ ను విచారించిన తర్వాత.. కేటీఆర్ ను విచారిస్తారని.. అనంతరం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటుందని ప్రచారం జరుగుతోంది.

## కేసీఆర్ ది...రుద్రమ జాతి

- మొదటి పేజీ తరువాయి



ఉద్యమం ఉంటే ఆత్మాభిమానం అనేది ఎక్కడైనా నీ శరీరంలో ఉంటే నీకు జాతి అంటే ఏమిటో, జాతి చరిత్ర అంటే ఏమిటో తెలుస్తుంది. కానీ జై తెలంగాణ నినాదం ఇవ్వడానికే భయపడేవారికి, తెలంగాణ సోయిలేని సన్నాసులకు జాతి విలువ ఎన్నటికీ తెలియదు" అని కేటీఆర్ ధ్వజమెత్తారు."కొందరు అడుగుతున్నారు నీది ఏ జాతి అని. ఏ జాతికి జాతి పిత అని అడుగుతున్నారు. వారికి నేను సమాధానం చెబుతున్నాను. ఏ జాతి అనే అల్పుడికి నేను చెబుతున్నాను. రాజ్యతంత్రం నడిపిన రుద్రమ జాతి మాది. జల్ జంగల్ జమీన్ అని కొట్లాడిన కొమురంభీం, అస్తిత్వం కోసం అమరులైన సమ్మక్క, సారక్క, కోటల మీద జెండా ఎగురవేసిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయిపాపన్న, భూస్వాముల దోపిడి మీద కొట్లాడిన దొడ్డి కొమురయ్య, బరిలో బందూకు పట్టి దేశ్‌ముఖ్‌లను తరిమికొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ, సామాజిక విప్లవకారుడు భాగ్యరెడ్డి వర్మ, సిపాయిల తిరుగుబాటు బావుటా ఎగురవేసిన తుర్రేబాజ్ ఖాన్, ప్రాంతం వాడు మోసం చేస్తే ప్రాంతంలోనే ఉప్పుపాతర వేస్తామన్న కాళోజీ, నా తెలంగాణ కోటి రతనాల అన్న దాశరథి, విద్యార్థి అమరవీరుల జాతి మాది" అని కేటీఆర్ ఉద్ఘాటించారు.

**హ్యాపీ బర్తడే తాతయ్య**

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆయన మనవడు కల్వకుంట్ల హిమాన్షు రావు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. ఈ సందర్భంగా తన తాత గురించి సోషల్ మీడియాలో పెట్టిన ఓ భావోద్వేగభరిత పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తాతామనవడి మధ్య ఉన్న అనుబంధాన్ని ఈ పోస్ట్ అద్భుతంగా ఆవిష్కరించింది.

**"పుట్టినరోజు శుభాకాంక్షలు తాతయ్యా...**

మీరు ఒక్కరోజు కూడా కంటి నిండా నిద్రపోలేదు. అయినా, నాపై మాత్రం ఎనలేని ప్రేమను, ఆనందాన్ని కురిపించారు. నేను బాగుండాలనే మీ జీవితాన్ని గడిపారు. మీరు బాగుండేలా చూసుకోవడానికి నా జీవితాన్ని అంకితం చేస్తానని మాటిస్తున్నాను.ఇది చాలా కష్టమైన లక్ష్యమని నాకు తెలుసు. కానీ, మీలాగే నిజాయతీగా, దయతో, ధర్మంగా ఉండటానికి ప్రయత్నిస్తాను. ఈ ప్రపంచంలో అన్నిటికంటే ఎక్కువగా మిమ్మల్ని ప్రేమిస్తున్నాను..." అంటూ హిమాన్షు ట్వీట్ చేశాడు.

## హంగ్ అసెంబ్లీలో విచిత్రపొత్తులు

- మొదటి పేజీ తరువాయి




గమనార్హం. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నా, స్థానిక కౌన్సిలర్లు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పార్టీల మధ్య ఉన్న గీతలను చెరిపివేశారు.బీఆర్ఎస్ నేత హరీష్ రావు వంటి వారు ఇతర పార్టీల అనైతిక పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, స్థానిక సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల్లో నాయకత్వం వ్యక్తిగత ప్రాబల్యంపై ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు మారిపోయి, మళ్ళీ ఆయా పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు రాజకీయాలు నడుస్తాయి. అయితే ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీల మధ్య ఉన్న రాజకీయ అంటరానితనం పోయిందని స్పష్టం చేశాయి.ఈ ఎన్నికల తర్వాత అత్యంత ఆసక్తికరమైన చర్చ బీజేపీ – బీఆర్ఎస్ పొత్తు గురించి మొదలైంది. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే ఈ రెండు పార్టీలు కలవడం ద్వారా ఓటు బ్యాంక్ ఏకీకరణ జరుగుతుందని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్ షేర్ కలిపితే అది అధికార పార్టీ కంటే ఎక్కువగా ఉండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఈ రహస్య లేదా బహిరంగ పొత్తు మున్సిపల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లే అవకాశం ఉందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో, బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టును కలిపితే బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, ఉమ్మడి శత్రువును ఓడించడానికి రెండు పార్టీలు చేతులు కలపడం వ్యూహాత్మకంగా లాభిస్తుంది. అయితే, ఈ పొత్తు వల్ల ఇరు పార్టీల సిద్ధాంతాలకు తూట్లు పొడిచినట్లవుతుందనే భయం కూడా నాయకత్వాల్లో ఉంది. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయం బీఆర్ఎస్‌కు ఉంటే, హిందుత్వ ఓటు బ్యాంకులో చీలిక వస్తుందేమోనన్న ఆందోళన బీజేపీలో ఉంది.రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలు పొత్తుల గురించి ఆలోచన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే, తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరమని ఈ మున్సిపల్ ఫలితాలు నిరూపించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయం ఎప్పుడూ అధికారం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి, భవిష్యత్తులో బీజేపీ–బీఆర్ఎస్ కలిసి పనిచేయడం అనేది అసాధ్యమేమీ కాదు. అయితే అది బహిరంగ పొత్తుగా ఉంటుందా లేదా లోపాయికారి ఒప్పందంగా ఉంటుందా అనేది కాలమే నిర్ణయించాలి.

## ఏప్రిల్ మెదటి వారంలో
# అస్సాం అసెంబ్లీ ఎన్నికలు



**గువాహటి:** అస్సాం అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ మొదటి వారంలో జరిగే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒకే విడతలో పోలింగ్ జరుగనున్నట్టు చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ఇంకా తేదీలను ప్రకటించనప్పటికీ మార్చి రెండో వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశాలున్నాయి. 126 మంది సభ్యుల అస్సాం అసెంబ్లీ గడువు 2026 మే 20వ తేదీతో ముగియనుంది. ఆ తేదీకి ముందే తాజా ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంటుంది.అస్సాం ఎన్నికల్లో పోటీ ప్రధానంగా అధికార బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. అస్సాంలో వరుసగా మూడోసారి అధికార పగ్గాలు చేపట్టి హ్యాట్రిక్ సాధించాలనే పట్టుదలతో బీజేపీ ఉంది. అయితే ఒకప్పుడు తమకు కంచుకోటగా ఉన్న రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పావులు కదుపుతోంది. పార్టీ అగ్రనేతల పర్యటనలను ఖరారు చేస్తూ ముందస్తు ప్రచారాన్ని కూడా మొదలుపెట్టింది.

**బీజేపీ సీఎం అభ్యర్థిగా హిమంత**

పార్టీ నుంచి రెండుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న హిమంత బిశ్వా శర్మను మరోసారి ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించే అవకాశాలు బలంగా ఉన్నాయి. రాష్ట్రంలో హిమంత బిశ్వా శర్మకు ఉన్న పాపులారిటీ, అట్టడుగు స్థాయి వర్గాల్లో ఆయనకు గట్టిపట్టు ఉండటం పార్టీ విజయావకాశాలను మెరుగు పరుస్తుందని అధిష్టానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అస్సాంలో ఎన్నికల ప్రచార ప్లాన్‌ను కూడా బీజేపీ ఖరారు చేసినట్టు చెబుతున్నారు. ఇందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తదితర ప్రముఖులు రాష్ట్రవ్యాప్తంగా పలు ర్యాలీల్లో పాల్గొననున్నారు.

# కాంగ్రెస్, బిజేపీ దోస్తీ అనైతికం

**పద్మా దేవేందర్ రెడ్డి**



**మెదక్:**ఢిల్లీలో కాంగ్రెస్, బిజెపి పార్టీలకు వైరమున్నా మెదక్ బల్దియాలో కాంగ్రెస్ ,బిజెపి, బీఎస్పీ సహకరించుకోవడం అనైతిక చర్య అని మాజీ డిప్యూటీ స్పీకర్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నిత్యం కాంగ్రెస్, బిజెపి నాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తు పోసుకుంటూ... మెదక్ మున్సిపల్ పోరులో ఇరు పార్టీలు సహకరించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మరోసారి మెదక్ ప్రాంత ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని చెప్పారు. అభివృద్ధి పేరుతో ఎన్నికలు రాగానే ఇష్టం వచ్చిన వాగ్దానాలు చేస్తూ ప్రజలను ప్రలోభ పెడుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో మద్యం ,డబ్బు ఏరులై పారిన ప్రభుత్వ అధికారులు, పోలీస్ శాఖ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల్లో అభ్యర్థులపై అట్రాసిటీ కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. అభ్యర్థులను ప్రచారం చేయనీయకుండా చేశారని , కేవలం అధికారం కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని , బిఆర్ఎస్ పై నమ్మకాన్ని ఉంచి కాంగ్రెస్ కన్నా అధిక స్థానాలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే సమయంలో మెదక్ లో అవినీతి జరగకుండా చూసే బాధ్యత కౌన్సిలర్ల పై ఉందని, వారికి బి ఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కెసిఆర్ ఆదేశాల మేరకు మెదక్ లో బిఆర్ఎస్ పార్టీ గట్టిగా పని చేసిందని అందుకే ప్రజలు ఆదరించి కాంగ్రెస్ కన్నా పెద్ద మెజార్టీతో సభ్యులను గెలిపించారని పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మెదక్ పట్టణాభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ కెసిఆర్ , హరీష్ రావు మెదక్ గురించి ముందే చెప్పారని, మెదక్ లో రౌడీయిజం నడుస్తుందని నివారించాలంటే బలంగా ప్రజలను ఏకం చేయాలని అన్నారని గుర్తు చేశారు. వార్డులో తిరుగుతుంటే ప్రజలే బిఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారని రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ పార్టీని ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ విపరీతమైన డబ్బులు , మద్యం పంచడంలో కాంగ్రెస్ పార్టీ ముందుందని విమర్శించారు. అట్రాసిటీ కేసుల పోలీస్ అధికారులు పెట్టడం సమంజసం కాదని అన్నారు. అధికార పార్టీకి పోలీసు అధికారులు ఇంతగా సహాయం చేయడం ఎక్కడ చూడలేదని విమర్శించారు. ప్రజలు విశ్వసించి కాంగ్రెస్ కన్నా ఎక్కువ మెజార్టీతో కౌన్సిలర్లను గెలిపించడం కాంగ్రెస్ కు బుద్ధి చెప్పినట్లేనని అన్నారు.మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు విశ్వసించి పూర్తి మెజార్టీతో బిఆర్ఎస్ పార్టీని గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ప్రజలు తీర్పియడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కెసిఆర్ సూచన మేరకు హరీష్ రావు, పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లు తదితరులు పాల్గొన్నారు.

## శివునికి గంజాయి ప్రసాదం..
# రంగంలోకి సీపీ సజ్జనార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17:**



శివరాత్రి పర్వదినం వేళ గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. దేవాలయం వద్ద శివునికి గంజాయిని ప్రసాదంగా సమర్పించబోయారు కొందరు ప్రబుద్ధులు. అంతేకాదు.. దీనిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆ వీడియో కాస్తా వైరల్‌గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు.. సదరు వ్యక్తుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని నేరుగా హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌కి దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై సీరియస్‌గా స్పందించిన సీపీ సజ్జనార్.. వీడియోలోని వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సీపీ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు.. సదరు గంజాయి బ్యాచ్‌ను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని శంషాబాద్ ధర్మగిరి దేవాలయం వద్ద మహా శివునికి గంజాయిని ప్రసాదంగా పెడుతున్నామంటూ కొందరు యువకులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దేవుడికి అందరూ కొబ్బరికాయ కొడితే.. తాము ప్రత్యేకంగా గంజాయి పెడుతున్నామంటూ వీడియోలో వివరించారు. దీనిని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు.. నగర సీపీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో వీడియోను పరిశీలించి.. సదరు యువకులు బడంగ్‌పేట్‌కు చెందిన చరణ్‌తోపాటు అతడి స్నేహితులుగా పోలీసులు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ తరహా రీల్స్ పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని యువకులను నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరించారు.

## 15 ఏళ్ల అమ్మాయిలకు
# ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 17:**మీకు 14 ఏళ్లు నిండి 15 ఏళ్ల వయసున్న అమ్మాయిలు ఉన్నారా? అయితే మీకో అలర్ట్. త్వరలోనే తెలంగాణ ప్రభుత్వం మీ అమ్మాయిలకు ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను వేయించనుంది. రాష్ట్రంలో మొత్తం 4 లక్షల మందికిపైగా ఈ వయసు ఉన్న కిశోర బాలికలు ఉన్నారని గుర్తించారు. వీరందరికీ టీకాలు వేయనున్నారు. అసలు ఈ వ్యాక్సిన్ ఎందుకు వేయిస్తారు..మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 14 నుంచి 15 ఏళ్ల వయసున్న బాలికల కోసం కేంద్రంతో కలిసి ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్‌ను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ వయసున్న బాలికలు రాష్ట్రంలో 4 .60 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. వ్యాక్సినేషన్ చేపట్టడానికి ముందు మైక్రో ప్లానింగ్ సర్వే నిర్వహించనున్నారు. దీని ద్వారా ఈ వయసున్న అమ్మాయిలు స్కూళ్లలో ఎంత మంది ఉన్నారు, బయట ఎంత మంది ఉన్నారనే వివరాలను సమగ్రంగా సేకరిస్తారు.తెలంగాణలోని క్యాన్సర్ కేసులను పరిశీలిస్తే.. మహిళల్లో ఎక్కువ మంది రొమ్ము క్యాన్సర్ బారిన పడుతుండగా.. ఆ తర్వాతి స్థానంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఉంది. దీన్నే సర్వైకల్ క్యాన్సర్ అని పిలుస్తారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌ను




సమర్థవంతంగా అడ్డుకోవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. మహిళలకు సోకే సర్వైకల్ క్యాన్సర్లలో 85 నుంచి 90 శాతం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వల్లే సోకుతోంది.ఎక్కువసార్లు ప్రసవాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, చిన్న వయసులోనే పెళ్లి కావడం, లైంగిక సంబంధాల వల్ల హ్యూమన్ పాపిలోమా వైరస్ సోకుతుంది. అయితే ఇది సోకిన వెంటనే క్యాన్సర్ రాదు. వైరస్ సోకిన 10-15 ఏళ్ల తర్వాత మహిళల్లో క్యాన్సర్ బయటపడుతుంది. దీంతో అమ్మాయిలు యుక్త వయసులోకి వచ్చిన తర్వాత, లైంగిక జీవితాన్ని ప్రారంభించడానికి ముందు హెచ్‌పీవీ టీకాలు వేయిస్తే.. క్యాన్సర్‌ను అరికట్టడంలో మంచి ఫలితం ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు.సర్వైకల్ క్యాన్సర్ తొలి దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు అందుకే దీన్ని సైలెంట్ కిల్లర్ అని పిలుస్తారు. వ్యాధి ముదురుతున్న కొద్దీ లక్షణాలు ఒక్కొక్కటిగా బయటపడతాయి. వ్యాధి బారిన పడ్డామని గ్రహించేలోపే అది ముదిరిపోతోంది. దీని వల్ల చికిత్స ఖర్చు పెరిగిపోవడంతోపాటు ప్రాణాలు కాపాడటం కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి కిశోర బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వడం ఉత్తమ పరిష్కారంగా డాక్టర్లు చెబుతున్నారు. 30 ఏళ్ల వయసు దాటిన మహిళలు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచిస్తున్నారు.హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను బయట కొనుగోలు చేయాలంటే.. ఒక్కో డోసుకు కనీసం రూ.2 వేల నుంచి గరిష్టంగా రూ.4 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. 15 ఏళ్లు వచ్చిన అమ్మాయిలకు మూడు డోసుల వ్యాక్సిన్ ఇస్తారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం అవుతుంది. దీంతో ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించుకుంది. ఇందుకోసం వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటికే ఏర్ష?ట్లు పూర్తి చేసింది. టీకాలు పంపిణీ చేసే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు.

# లిట్మస్ టెస్ట్... ఫెయిల్...
## ఎమ్మెల్యేలు పట్టు కోల్పోతున్నారా...

**హైదరాబాద్, ఫిబ్రవరి 17:**ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్టు.. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కొంతమంది ఎమ్మెల్యేలకు కష్ట కాలాన్ని తీసుకొచ్చింది. ఎందుకంటే మున్సిపల్ ఎన్నికలలో ఆ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలలో ప్రతికూల ఫలితాలు వచ్చాయి.

**కాంగ్రెస్ పార్టీలో ఎవరంటే**

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇక్కడ 24 వార్డులలో కాంగ్రెస్ పార్టీ కేవలం ఎనిమిది మాత్రమే గెలిచింది. గులాబీ పార్టీ 13 స్థానాలలో విజయం సాధించింది.మైనపల్లి రోహిత్ ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ నియోజకవర్గంలో మొత్తం 32 స్థానాలు ఉన్నాయి. ఇక్కడ గులాబీ పార్టీ 15 స్థానాలు సాధించింది. కాంగ్రెస్ పార్టీ 14 స్థానాలు దక్కించుకుంది.తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ 15 వార్డులకు ఐదు మాత్రమే గెలిచింది. గులాబీ పార్టీ పది స్థానాలు దక్కించుకుంది. ఈ నియోజకవర్గంలో మందుల సామేల్ ఎమ్మెల్యేగాఉన్నారు.ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గం లో బొజ్జు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ మున్సిపాలిటీలోని 12 వార్డులలో కాంగ్రెస్ పార్టీ కేవలం నాలుగు మాత్రమే గెలిచింది. దారుణంగా మూడో స్థానంలో నిలిచింది..వర్ధన్నపేట నియోజకవర్గంలో కేఆర్ నాగరాజు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 12 వార్డులకు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి కంటే ఒక స్థానాన్ని తక్కువ గెలిచింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ కేవలం ఐదు స్థానాలకు మాత్రమే పరిమితమైంది.మంత్రి వివేక్ నియోజకవర్గమైన చెన్నూరులో క్యాతనపల్లి మున్సిపాలిటీలో గులాబీ పార్టీ అత్యధికంగా స్థానాలను సొంతం చేసుకుంది. కల్వకుర్తి నియోజకవర్గంలో కాశిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యే గా ఉన్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోని అమనగల్లులో 15 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక వార్డు మాత్రమే



గెలిచింది. కల్వకుర్తిలో మాత్రం కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ స్థానాలు రావడం విశేషం..నారాయణపేట నియోజకవర్గం లో పర్ణిక రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 24 వార్డులలో బిజెపి 11 గెలిచింది. కాంగ్రెస్ పార్టీ ఏడు మాత్రమే దక్కించుకుంది..భారత రాష్ట్ర సమితిలో గదీష్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సూర్యపేట నియోజకవర్గంలో 48 స్థానాల లో గులాబీ పార్టీ కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ 31 స్థానాలలో విజయం సాధించింది.హుజురాబాద్ నియోజకవర్గం లో కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 30 వార్డులు ఉంటే గులాబీ పార్టీకి కేవలం 8 స్థానాలు మాత్రమే లభించాయి.. ఇదే నియోజకవర్గంలో జమ్మికుంట మున్సిపాలిటీలో కాంగ్రెస్ కంటే గులాబీ పార్టీ రెండు ఎక్కువ వార్డులు సాధించి.. మొదటి స్థానంలో ఉంది. డాక్టర్ సంజయ్ ఎమ్మెల్యే గా ఉన్న కోరుట్ల నియోజకవర్గం లో 33 వార్డులకు గానూ గులాబీ పార్టీ కేవలం 8 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. మెట్ పల్లి నియోజకవర్గంలో కూడా గులాబీ పార్టీ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. జహీరాబాద్ నియోజకవర్గంలో మాణిక్ రావు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ గులాబీ పార్టీ కాంగ్రెస్ కంటే ఒక స్థానాన్ని తక్కువ దక్కించుకుంది. ఇక ఇదే నియోజకవర్గంలోని కోహిర్ ప్రాంతంలో 16 వార్డులు ఉంటే.. భారత రాష్ట్ర సమితి ఐదు స్థానాల వరకే ఆగిపోయింది. సంగారెడ్డిలో చింత ప్రభాకర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక్కడ 38 వార్డులు ఉంటే.. కాంగ్రెస్ పార్టీ ఏకంగా 22 వార్డులలో విజయం సాధించింది. గులాబీ పార్టీ కేవలం పది స్థానాలతోనే సరిపుచ్చుకుంది. సదాశివపేట ప్రాంతంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఏకంగా 16 స్థానాలను గెలుచుకోవడం విశేషం.మల్లారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న మేడ్చల్ నియోజకవర్గంలో ఆలియాబాద్ మున్సిపాలిటీలో గులాబీ పార్టీ కేవలం ఏడు స్థానాల మాత్రమే సాధించింది. ఈ మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి. ఇక ఈ నియోజకవర్గంలోని ఎల్లంపేట, మూడు చింతలపల్లి మున్సిపాలిటీలలో మాత్రం గులాబీ పార్టీ అత్యధిక సీటు సాధించి.. గెలుపును సొంతం చేసుకోవడం విశేషం.భారతీయ జనతా పార్టీలోబిజెపి ఎమ్మెల్యే శంకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిలాబాద్ పురపాలకంలో బిజెపి ఎక్కువ వార్డులు సొంతం చేసుకుంది. ఇక్కడ 49 స్థానాలలో 21 స్థానాలను గెలుచుకుంది బిజెపి.వేరేటి మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న నిర్మల్ లో కమలం పార్టీ 42 వార్డులకు గాను కేవలం 13 స్థానాల్లో మాత్రమే గెలుపు సాధించింది. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ 24 స్థానాలను సొంతం చేసుకుంది.రాకేష్ రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న ఆర్మూర్లో బిజెపి కేవలం ఎనిమిది వార్డులు మాత్రమే సొంతం చేసుకుంది. ఇక్కడ 36 వార్డులు ఉన్నాయి.కాగజ్ నగర్ ఎమ్మెల్యేగా పాల్వాయి హరీష్ బాబు కొనసాగుతున్నారు. ఇక్కడ 30 వార్డులు ఉంటే.. బిజెపి కేవలం ఐదు స్థానాలు మాత్రమే గెలిచింది. దారుణంగా మూడవ స్థానానికి పరిమితం అయిపోయింది.ముతోల్ నియోజవర్గంలో రామారావు ఎమ్మెల్యే గా ఉన్నారు. ఇక్కడి బైంసా మున్సిపాలిటీలో బిజెపి కేవలం ఆరు స్థానాలు మాత్రమే గెలిచింది.కామారెడ్డి ఎమ్మెల్యేగా వెంకటరమణారెడ్డి కొనసాగుతున్నారు. ఇక్కడ 49 స్థానాలు ఉంటే.. కేవలం 16 స్థానాలు మాత్రమే గెలిచింది బిజెపి. కాంగ్రెస్ పార్టీ 19 స్థానాలను దక్కించుకుంది.

# కేసీఆర్‌ది ఏ జాతి అంటావా..
# ఇదే మా జాతి


**: రేవంత్ రెడ్డిపై కేటీఆర్ నిప్పులు**

**కేసీఆర్‌ది ఏ జాతి, జాతిపిత ఎలా అవుతారని ఇటీవల రేవంత్ రెడ్డి వ్యాఖ్య**

**మాది రాణీ రుద్రమ, సమ్మక్క-సారక్కల జాతి అన్న కేటీఆర్**

**సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని ప్రశ్న**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారని, ఆయన ఏ జాతికి జాతిపిత అని ఎద్దేవా చేస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమది రాణీ రుద్రమ, సమ్మక్క సారక్క, దొడ్డి కొమురయ్య వంటి తెలంగాణ మహాపురుషుల జాతి అని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేసీఆర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తాము ప్రతిపక్షంలోకి వచ్చాక కేసీఆర్‌ను తూలనాడుతూ కొంతమంది వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ జాతి గురించి అడుగుతున్నారని, కానీ తెలంగాణ మట్టితో మమేకమైన వారికి, ఉద్యమాల ఉగ్గుపాలు తాగిన వారికి, ఆత్మగౌరవ పోరాటంలో కలిసి నడిచిన వారికి మాత్రమే జాతి అంటే ఏమిటో తెలుస్తుందని అన్నారు. కానీ సమైక్యాంధ్ర సంచులు మోసిన వారికి జాతి గురించి ఏం తెలుస్తుందని అన్నారు. ఇటీవల ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్‌ది ఏ జాతి, ఎవరికి జాతిపిత అంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో తెలంగాణ వాదుల జాతి, తెలంగాణ ద్రోహుల జాతులు ఉన్నాయని అన్నారు. "సమైక్యాంధ్రవాదుల సంచులు మోసే సన్నాసులకు జాతి తెలియదు. నీతి తెలియదు. లాఠీ దెబ్బలు



తిన్నవారికి, జైళ్లకు వెళ్లిన వారికి, తుపాకీలకు ఎదురొడ్డి నిలబడ్డ వారికి జాతి అంటే, జాతి అస్థిత్వం అంటే ఏమిటో తెలుసు. ఉద్యమకారుల పైకి తుపాకులు తీసుకెళ్లిన ద్రోహులకు జాతి నిర్వచనం ఎలా తెలుస్తుంది. రక్తంలో పౌరుషం ఉంటే, డీఎన్ఏలో ఉద్యమం ఉంటే ఆత్మాభిమానం అనేది ఎక్కడైనా నీ శరీరంలో ఉంటే నీకు జాతి అంటే ఏమిటో, జాతి చరిత్ర అంటే ఏమిటో తెలుస్తుంది. కానీ జై తెలంగాణ నినాదం ఇవ్వడానికే భయపడేవారికి, తెలంగాణ సోయిలేని సన్నాసులకు జాతి విలువ ఎన్నటికీ తెలియదు" అని కేటీఆర్ ధ్వజమెత్తారు. "కొందరు అడుగుతున్నారు నీది ఏ జాతి అని. ఏ జాతికి జాతి పిత అని అడుగుతున్నారు. వారికి నేను సమాధానం చెబుతున్నాను.

## తెలంగాణ భవన్ లో కేసీఆర్ జన్మదిన వేడుకలు

**హైదరాబాద్:**హైదరాబాద్ తెలంగాణ భవన్లో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్రావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, మహమూద్ అలీ, జగదీష్ రెడ్డి, వి. శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్, లక్ష్మా రెడ్డి, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, నవీన్ కుమార్ రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మరియు తదితర నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేశారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

**కరీంనగర్ రూరల్ మండలం 17:**పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మకల్ గ్రామంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు వివరాల్లోకి వెళితే పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సాంబయ్య పల్లి గ్రామానికి చెందిన దొంగల శ్రీనివాస్ గొల్లపల్లి గ్రామానికి చెందిన అనిల్ అనువారు మానేరు నది నుండి ఇసుకను దొంగలించి తమ ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు, నిందితులపై కేసు నమోదు చేసి అట్టి ట్రాక్టర్లను సీజ్ చేసి తదుపరి చర్య నిమిత్తం కోర్టుకు పంపనైనది ఇటీవల అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడిన నగునూరు గ్రామానికి చెందిన బోదాసు అచ్యుత్ బొమ్మకల్ గ్రామానికి చెందిన నేరెళ్ల శ్రీనివాస్ అను వారిని కరీంనగర్ రూరల్ తహసిల్దార్ గారి

# తెలంగాణ ప్రజల గుండెచప్పుడు కేసీఆర్

## బిఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం సుభిక్షం

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 17( స్కై న్యూస్)** దగాపడ్డ తెలంగాణ ప్రజల గుండెచప్పుడు గుర్తించి రాష్ట్ర సాధన ఉద్యమాన్ని ఉవ్వెత్తున నిర్వహించి ప్రజల గుండెచప్పుడుగా నిలిచిన మహానేత ముమ్మాటికి బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ యే అని పార్టీ నాయకులు అన్నారు మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 72వ జన్మదినాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి స్వగృహంలో కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు మరియు బ్రెడ్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సమైక్య పాలకుల మెడలు వంచి తెలంగాణలో సాధించిన కెసిఆర్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పది సంవత్సరాల కాలంలో



సబ్బండ వర్గాల సంక్షేమానికి ఎంతో కృషిచేసి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్ర భాగాన నిలిపారని కొనియాడారు. అద్భుతమైన పాలన లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాలు పేదలకు అందాయని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో కూడా అమలు చేయలేని అసమర్ధ ప్రభుత్వంగా మారిందని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కార్యకర్తలకు పార్టీ అండగా నిలుస్తుందని ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలకు సమర్థం కావాలని కోరారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్లు తిమ్మాజీపేట పాండు కొత్త గంగాధర్ అర్జునయ్యా జయప్రకాశ్ చారి జయలక్ష్మి నాగేష్ చారి మాజీ జెడ్పిటిసి శ్రీశైలం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబురావు పార్టీ సీనియర్ నాయకులు అర్థం రవి భాస్కర్ గౌడ్ చంద్రశేఖర్ రెడ్డి మాధవరెడ్డి కేశవులు గౌడ్ మన్యపు రెడ్డి రామకృష్ణారెడ్డి ఆనంద్ గౌడ్ యోగానంద రెడ్డి నర్సింహారెడ్డి రమేష్ గౌడ్ కృష్ణారెడ్డి షఫీ ఖాన్ అమరేందర్ రెడ్డి సురేందర్ రెడ్డి కిషోర్ వెంకటయ్య రమణ ప్రసాద్ శివ సంతు తదితరులు పాల్గొన్నారు

## శ్రీశైలం స్వామివారిని దర్శించుకుని: ఎమ్మెల్యే జిఎంఆర్ ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**దేవరకద్ర ఫిబ్రవరి 17 (స్కై న్యూస్);** దేవరకద్ర నియోజకవర్గం ఇటీవల జరిగిన మునిసిపాలిటీ ఎన్నికల్లో దేవరకద్ర ,భూత్పూర్,కొత్తకోట నుంచి భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిపించుకోవడంతో మొక్కుబడిగా శ్రీశైలంలో స్వామిని దర్శించుకుని మంగళవారం భూత్పూర్ మండల పరిధిలోని మోల్గారా గ్రామంలో అత్తవారి ఇంటిలో ఉన్నాడని తెలుసుకొని, చిన్న చింతకుంట మండలం పర్దిపూర్ గ్రామం మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చంద్రు నాయక్, పర్దిపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బూరన్నప్ప, మండల నాయకుడు టిసి వెంకటేష్ తో స్వామి ప్రసాదం అందజేసి శాలువాలతో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.



# ఘనంగా కెసిఆర్ జన్మదినోత్సవం



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 17 (స్కై న్యూస్):** అయిజ మున్సిపాలిటీలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముందుగా పాత బస్టాండ్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్, వైస్ చైర్మన్ నర్సింహులు, కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాజేశ్వరి, టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సేవకే జీవితం అంకితం

# వైస్ చైర్మన్‌గా మరింత కష్టపడతా

### మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ వెల్లడి

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్ ఫిబ్రవరి 17 :-** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ రాజకీయాల్లో యువ నాయకత్వానికి నిదర్శనంగా నిలిచిన 14వ వార్డు కౌన్సిలర్, షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్ తన విజయాన్ని ప్రజలకు అంకితం చేశారు ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మీడియాత మాట్లాడుతూ మీ ఆశీర్వాదంతోనే నాకు ఈ వైస్ చైర్మన్ బాధ్యత దక్కింది అంటూ ఓటర్లకు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 14వ వార్డు నుంచి పోటీ చేసిన ఆయనకు ప్రజలు విశేష ఆదరణ చూపించారు భారీగా 767 ఓట్ల మెజార్టీతో గెలిపించి అదేవిదంగా వైస్ చైర్మన్ పీఠం దక్కేలా చేసిన ఎమ్మెల్యే శంకర్ కు, ఓటర్లందరికీ, పట్టణ ప్రజలకు పాదాభివందనాలు తెలియజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విజయం నా ఒక్కరిది కాదు,ప్రతి కార్యకర్తది నన్ను నమ్మి గెలిపించిన ప్రజల ఆశలు నెరవేర్చడమే నా ధ్యేయమన్నారు యువత అధైర్య పడొద్దు అండగా ఉంటా,కష్టపడితే తప్పకుండా గుర్తింపు వస్తుందని విజయానికి ఓపిక, సహనం చాలా ముఖ్యం పార్టీ కష్టపడిన ప్రతి ఒక్కరికీ అవకాశం ఇస్తుందని స్పష్టం చేశారు పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానన్నారు ముఖ్యంగా తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల



మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తనకున్న ఏకైక ఏజెండా అని తెలిపారు ప్రజలు నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను నెరవేర్చేందుకు మరింత కష్టపడతానని హామీ ఇచ్చారు.ప్రజా ఆశీస్సులతో పదవి దక్కింది సేవతో రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు.

## నూతనంగా ఎన్నుకోబడిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందేమోహన్ లకు శుభాకాంక్షలు

### శుభాకాంక్షలు తెలిపిన ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 17 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీలో షాద్‌నగర్ పురపాలక సంఘంలో నూతన పాలకవర్గం ఘనంగా కొలువుదీరింది జరిగిన ఎన్నిక ప్రక్రియలో మున్సిపల్ చైర్మన్‌గా బసవేశ్వర్, వైస్ చైర్మన్‌గా అందె మోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు అనంతరం వారు మున్సిపల్



కార్యాలయంలో పదవీ బాధ్యతలను స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి షాద్‌నగర్ నియోజకవర్గ స్థాయి నేతలు పట్టణ ప్రముఖులు పురప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు కార్యాలయం ప్రాంగణమంతా కార్యకర్తల కోలాహలం బాణసంచా సందడితో పండుగ వాతావరణం నెలకొంది నూతనంగా ఎన్నికైన చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్‌లకు ఉమ్మడి మండలాల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు షాద్‌నగర్ పట్టణ అభివృద్ధిలో నూతన పాలకవర్గం చురుకైన పాత్ర పోషించాలని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు.

## ఫరీద్‌పూర్ బస్టాండ్ వద్ద డ్రైనేజీ బ్రిడ్జి & సీసీ రోడ్ నిర్మాణం పనులు ప్రారంభం సర్పంచ్ తెలుగు శివకుమార్



**చిన్న చింతకుంట ఫిబ్రవరి 17 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండలం, ఫరీద్‌పూర్ గ్రామం బస్టాండ్ ప్రాంతంలో, మక్తల్ పెద్ద వెంకట్ రెడ్డి ఇంటి పక్కన ఉన్న డ్రైనేజీ ల పై నిర్మించిన చిన్న బ్రిడ్జి దెబ్బతిని ప్రజలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగింది. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, ప్రతిరోజూ ఈ మార్గాన్ని వినియోగించే గ్రామస్థులు ప్రమాదానికి గురయ్యే పరిస్థితి నెలకొంది.ఈ సమస్యను వెంటనే గుర్తించిన గ్రామ సర్పంచ్ తెలుగు శివకుమార్ తక్షణ స్పందనతో స్థలాన్ని పరిశీలించి, అత్యవసరంగా బ్రిడ్జి మరమ్మత్తులు చేపట్టి, సీసీ రోడ్ పనులను ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయించారు.ఈ అభివృద్ధి కార్యక్రమంతో గ్రామ ప్రజలకు సురక్షితమైన రాకపోకలు సాధ్యమయ్యాయి. ప్రజల సమస్యల పరిష్కారంలో సర్పంచ్ చురుకైన చర్యలు ప్రశంసనీయంగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో బిపంచాయతీ కార్యదర్శి కురుమన్న గారు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఖాజా, తెలుగు మేస్త్రీ వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు ఈ తదితరులు పాల్గొన్నారు.గ్రామ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి కొనసాగుతోంది అన్నారు.

# వడ్డీ కాసుల వాడ, ఆపద మొక్కులవాడా, శ్రీ కురుమూర్తి వాస గోవిందా గోవిందా!

**చిన్న చింతకుంట ఫిబ్రవరి 17 (స్కై న్యూస్);** వడ్డీ కాసుల వాడ ఆపద మొక్కల వాడ శ్రీ కురుమూర్తి వాస గోవిందా గోవిందా అంటూ చిన్న చింతకుంట మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో ఏడుకొండల మధ్య స్వయంభుగా వెలసిన తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి, ప్రతిరూపమైన శ్రీ కురుమూర్తి స్వామి కి మహాశివరాత్రి అమావాస్యను పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలనుంచి భక్తులు తండలుగా కదిలి వచ్చి స్వామి పుష్కరిణ్ల పవిత్ర స్నానాలు చేసి తడి గుడ్డలతో బార్కెట్లో నిలచి స్వామిని వివిధ పేర్లతో స్మరిస్తూ స్వామిని దర్శించుకొనుచున్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ పాలకమండలి చైర్మన్ జి గోవర్ధన్ రెడ్డి, స్వామి కార్య నిర్వహణ అధికారి మద్దినేశ్వర్ రెడ్డి



అన్ని వసతులను సమకూర్చారు. అనంతరం కొండ దిగువ భాగంలో స్వామికి ధూప దీప నైవేద్యములు సమర్పించి ముక్కులు చెల్లించుకుంటున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది, ఆలయ పాలకవర్గ సభ్యులు ఎప్పటికప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షణలు నిర్వహిస్తున్నారు. వచ్చిన భక్తులకు అన్న సంతాపం చేయుచున్నారు.

## కొత్త పాలకులు సరి

# కొత్త ప్రగతి వెలుగులు

### ప్రగతి వెలుగులకు శ్రీకారం పుట్టిన మున్సిపాలిటీ కొత్త చైర్మన్ అగ్గునూరు బస్వం, వైస్ చైర్మన్ అందె మోహన్



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ ఫిబ్రవరి 17 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీలో కొత్త పాలకులు వార్డుల వారీగా సరికొత్త వెలుగులకు రెండో రోజు నుంచే శ్రీకారం చుట్టారు నిన్న ప్రమాణ స్వీకారం చేసిన మున్సిపాలిటీ చైర్మన్ అగ్గునూరు బస్వం, వైస్ చైర్మన్ అందెమోహన్ లు పట్టణంలోని 18వ వార్డులో కౌన్సిలర్ జమాల్ పూర్ సంతోష్ బాయి చందూలాల్ విజ్ఞప్తి మేరకు సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు అదేవిధంగా అక్కడ ముస్లింలు ప్రార్థనలు జరుపుకునే నూర్ మజీద్ వద్ద చెత్తను శుభ్రం చేశారు ఈ సందర్భంగా వారు మీడియా తో మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో అదేవిధంగా మున్సిపాలిటీ నిధులను వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి వార్డులోను చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, మహమ్మద్ ఇబ్రహీం, సుధీర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, గన్నోజు రాజలింగం, శివయ్య, మేడిపల్లి నరసింహ చారి, ప్రకాష్ చారి, జమాల్ పూర్ శివ, దుర్గేష్, మల్కాపురం రవి, శ్రావణ్, భీమ్ రెడ్డి, నవీన్ రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఘనంగా జన్మదిన వేడుకలు

**దేవరకద్ర కౌకుంట్ల ఫిబ్రవరి 17 (స్కై న్యూస్);** దేవరకద్ర నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు బి.ఆర్.ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కే బి ఆర్ గౌడ్ ఆధ్వర్యంలో కౌకుంట్ల బస్టాండ్ కూడలిలో జన్మదిన కేకును కట్ చేశారు. ఒకరికొకరు సంతోషము గా తినిపించుకొని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె. బి.ఆర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా కౌకుంట్ల మండల కేంద్రంలో నిర్వహించుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన ముఖ్య నాయకులు, కౌకుంట్ల మండలానికి చెందిన అన్ని గ్రామాల అధ్యక్షులు, అన్ని విభాగాల అధ్యక్షులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.




## రాజీవ్ రెడ్డి గారి అధ్యక్షతన ఇండిపెండెంట్ కౌన్సిలర్లను అధికారికంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరిక



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 17 (స్కై న్యూస్):** జోగులంబ గద్వాల జిల్లాలో ప్రజాబంగ్లా లోని రాజీవ్ రెడ్డి అధ్యక్షతన 29వ వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థి అయిన సత్యం ని మరియు 32 వార్డు ఇండిపెండెంట్ అభ్యర్థి అయిన ముత్యాల లక్ష్మి ని ప్రజాబంగ్లా లో అధికారికంగా పార్టీ కండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించడం జరిగింది.

వార్తాతరంగాలు
బుధవారం 18 ఫిబ్రవరి 2026

# మునిసిపాలిటీల అభివృద్ధిపై దృష్టి సారించాలి...



నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 17( స్కై న్యూస్) ఇటీవల జరిగిన మునిసిపల్ ఎన్నికలలో ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి ఆదరించి అత్యధిక మెజార్టీ స్థానాలను కట్టబెట్టారని ఇక నిధులను సద్వినియోగం చేసి అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సాధించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించినట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తెలిపారు మంగళవారం మంత్రి వాకిటి శ్రీహరి ఎంపీ మల్లు రవితో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి మునిసిపాలిటీ కైవసం చేసుకున్న అంశంపై వివరించడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మునిసిపల్ అభివృద్ధికి నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే 1000 కోట్ల నిధులకు పైగా మునిసిపల్ అభివృద్ధికి మంజూరు చేయడం జరిగిందని రాబోయే రోజుల్లో మరిన్ని నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు పట్టణ అభివృద్ధికి పలు పనులను ముఖ్యమంత్రితో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు

# పేట నూతన చైర్మెన్, వైస్ చైర్మన్ లకు ఘన సన్మానం...





నారాయణపేట ఫిబ్రవరి 17:( స్కై న్యూస్) నారాయణపేట మున్సిపాలిటీ నూతన చైర్మెన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్మన్ మంజుల జి ఆర్ రెడ్డి లను మంగళవారం అధికారులు,మిత్రమండలి సభ్యు లు,అభిమానులు శాలువా లు,పూలమాలలతో ఘనంగా సన్మానించి మిఠాయిలు తిని పించారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు సన్మానిం చి అభినందనలు తెలిపా రు.మున్సిపల్ కమిషనర్ నర్సయ్య,సిబ్బంది వారిని సన్మానించి మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.అలాగే స్నేహ మిత్ర మండలి సభ్యులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శీల చంద్రశేఖర్ రెడ్డి,డి.మల్లేష్, మిర్చివెంకటయ్య,సైదప్ప,బిజెపి నాయకులు శేఖర్ గౌడ్,జలాల్పూర్ నారాయ ణరెడ్డి తదితర అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సన్మానించారు.

# విద్యార్థిని విద్యార్థులకు ల్యాప్ టాప్, దివ్యాంగుళాలకు ట్రై స్కూటీలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



దేవరకద్ర భూత్పూర్ ఫిబ్రవరి 17 (స్కై న్యూస్); దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మండలం పాత మొల్గర గ్రామం లోదేవరకద్ర మండల కేంద్రానికి చెందిన జి. రాజేష్, ఎన్.పల్లవి, చిన్న చింతకుంట మండలం నెల్లికొండి గ్రామానికి చెందిన వి. నిఖిత, మూసాపేట్ మండలం కొమ్మిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన బి. సౌమ్య, నందిపేట గ్రామానికి చెందిన ప్రణీత రెడ్డి తదితర విద్యార్థి, విద్యార్థినులకు పై చదువుల నిమిత్తం ల్యాప్ టాప్ లు ఎస్ జి డి ఫార్మా జనరల్ మేనేజర్ దీపక్ సూద్ తో కలిసి ఎమ్మెల్యే జి. మధుసూదన్ అందజేశారు.అనంతరం కౌకుంట్ల మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన శ్యామ్ కి, చిన్న చింతకుంట మండలం గూడూరు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, కౌకుంట్ల మండలం ఇస్రంపల్లి గ్రామానికి చెందిన షబ్బీర్ తదితర దివ్యాంగులకు (ట్రై) స్కూటీలు ఎస్ జి డి ఫార్మా జనరల్ మేనేజర్ దీపక్ సూద్ తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సర్పంచులు, ఉప సర్పంచులు, నాయకులు కార్యకర్తలు తో పాటు విద్యార్థినీ, విద్యార్థులు వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు

## మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



దేవరకద్ర ఫిబ్రవరి 17 (స్కై న్యూస్); దేవరకద్ర మండలంలోని వెంకటయ్య పల్లి లో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ మల్లన్న స్వామి మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీ మల్లన్న స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బండారు కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవరకద్ర నియోజకవర్గం ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ఆకాంక్షించినట్లు మాజీ ఎమ్మెల్యే ఆల తెలిపారు.

# శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 17(స్కై న్యూస్):గద్వాల పట్టణంలోని పెద్ద అగ్రహారంలో వెలసిన శ్రీ అభయము ఒక ఆంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గట్టు శ్రీధర్ రావు ఆధ్వర్యంలో స్వామివారికి ఆకు పూజ అలంకార సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు 33 వ వార్డు కౌన్సిలర్, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి తుమ్మల నరసింహులు యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేసి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ గురులోక్ మాసంధ్ ప్రభు బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పా ట్లు పూర్తి చేయాలి..

## కలెక్టర్ సిక్తా పట్నాయక్



నారాయణపేట ఫిబ్రవరి 17: (స్కై న్యూస్) నారాయణపేట జిల్లా కొత్తప ల్లి మండలంలోని తిమ్మారెడ్డి పల్లి లో ఏప్రిల్ 1 నుంచి 4 వరకు జరిగే శ్రీ గురు లోక్ మాసంద్ ప్రభు ( బావోజి) బ్రహ్మోత్సవాలకు అధికారు లు పగడ్బందీగా అన్ని ఏర్పా ట్లు పూర్తి చేయాలని నారా యణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. నాలుగు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆలయ అవర ణలో సంబంధిత శాఖల అధి కారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఉత్సవాల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు తమకు అప్పగిం చిన బాధ్యతలను సమర్థవం తంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ కు నోడల్ అధికారి పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు జాతర ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా వి.ఐ.పి మేనేజ్ మెంట్ జాగ్ర త్తగా చూసుకోవాలని సూచిం చారు. దేవాదాయ శాఖ పరం గా ఏం ఏర్పాట్లు చేశారని అడిగారు. ఆలయానికి, రథా నికి కలర్స్ వేయిస్తున్నామని, మిగతా జాతర ఏర్పాట్లు చేస్తున్నామని ఈ.వో తెలి పారు. జాతర కోసం తమ శాఖ నుంచి మొత్తం 15 మంది ఉద్యోగులు సిబ్బందిని డిప్యూట్ చేయగా ప్రస్తుతాని కి ఇద్దరు వచ్చి విధుల్లో చేరా రని, మిగతా 13 మంది రెండు రోజుల్లో వస్తారని ఈ.వో తెలిపారు. గతేడాది మాదిరిగానే ఈ సారి ఆల యంలో సీసీ కెమెరాలు అమర్చుతామని ఈ. వో తెల పగా, పోలీసు శాఖ కోరినట్లు మొత్తం సీసీ కెమెరాలు ఏర్పా టు చేయాలని కలెక్టర్ ఆదేశిం చారు. మిషన్ భగీరథ పరం గా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నీటి వసతి కొరకు ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎలాంటి ప్రాబ్లం లేకుండా చూడాలన్నా రు. డోర్స్ తదితర దానికి సెప్టిక్ ట్యాంక్ మెయింటెనెన్స్ గ్రామపంచాయతీ వాళ్ళు చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎనిమిది వాకి టాకీలు కావాలని అధికారు లు అడిగారు. దేవాదాయ శాఖ ఆర్ జె సి ఆధ్వర్యంలో క్యూలైన్లు ఏర్పాటు చేయా లని 20 మందిని నియమించి వెళ్లేలా చర్యలు తీసుకోవాల ని దేవాలయంలో లోపల డెకరేషన్ చేయాలన్నారు. డిపిఓ 3 పర్యాయాలు షిఫ్ట్ పద్ధతిన 500 మంది సిబ్బంది ని ఏర్పాటు చేయాలన్నారు. డీఎంహెచ్వో ఆధ్వర్యంలో అన్ని ఏర్పాటు చేయాలని మూడు క్యాంపులు పెట్టాలని మొబైల్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. రెండు ఫైర్ వాహనాలు ఏర్పాటు చేయా లన్నారు. డిఆర్డిఏ ఆధ్వ ర్యంలో ప్రాజెక్టు డైరెక్టర్ మొబై ల్ టాయిలెట్స్ బస్సు ట్యాంక ర్ దగ్గర బట్టలు మార్చుకొ నుటకు వెదురు తడకలతో తాత్కాలిక బాత్రూమ్ స్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ శాఖ ఎస్ ఈ ఆధ్వ ర్యంలో విద్యుత్ సరఫరా కై 20 మంది సిబ్బందిని ఏర్పా టు చేయాలని మొబైల్ ట్రాన్స్ఫార్మర్, లుస్ లైన్స్ లేకుండా ఏర్పాట్లు చేయాల న్నారు. రవాణా సంస్థ వారు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని తెలిపారు. తాసి ల్దార్ కొత్తపల్లి కంట్రోల్ రూమ్ చూడాలని మద్దూర్ ఎంపీడీ వో జాతర అయిన తర్వాత కూడా సిబ్బంది అందుబాటు లో ఉండాలన్నారు. బడ్జెట్ కొరకు దేవాదాయ శాఖ తయారు చేయాలని. రెగ్యు లర్ ఈవో ఉండాలని దేవాల య ఫౌండర్ మాజీ చైర్మన్ ఆఫ్ టెంపుల్ గోపాల్ కోరినా రూ. ఎక్సైజ్ శాఖ రెండు మొబైల్ టీమ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్ శాఖ సీసీ కెమెరాలు బార్కెట్లు బందో బస్తు పార్కింగ్ ఏర్పా టు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, డి. ఎస్. పి. లింగయ్య, ఆర్. డి. ఓ. రామచందర్ అధికారులు, సి.ఐ.ఎస్.ఐ. దేవాలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ మాజీ చైర్మన్ ఆఫ్ టెంపుల్ గోపాల్, గ్రామ సర్పం చ్, తదితరులు పాల్గొన్నారు.

# వికాసిత్ నారాయణపేట బిజెపి పాలకవర్గం లక్ష్యం

**బీజేపీకి పట్టం కట్టిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు**

**బిజెపి పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్**




నారాయణపేట ఫిబ్రవరి 17: (స్కైన్యూస్) మున్సిపాలిటీ బిజెపి నూతన పాలకవర్గం నారా యణపేట వికాసిత్ లక్ష్యంగా పని చేస్తుందని నారాయణ పేట పట్టణ బిజెపి అధ్యక్షుడు పోషల్ వినోద్ అన్నారు. మంగళవారం ఆయన విలే కరుల సమావేశంలో బి జె వి ఎం పట్టణ అధ్యక్షుడు మణి కంఠ, మీడియా ఇంఛార్జి కిరణ్ లతో కలిసి మాట్లాడు తూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారం,ఎంపి డి కే అరుణ సహకారంతో పట్టణాన్ని అభి వృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు.బిజెపి జెండాను నారాయణపేట మున్సిపాలి టీ పై ఎగుర వేయడానికి సహకరించిన పట్టణ ఓటర్లు అందరికీ ధన్యవాదాలు తెలి పారు. అభ్యర్థుల ఎన్నిక దగ్గర నుండి ఎన్నికల పూర్తి అయ్యి చైర్మన్ ప్రమాణ స్వీకా రం వరకు సహకారం అందిం చిన ఎంపీ డికే అరుణ కు ధన్యవాదాలుతెలిపారు.అలాగే ప్రతి వార్డులో ప్రచారం నిర్వహించి బిజెపి అభ్యర్థుల ను గెలిపించేందుకు కృషి చేసిన బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామా జీ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే. రతంగ్ పాండు రెడ్డి, ఎన్నికల ఇంచార్జీ శ్రీకాంత్ రెడ్డి,కో కన్వీనర్లు రఘు రామ య్య గౌడ్,మిర్చి వెంకటయ్య లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.పట్టణంలోని 24 వార్డ్ లకు గాను 12 సీట్లు బీజేపీ కి అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజ లు ఎల్లప్పుడు మాకు సూచన లు సలహాలు అందించి మాకు మార్గదర్శకత్వం గా ఉన్న మీడియాకు కృతజ్ఞ తలు తెలిపారు.కొద్ది తేడాతో కొన్ని వార్డ్ లు కోల్పోయిన పుటికీ గెలుపు అంచుదాకా తీసుకెళ్లిన ప్రతి ఒక్కరికి, పోస్టల్ బ్యాలెట్ బీజేపీ కి అనుకూలంగా వేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజల అభిమానం ఎల్లపుడు ఇలాగే ఉండాలని కోరారు.

# ఘనంగా మాజీ సిఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



నారాయణపేట ఫిబ్రవరి 17:( స్కై న్యూస్):తెలంగాణ రాష్ట్రతొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 72 వ జన్మదిన వేడుకలు నారాయణపేట లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ శాసనస భ్యులు బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్. రాజేందర్ రెడ్డి ఆదేశానుసారం లిపట్టణ అధ్యక్షుడు విజయ సాగర్ ఆధ్వర్యంలో నిర్వహిం చారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు విజయ్ సాగర్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వ కుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ ఖ్యాతిని భారత దేశమంత వ్యాపింప చేసి దేశంలో తెలంగాణ ఉనికిని చాటిన గొప్ప మహనీయుడు అన్నారు. తెలంగాణ రాష్ట్రం లో ఏర్పాటు చేసిన పథకాల ను అన్ని రాష్ట్రాలకు ఆదర్శ ప్రాయంగా నిలవడం జరి గిందన్నారు. ఇందులో మిషన్ భగీరథ మిషన్ కాకతీయ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని ఓల్డ్ ఏజ్ హోమ్లో లో ,చిన్నపిల్లల ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ చేసి యాదగిరి రోడ్డులోగల పార్టీ కార్యాల యంలో కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో 7వార్డ్ కౌన్సిల ర్ భరత్ 3వార్డ్ కౌన్సిలర్ నారా యణమ్మ నాయకులు తిరుపతమ్మ, సుదర్శన్ రెడ్డి ప్రతాపరెడ్డి కన్న జగదీష్ రామ్ రెడ్డి గురు లింగప్ప కోటకొండ రాములు గట్టు రఘు తిరుపతి మొగులప్ప,రఘు బోయ లక్ష్మణ్ పూడూరు శీను సురేందర్రెడ్డి మల్రేడ్ అనిల్ కుమార్ కమల్ బాలు హనుమంతు దేవరాజ్ ముఖ్యమైన కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణా జాతిపిత బాపు కెసిఆర్ పుట్టిన రోజు సంబరాలు





కొత్తగూడెం ఫిబ్రవరి 17 (స్కై న్యూస్): మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ శ్రీమతి కాపు సీతా లక్ష్మి నేతృత్వంలో ఘణంగా కెసిఆర్ బర్తడే వేడుకలు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు కార్యకర్తల సమక్షంలో బర్తే కేక్ కట్ చేసి అనంతరం కెసిఆర్ ఉద్యమ స్మృతులను గుర్తుకు చేసుకున్నారు.శ్రీమతి కాపు సీతా లక్ష్మి తెలంగాణ భవన్ ఆవరణంలో కెసిఆర్ లాంగ్ లీవ్ అంటూ నినాదాలు చేస్తూ మొక్కను నాటి బాపు కెసిఆర్ నిండు నూరేళ్లు జీవించాలని నిండు మనసు తో ఆమె కోరుకున్నారు.బంగారు తెలంగాణ బాపు వల్లనే సాధ్యమవుతుందని తెగింపు, కొట్లాడే ధైర్యాన్ని తెలంగాణా ప్రజలకు అలవాటు చేసింది బాపు మాత్రమేనని సీతా లక్ష్మి అన్నారు.ఈ కార్యక్రమానికి తెలంగాణా రాష్ట్రా నాయకులు ఉద్యమ నేత వనమా రాఘవేందర్, సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ బాధవత్ శాంతి,రుక్మంగాధర్,ప్రసాద్, వేణు, బి శ్రీను, అహ్మద్, శ్రీధర్,పూర్ణ,శ్రీకాంత్ రామాకాంత్, వైల్డ్ ఫైర్ కన్ని సర్పంచ్ లు శ్రీకాంత్, కార్పొరేటర్ లు, మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వార్డులో లో ఓల్టేజీ సమస్య తీర్చండి

**ఎస్పీ కి కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ వినతి**



నారాయణపేట ఫిబ్రవరి 17:( స్కై న్యూస్) నారాయణపేట పట్టణం మూడవ వార్డులో లోల్టేజి తో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని మూడవ వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ విద్యుత్ శాఖ ఎస్పీ నవీన్ కుమార్ ను కోరారు.మంగళవారం ఆయన కార్యాలయంలో కలిసి ఎస్పీ నీ సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె వార్డులో విద్యుత్ సమస్యపై వివరిస్తూ అదనపు ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసి లోల్టేజి సమస్యను పరిష్కరించాలని కొత్తగా ఏర్పాటు చేసిన స్తంభాలకు కరెంట్ తీగలు అమర్చాలని కోరారు.కాగా నూతనంగా కౌన్సిలర్ గా ఎన్నికైన కాకర్ల నారాయణమ్మ ను ఎస్పీ నవీన్ శాలువాతో సన్మానించి సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ ఈ మహేష్, సిబ్బంది పాషా,మల్లేష్,సందీప్,చందు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని కలిసిన నూతన కౌన్సిలర్లు

**నూతన కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 17 :- రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ కౌన్సిలర్ లుగా ఎన్నికైన సందర్భంగా నందారం అశోక్,వాని పాండురంగ రెడ్డి,అరిఫా బేగం (అడ్డుఅజాజ్) బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తాండ్ర వెంకట్ రెడ్డి, పోమాల్ పల్లి సర్పంచ్ భూపాల్ రెడ్డి,భాను శర్మ,దినేష్ సాగర్, రామ్ నగర్ లడ్డు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మహాలింగేశ్వర స్వామి వారి గుడి సన్నిధిలో అత్యంత వైభవంగా పార్వతీ పరమేశ్వర కళ్యాణ మహోత్సవం



రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 17 :- రంగారెడ్డి జిల్లా కేశంపేట్ మండలం కాకునూర్ గ్రామంలోని శ్రీ మహాలింగేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలో జరిగిన శ్రీ పార్వతీ పరమేశ్వర కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో కేశంపేట జడ్పిటిసి శ్రీమతి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## షాద్ నగర్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు

**పెద్ద సంఖ్యలో హాజరైన పార్టీ కార్యకర్తలు, నాయకులు**

**సర్కార్ దవాఖానాలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ**

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 17 :–** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతోపాటు, అభివృద్ధి పథంలో తెలంగాణ రాష్ట్రాన్ని నడిపి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా తీర్చిదిద్దిన ఘనుడు, మహనీయుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ కొనియాడారు తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చడంతో పాటు దశాబ్ద కాలం పాటు తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో తీర్చిదిద్ది దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన మహనీయుడు గొప్ప పరిపాలకుడు కేసీఆర్ అని గుర్తు చేశారు రైతుబంధు రైతు బీమా కళ్యాణలక్ష్మి హరితహారం కేసిఆర్ కిట్లు ఆసరా పింఛన్లు మిషన్ కాకతీయ మిషన్ భగీరథ వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజలకు అండగా ఉన్నారని అన్నారు అధికారం కోల్పోయి రెండేళ్లు గడిచిన




నేటికీ కేసీఆర్ ని తలచుకుంటున్నారన్నారు ఆయన పాలన తీరును మర్చిపోలేకపోతున్నారని చెప్పారు దేవుడి ఆశీర్వాదం ప్రజల ఆశీర్వాదంతో ఆయన నిండు నూరేళ్లు బ్రతికి తెలంగాణ ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు ఇందులో భాగంగానే ప్రత్యేకంగా తయారు చేసిన కేక్ ను కట్ చేసి పార్టీ శ్రేణులకు, అభిమానులకు తినిపించారు కార్యాలయం ఆవరణలో సంబరాలు జరుపుకున్నారు మహిళా కార్యకర్తలు సైతం ఉత్సాహంగా పాల్గొని కేసీఆర్ కు శుభాకాంక్షలు తెలిపారు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు ప్రత్యేక ఆకర్షణగా



నిలిచారు అనంతరం కార్యాలయావరణంలో మొక్కలను నాటారు షాద్ నగర్ సర్కార్ దవాఖానాలో రోగులకు పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు కేసీఆర్ జన్మదినశీ ఓ పండుగ వాతావరణాన్ని తలపించిందని పలువురు నేతలు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, ఆకుల శ్రీశైలం, మాజీ కార్పోరేషన్ చైర్మన్ రాజవరప్రసాద్, రాజ్యలక్ష్మి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, పట్టణ అధ్యక్షులు ఎం. ఎస్. నటరాజన్, నియోజకవర్గంలోని ప్రధాన ప్రముఖ నేతలు, కార్యకర్తలు, నూతన కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్పొరేట్ లో కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు



**సింగరేణి ఫిబ్రవరి 17 )స్కై న్యూస్ ):**కార్పొరేట్ లో వైస్ ప్రెసిడెంట్ తుమ్మ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 72వ జన్మదిన వేడుకలను తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్పొరేట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది.నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని రాబోయే రోజులలో మళ్ళీ తెలంగాణకు ముఖ్యమంత్రి కావాలని మాట్లాడటం జరిగినది.ఈ రోజుల్లో సింగరేణిలో 20వేల మంది పైచిలుకు యువ ఉద్యోగులు పనిచేస్తున్నారు అంటే దానికి కారణం కేసీఆర్ గారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కేంద్ర వైస్ ప్రెసిడెంట్ కూసాన వీర భద్రం ,సెంట్రల్ జాయింట్ సెక్రటరీ వాసికర్ల కిరణ్ కుమార్ ,సెంట్రల్ కమిటీ సభ్యులు కంచర్ల శ్రీనివాస్ ,సెంట్రల్ వర్క్ షాప్ ఫిట్ సెక్రటరీ సూరజ్ ,సివిల్ ఇంజనీరింగ్ పిట్ కార్యదర్శి మోయ సూర్యనారాయణ,మెయిన్ వర్క్ షాప్ పిట్ సెక్రెటరీ జై పాల్ ,అమర్ ,శ్రవణ్ ,రమేష్ ,ఎలిది వెంకటేశ్వర్లు , నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగినది.

## గ్రామాల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు నాయకత్వం వహించాలి

**నూతన సర్పంచులకు రెండవ విడత శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**కొత్తగూడెం ఫిబ్రవరి 17 (స్కై న్యూస్ ):**గ్రామాల సమగ్రాభివృద్ధిలో గ్రామపంచాయతీ సర్పంచుల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న నిధులను నియమ నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా వినియోగించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సర్పంచులకు పిలుపునిచ్చారు.నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచుల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రత్యేక రెండవ విడత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కెఎస్ఎం ఓల్డ్ క్యాంపస్)లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం 471 మంది గ్రామపంచాయతీ సర్పంచులకు విడతల వారీగా శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రెండవ విడత శిక్షణ కార్యక్రమం 17 ఫిబ్రవరి నుండి 21 వరకు నిర్వహించనున్నట్లు వివరించారు.రెండవ విడతలో భాగంగా అశ్వరావుపేట, దమ్మపేట, దుమ్ముగూడెం, ములకలపల్లి, జూలూరుపాడు, టేకులపల్లి, ఇల్లందు, లక్ష్మీదేవిపల్లి మండలాలకు చెందిన 233 మంది నూతన సర్పంచులు శిక్షణలో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులకు గ్రామ పాలన, పరిపాలన విధానాలు, బాధ్యతలు, కర్తవ్యాలపై సమగ్ర అవగాహన కల్పించడమే ఈ శిక్షణ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని అన్నారు.శిక్షణలో భాగంగా పంచాయతీ రాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామపంచాయతీలకు అందుతున్న అభివృద్ధి పథకాల నిధులను సక్రమంగా వినియోగించి తాగునీరు, పారిశుద్ధ్యం,



రహదారులు, విద్యుత్, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వీధిదీపాలు, విద్యుత్ స్తంభాలు, పబ్లిక్ టాయిలెట్లు వంటి వసతుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ప్రతి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల పరిస్థితిని సర్పంచులు నిరంతరం పర్యవేక్షించి చిన్నారులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందుతున్నదీ లేదో పరిశీలించాలని సూచించారు. అక్షరాస్యత పెంపు, విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.జిల్లాలో ఉన్న పర్యాటక అవకాశాలను సద్వినియోగం చేసుకుని గ్రామాల ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇల్లందు పూబెల్లి, రోళ్ళపాడు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి ప్రాంతాల్లోని కారుకొండ, జూలూరుపాడు ప్రాంతంలోని వ్యవసాయ విశిష్టతలను విస్తృతంగా ప్రచారం చేస్తే పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందే అవకాశముందని తెలిపారు.సర్పంచులు పంచాయతీ శాఖకే పరిమితం కాకుండా గ్రామంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని చొరవ తీసుకోవాలని స్పష్టం చేశారు.




ప్రతి గ్రామంలో ఇప్ప, ఇప్పపువ్వు చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా గ్రామస్తులకు అదనపు ఆదాయ వనరులు సృష్టించవచ్చని, పశుసంపద అభివృద్ధి, మేత సంపద పెంపుతో ప్రభుత్వ సబ్సిడీలుగ్రామాల్లో పొందే అవకాశముందని వివరించారు.18 నుండి 20 సంవత్సరాల లోపు నిరుద్యోగ యువతపై ప్రత్యేక దృష్టి సారించి, జిల్లా యంత్రాంగం నిర్వహించే ఇంటర్వ్యూలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించి యువతను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని సర్పంచులను కోరారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సర్పంచులకు శిక్షణ కిట్లను అందజేశారు. గ్రామ పాలనకు అవసరమైన మార్గదర్శక పుస్తకాలు, చట్టపరమైన సూచనలు, అభివృద్ధి పథకాల సమాచార పత్రాలు తదితర అంశాలు కిట్లలో అందజేయబడినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీపీఓ సుధీర్, శిక్షణ డీపీఓ అనూష, డీఎల్పీఓలు ప్రభాకర్, రమణ, టీజీఐఆర్డీ సెంటర్ హెడ్ సుభాష్ చంద్ర గౌడ్, ట్రైనర్లు బన్సింగ్, రవీందర్ రెడ్డి, సునీల్ కుమార్, ముత్యాలరావు, హజ్రత్ వలి, ఏపీవో రంగ, ఎస్బీఎం రేవతి, డిటిఎం సందీప్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ మాసం సందర్బంగా మస్జీద్ ల వద్ద విథిదీపాలు ఏర్పాటు చేయండి

**మున్సిపల్ కమీషనర్ కు వినతి పత్రం సమర్పించిన ముస్లిం మైనారిటీ సభ్యులు**

**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ ఫిబ్రవరి 17 :–** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలో రంజాన్ మాసం సందర్బంగా మసీదుల వద్ద విధిదీపాలు ఏర్పాటు చేయాలని షాద్ నగర్ మున్సిపల్ కమీషనర్ కు వినతి పత్రం సమర్పించిన ముస్లిం మైనారిటీ సభ్యులు ఈ నేల 19 వ తేది నుండి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో షాద్ నగర్, ఫరూక్ నగర్ లో గల మస్జిద్ ల వద్ద విధి దీపాలు ఏర్పాటు చేయాలనీ అదేవిధంగా కాలనీ లలో పరిశుభ్రత చేయాలని ముస్లిం నాయకులు కోరారు కొన్ని కాలనీ లలో నీళ్ల సమస్య ఉన్నందున నీళ్లు రాని సందర్భంలో వాటర్ ట్యాంకర్ లను ఏర్పాటు చేయాలనీ షాద్ నగర్, ఫరూక్ నగర్ ముస్లిం మైనారిటీ నాయకుల అధ్యర్యంలో మున్సిపల్ కమీషనర్ సునీతరెడ్డి కి వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మహమ్మద్ ఇబ్రహీం, మహబూబ్, ముబారక్ అలీ ఖాన్, కబీర్, ఖదిర్, అలీం సఖీబ్,ఇషాక్ తదితరులు ఉన్నారు.





## అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్న సర్పంచ్ ఉప సర్పంచ్

**సిసి రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్ ఉప సర్పంచ్**

**చుంచుపల్లి ఫిబ్రవరి 17 (స్కై న్యూస్ ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ గ్రామ పంచాయతీ అభివృద్ధి వైపు పరుగులు పెడుతుంది . ఎన్నికలలో సిపిఐ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ కొత్తగూడెం శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు ఆధ్వర్యంలో విద్యానగర్ గ్రామపంచాయతీ అభివృద్ధివైపులు పరుగులు పెడుతుంది. అభివృద్ధిలో భాగంగా మంగళవారం విద్యానగర్ పంచాయతీ పరిధిలో కొత్త సిసి రోడ్డు పనులు ప్రారంభించిన చుంచుపల్లి మండల కార్యదర్శి విద్యానగర్ ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి విద్యానగర్ సర్పంచ్ బుక్య శాంతి శ్రీ. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి పంచాయతీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



## విద్యతోనే మహిళా సాధికారత,సామాజిక న్యాయం





**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**నారాయణపేట ఫిబ్రవరి 17 (స్కైన్యూస్)** విద్యతోనే మహిళా సాధికారత, సామాజిక న్యాయం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం మీటింగ్ హాల్ లో జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ– జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధురాలు శ్రీమతి సరోజిని నాయుడు జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు, విద్య మహిళలకు జ్ఞానం, ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తుంది. ఇది లింగ సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ, సామాజిక వివక్షను, బాల్య వివాహాలను అరికట్టాలి. సరోజినీ నాయుడు మహిళా చైతన్యానికి ప్రతీక అని కొనియాడారు.స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మరియు జిల్లా సంక్షేమ అధికారి రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ మహిళా చైతన్యం, సమగ్ర సాధికారత కోసం సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో మహిళలు చురుకైన పాత్ర పోషించి, రాణించాలని పిలుపునివ్వడం జరిగింది. విద్య, సమాన అవకాశాలు, ఆర్థిక స్వాలంబన (ఉపాధి), మరియు రాజకీయ నిర్ణయాధికారంలో భాగస్వామ్యం ద్వారానే మహిళలు నిజమైన అభివృద్ధిని, వ్యక్తిగత స్వేచ్ఛను సాధించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్, బాలల సంక్షేమ మండలి చైర్మన్ అశోక్ శ్యామల , డీపీఆరోఓ రషీద్, అధికారి బాల్ రాజ్, సీడీపీఓలు వెంకటమ్మ , రోజా , పార్వతి , సూపర్వైజర్లు , అంగన్వాడీ టీచర్లు మరియు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ - 2026 వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి:జిల్లా కలెక్టర్



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 17 (స్కై న్యూస్):**జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంటర్ విద్య, పాఠశాల విద్య,రెవెన్యూ,పోలీసు, రవాణా,వైద్య ఆరోగ్యం,విద్యుత్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 25 నుండి మార్చ్ 16 వరకు జరిగే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో 8,471 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లు 4,366 సెకండ్ ఇయర్ 4,105 మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు,డిపార్ట్మెంట్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలని తెలిపారు.స్ట్రాంగ్ రూము ను పోలీస్ స్టేషన్ లోనే ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రశ్నాపత్రాల రవాణాకు పోలీస్ ఎస్కార్ట్ ఇవ్వడంతో పాటు పరీక్షల పర్యవేక్షణ కోసం ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ,పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు సెల్‌ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు,తగిన మందులతో ఆశాలను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,ఆర్డీఓ శ్రీనివాస రావు,అడిషనల్ ఎస్పీ శంకర్,జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు,విద్యుత్ శాఖ అధికారి రమేష్ బాబు,ఆర్టీసీ అధికారి సునీత,విద్యా శాఖ సహాయ అధికారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

# టీచర్లకు ఎఐ ప్రత్యామ్నాయమా?

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అనేది ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం అవుతుందా అనే చర్చ జరుగుతోంది. అది ఒక సహాయక సాధనం మాత్రమే. తరగతి గదిలో మానవ స్పర్శ, సానుభూతి, స్ఫూర్తిని ఎఐ భర్తీ చేయలేదని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎఐ అనేది ఉపాధ్యాయుల పాత్రను మెరుగుపరచడానికి ఉద్దేశించింది. అయితే వారిని భర్తీ చేయడానికి కాదంటున్నారు. ఎఐ పరిపాలనా పనులను ఆటోమేట్ చేయగలదు, వ్యక్తిగతీకరిం చిన అభ్యాస అనుభవాలను అందించగలదు.మానవ సంబం ధాలను నిర్మించడానికి, మానసిక మద్దతును అందించడానికి, అర్థవం తమైన అభ్యాస అనుభవాలను సులభతరం చేయడానికి మాన వులైన ఉపాధ్యాయులు ఇప్పటికీ చాలా అవసరం. వారి నేపథ్యం లేదా సామర్థ్యాలతో సంబంధం లేకుండా విద్యార్థులందరికీ ఎఐ సాధనాలు అందుబాటులో ఉంటాయి. విద్యలో ఎఐ అమలులో 'సమానత్వం' అనేది ఒక ముఖ్యమైన అంశంగా ఉండాలి. వ్యక్తిగతీకరించిన బోధన, తక్షణ అభిప్రాయం, లక్షిత జోక్యాలను అందించడం ద్వారా ఎఐ అభ్యాస ఫలితాలను మెరుగుపరుస్తుంది. ఇది విద్యార్థుల ప్రత్యేక అవసరాలు, అభ్యాస శైలిలకు అనుగుణంగా అభ్యాస సామగ్రిని మార్చగలదు. అంతేకాకుండా అభ్యాసకుల గోప్యత, డేటా భద్రత కలిగి ఉంటాయి. విద్యార్థుల డేటాను రక్షించడానికి బలమైన గోప్యతా విధానాలు, భద్రతా చర్యలను కలిగి ఉండటం ఎంతో ముఖ్యం. ఈ ప్రశ్నలు, ఆందోళనలను పరిష్కరించడం ద్వారా, విద్యావేత్తలు విద్యలో ఎఐ అమలు గురించి సరైన నిర్ణయాలు తీసుకోవచ్చు. విద్యలో ఎఐ రంగం నిరంతరం అభివృద్ధి చెందుతోంది. భవిష్యత్తులో అనేక ట్రెండ్స్‌ని అనుసరిస్తుంది. విద్యార్థుల వ్యక్తిగత అవసరాలను తీర్చడానికి అభ్యాస సామగ్రిని, జోక్యాలను సర్దుబాటు చేయడంలో ఎఐ వ్యవస్థలు మరింత అధునాతనంగా మారతాయి. ఈ వ్యక్తిగతీకరించిన విధానం అభ్యాస ఫలితాలను మరింత మెరుగుపరుస్తుంది. ఎఐ –ఆధారిత చాట్‌బాట్‌లు, వర్చువల్ అసిస్టెంట్‌లు సహజ భాషను అర్థం చేసుకోవడంలో, ప్రతిస్పందించడంలో మరింత అభివృద్ధి చెందుతాయి. విద్యార్థులకు తక్షణ మద్దతు, మార్గదర్శకత్వాన్ని అందిస్తాయి. విద్యా డేటాను విశ్లేషించడంలో, విద్యావేత్తల కోసం కార్యాచరణ విధానాలను రూపొందించడంలో ఎఐ అల్గారిథమ్‌లు మెరుగుపడుతూనే ఉంటాయి. ఇది డేటా ఆధారిత నిర్ణయాధికారం, వ్యక్తిగతీకరించిన బోధనను సాధ్యం చేస్తుంది. ఎఐ సాంకేతికతలు అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీతో అనుసంధానించబడతాయి. ఈ ధోరణులు విద్యను మార్చే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మరింత ఆకర్షణీయమైన, సమర్థవంతమైన అభ్యాస వాతావరణాలను




సృష్టిస్తాయి.విద్యలో ఎఐ అనేక ప్రయోజనాలను అందిస్తుంది. విద్యలో ఎఐని అమలు చేయడం అనేది నమ్మదగిన డేటా లభ్యత, ప్రత్యేక సాంకేతిక నైపుణ్యం వంటి సవాళ్లతో కూడి ఉంటుంది. ఉత్తమ పద్ధతులను అనుసరించడం ద్వారా, విద్యావేత్తలు తరగతి గదిలో ఎఐని విజయవంతంగా అనుసరించి ఫలితాలు సాధించవచ్చు. విద్యా రంగంలో ఆన్‌లైన్ కోర్సుల రూపకల్పన, నిర్వహణలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎన్నో అవకాశాలను కలిగిస్తోంది. విద్యావేత్తలను శ్రమతో కూడిన పనులనుండి విముక్తి చేస్తుంది. ఇది సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, కంటెంట్ ఎల్లప్పుడూ ప్రస్తుత పరిస్థితులకు తగినట్లుగా ఉండేలా చూస్తుంది. పరిపాలనా పనులను ఇప్పుడు ఎఐ ఉపయోగించి ఆటోమేట్ చేయవచ్చు. దీనివల్ల అధ్యాపకులు తమ దృష్టిని పూర్తిగా విద్యార్థులపై కేంద్రీకరించడానికి అవకా శం ఉంటుంది. అంటే వారు విద్యార్థులకు మరింత సమయం కేటాయించవచ్చు. దీనివల్ల ఏ విద్యార్థి వెనుకబడిపోకుండా చూసుకోవచ్చు. విద్యార్థుల నేర్చుకునే విధానాలను విశ్లేషించడం ద్వారా, 'అడాప్టివ్ ఎఐ' టూల్స్ వారి ప్రత్యేక శైలికి అనుగుణంగా పాఠాలను అందిస్తాయి. టెక్స్ టు –స్పీచ్, విజువల్ రికగ్నిషన్, స్పీచ్ రికగ్నిషన్ వంటి ఎఐ సామర్థ్యాలను ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకోసం ప్రత్యేకంగా రూపొందించవచ్చు. వర్చువల్ ట్యూటర్స్ ప్రాధాన్యత మరింతగా పెరుగుతోంది. ఇవి చాట్‌బాట్‌లా కాకుండా వ్యక్తిగత గురువులా వ్యవహరిస్తాయి. అర్ధరాత్రి సందేహం వచ్చినా, టీచర్ కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా ఎఐ ద్వారా వెంటనే వివరణ పొందవచ్చు. ప్రతి విద్యార్థి గ్రహణశక్తి ఒకేలా ఉండదు. ఎఐ దీనిని గుర్తించి.. పాఠం వినడంలో ఇబ్బంది పడుతుంటే, మరిన్ని ఉదాహరణలతో సులభంగా వివరిస్తుంది. పరీక్షా పత్రాల మూల్యాంకనం, హాజరు వంటి పరిపాలనా పనులను ఎఐ చూసుకుంటుంది. దీనివల్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు నైతిక విలువలు, సృజనాత్మకతను నేర్పడంపై ఎక్కువ సమయం కేటాయించగలరు. ఏ విద్యార్థి పరీక్షల్లో వెనుకబడే అవకాశం ఉందో ఎఐ డేటాద్వారా ముందే గుర్తించి ఉపాధ్యాయులను హెచ్చరిస్తుంది. ఎఐ ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాదు. వారి సామర్థ్యాలను పెంచడానికి మాత్రం ఎంతగానో ఉపయోగపడుతుంది.

# 3 నగరాల్లో ఫుడ్ స్ట్రీట్స్...



**వరంగల్ ఫిబ్రవరి 17:**తెలంగాణలోని హన్మకొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల ప్రజలకు గుడ్ న్యూస్. సాయంత్రం కుటుంబంతో కలిసి స్ట్రీడ్ ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఈ మూడు నగరాల్లో త్వరలోనే హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే దీని కోసం స్థలాల అన్వేషణ పూర్తి కాగా.. త్వరలోనే మిగతా ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ఫుడ్ స్ట్రీట్లలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని భావించే వారు ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి.చాలా మందికి స్ట్రీట్ ఫుడ్ అంటే ఇష్టం. సాయంత్రం అయితే చాలు బజ్జీలు, పునుగులు, పానీపూరీ.. ఇలా ఏదో ఒకటి లాగించకపోతే మనసు ఊరుకోదు. అయితే వాటిని తయారు చేయడానికి ఎలాంటి పదార్థాలు వాడుతున్నారు? వాటిని విక్రయించే ప్రదేశాల్లో పరిసరాలు శుభ్రంగా ఉంటాయో లేవో అనే భయం చాలా మందికి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే ప్రజలకు హైజనిక్ స్ట్రీట్ ఫుడ్ అందేలా చూడటం కోసం కేంద్రం ప్రభుత్వం కీలక ప్రయత్నం చేస్తోంది. దేశవ్యాప్తంగా 100 హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే 86 సెంటర్లకు అనుమతులు ఇచ్చింది. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ఒక్కో సెంటర్ కోసం కోటి రూపాయలు చొప్పున నిధులు మంజూరు చేస్తోందిఈ క్రమంలోనే తెలంగాణలోని హనుమకొండ, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లో హెల్తీ అండ్ హైజినిక్ ఫుడ్ స్ట్రీట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ నగరాల్లో ఫుడ్ స్ట్రీట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలను సైతం గుర్తించారు. సామాన్య ప్రజలు ఆహారం క్వాలిటీ గురించి, అందులో వాడిన పదార్థాల గురించి ఎలాంటి భయం లేకుండా.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఫుడ్‌ను ఎంజాయ్ చేసేలా ఫుడ్ స్ట్రీట్స్ ఉంటాయి. దుమ్ము ధూళితో ఇబ్బంది లేకుండా చూడటం కోసం, సులభంగా శుభ్రం చేసేందుకు వీలుగా ఫుడ్ స్ట్రీట్స్ ప్రాంగణం మొత్తం టైల్స్ వేస్తారు.రాత్రి టైంలో ఆకర్షణీయమైన లైటింగ్‌ను సైతం ఏర్పాటు చేయనున్నారు.ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్ ఉన్న వారికి మాత్రమే ఫుడ్ స్ట్రీట్స్‌లో స్టాల్స్ కేటాయిస్తారు. **FSSAI** నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూస్తారు. ఆహార పదార్థాలను ఎలా జాగ్రత్తపర్చాలి, పరిశుభ్రంగా ఎలా ఉండాలనే విషయమై వెండర్లకు ట్రైనింగ్ కూడా ఇవ్వనున్నారు. ఈ స్టాల్స్‌లో వంట చేసే వారు, ఆహారాన్ని అందించేవారు తప్పనిసరిగా చేతులకు గ్లోవ్స్ పెట్టుకోవాలి. వెంట్రుకలు ఆహారంలో పడకుండా తలకు అఫ్రాన్ పెట్టుకోవాలి. గోర్లు పెంచుకోవడం, వేళ్లకు ఉంగరాలు పెట్టుకోవడం కుదరదు. పొగాకు నమలడం, సిగరెట్లు, బీడీలు కాల్చడం నిషేధం. ఆహార పదార్థాల తయారీకి వాడే ముడిసరుకులతోపాటు, ఫుడ్ ఐటెమ్స్ క్వాలిటీని ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు.అంతే కాదు ఈ ఫుడ్ స్ట్రీట్స్‌లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి కస్టమర్లు తాగడానికి శుద్ధ జలాన్ని అందిస్తారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి ప్రత్యేకంగా వాష్ ఏరియాలు ఉంటాయి. ఫ్యామిలీతో సరదాగా టైం గడుపుతూ, ఫుడ్‌ను ఎంజాయ్ చేయడం కోసం బెంచీలను ఏర్పాటు చేస్తారు.

# కౌన్సిల్ సంఖ్యాబలం? నాయకత్వ పోరాటం

తెలంగాణ పట్టణ రాజకీయాల్లో మరో కీలక మలుపుకు నేడు తెరలేపుతోంది. వార్డు సభ్యుల ఎన్నికలతో వ్యక్తమైన ప్రజా తీర్పు ఇప్పుడు మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల రూపంలో అధికార నిర్మాణంగా మారబోతోంది. పట్టణ స్థానిక సంస్థలు కేవలం పరిపాలనా యంత్రాంగాలే కావు; ప్రజల దైనందిన జీవన ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, పౌర సేవల నాణ్యత ? ఇవన్నీ ఇక్కడే నిర్ణయ మవుతాయి. అందుకే ఈ ఎన్నికలు స్థానిక రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర రాజకీయ దిశను సూచించే సూచికలుగా భావించబడు తున్నాయి. ప్రజాస్వామ్యంలో అత్యంత దగ్గర స్థాయిలో జరిగే ఈ ప్రక్రియలో ప్రజల అభిప్రాయం, పార్టీల వ్యూహాలు, స్థానిక సామాజిక సమీకరణాలు కలిసి ఒక సమగ్ర రాజకీయ దృశ్యాన్ని సృష్టిస్తున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణ మొత్తం రాజ్యాంగబద్ధ వ్యవస్థలో భాగంగా జరుగుతోంది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను పర్యవేక్షిస్తూ నియమ నిబంధనలను అమలు చేస్తున్నది తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం. ఎన్నికల షెడ్యూల్ నుంచి ఫలితాల ధృవీకరణ వరకు ప్రతి దశలో పారదర్శకత, చట్టబద్ధతను కాపాడే బాధ్యత ఈ సంస్థపై ఉంది. వార్డు సభ్యుల ఎన్నికల అనంతరం కౌన్సిల్ ఏర్పడుతుంది. ఆ కౌన్సిల్‌లోని ఎన్నికైన సభ్యులే మేయర్ లేదా చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈ విధానం ప్రత్యక్ష ప్రజా తీర్పు మరియు ప్రతినిధి ప్రజాస్వామ్యం మధ్య సమతుల్యతను సూచిస్తుంది. కొన్ని చోట్ల ఎక్స్–అఫిషియో సభ్యుల పాత్ర, చట్టపరమైన వివరణలు, పార్టీ విప్‌లు వంటి అంశాలు ఎన్నికల ఉత్కంఠను పెంచుతాయి. ప్రస్తుతం నిర్వహించిన పట్టణ ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా అనేక మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను కవర్ చేశాయి. వేల సంఖ్యలో వార్డుల్లో జరిగిన పోటీ పట్టణ ఓటర్ల చైతన్యాన్ని ప్రతిబింబించింది. నీటి సరఫరా, పారిశుధ్యం, ట్రాఫిక్, రహదారులు, పట్టణ ప్రణాళిక, పన్నుల నిర్వహణ వంటి సమస్యలు ఎన్నికల ప్రధాన అజెండాగా నిలిచాయి. స్థానిక సమస్యలపై స్పష్టమైన హామీలు ఇచ్చిన అభ్యర్థులకు ప్రజలు ప్రాధాన్యం ఇచ్చినట్టు ఫలితాల ధోరణి సూచిస్తోంది. పట్టణ ఓటరు ఇప్పుడు అభివృద్ధి, సేవల నాణ్యత, పరిపాలనా సమర్థత ఆధారంగా నిర్ణయం తీసుకుంటున్నాడనే అభిప్రాయం బలపడుతోంది.ఫలితాల పరంగా చూస్తే పట్టణ రాజకీయాల్లో స్పష్టమైన పోటీ కనిపించింది. అధికారంలో ఉన్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అనేక పట్టణాల్లో ముందంజలో నిలవడం ద్వారా కౌన్సిళ్లలో ఆధిక్యాన్ని సంపాదించింది. రాష్ట్ర నాయకత్వం, ముఖ్యంగా రేవంత్ రెడ్డి ముందుంచిన అభివృద్ధి,



సంక్షేమ దృక్కోణం పట్టణ ఓటర్లపై ప్రభావం చూపిందనే విశ్లేషణ వినిపిస్తోంది. కౌన్సిల్‌లో స్పష్టమైన సంఖ్యాబలం ఉన్న చోట మేయర్, చైర్మన్ ఎన్నికలు సులభతరంగా జరిగే అవకాశం ఉంది. అయితే పట్టణ రాజకీయాల్లో స్థానిక నాయకత్వం, వ్యక్తిగత ప్రభావం కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ప్రధాన ప్రతిపక్షంగా నిలుస్తున్న భారత్ రాష్ట్ర సమితి అనేక పట్టణాల్లో గట్టి పోటీ ఇచ్చింది. గత పాలనలో చేపట్టిన పట్టణ మౌలిక వసతుల అభివృద్ధిని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఈ పార్టీ తన బలం నిలబెట్టుకునే ప్రయత్నం చేసింది. కొన్ని కౌన్సిళ్లలో స్పష్టమైన మెజారిటీ దక్కకపోయినా, కీలక స్థానాల్లో ప్రభావం చూపే స్థాయిలో సభ్యత్వాన్ని సాధించింది. హంగ్ పరిస్థితుల్లో ఈ పార్టీ పాత్ర మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. స్వతంత్ర సభ్యుల మద్దతు, వ్యూహాత్మక చర్చలు, రాజకీయ సమన్వయం ? ఇవన్నీ నాయకత్వ ఎన్నికల్లో నిర్ణయాత్మకంగా మారవచ్చు. పట్టణ స్థాయిలో విస్తరణ లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ కూడా గణనీయ ప్రదర్శన కనబరిచింది. మధ్యతరగతి పట్టణ ఓటర్లను ఆకర్షించే అభివృద్ధి వాదన, స్థానిక సమస్యలపై దృష్టి ఈ పార్టీకి కొన్నిచోట్ల కీలక స్థానాలను తెచ్చిపెట్టాయి. ఇదే సమయంలో నగర ప్రాంతాల్లో ప్రభావం కలిగిన ఆల్ ఇండియా మజ్లిస్–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ తన సామాజిక ఆధారాన్ని నిలబెట్టుకుంటూ కొన్ని కౌన్సిళ్లలో ప్రభావాన్ని కొనసాగిస్తోంది. ఈ వైవిధ్యం పట్టణ రాజకీయాల బహుముఖ స్వరూపాన్ని ప్రతిబింబిస్తుంది.ఈ ఎన్నికలలో ముఖ్యంగా గమనించాల్సిన అంశం హంగ్ కౌన్సిళ్ల పెరుగుదల. అనేక పట్టణాల్లో ఏ ఒక్క పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో స్వతంత్రులు, చిన్న పార్టీలు కీలక పాత్రలోకి వచ్చాయి.

ఇలాంటి సందర్భాల్లో రాజకీయ చర్చలు, కూటములు, వ్యూ హాత్మక మద్దతులు ప్రధానమవుతాయి. సభ్యుల నిర్ణయాలు, పార్టీ విప్‌లు, చట్టపరమైన పరిమితులు ? ఇవన్నీ కలిసి నాయకత్వ ఎన్నికల దిశను నిర్ణయిస్తాయి. ప్రజాస్వామ్యంలో చర్చా సంస్కృతి, రాజీ రాజకీయాలు ఇక్కడ స్పష్టంగా కనిపి స్తాయి. మేయర్ లేదా చైర్మన్ పదవి పట్టణ పాలనలో కేంద్ర స్థానం. పట్టణ బడ్జెట్ వినియోగం, అభివృద్ధి ప్రాధాన్యాల నిర్ణయం, పౌర సేవల సమన్వయం, పరిపాలనా పర్యవేక్షణ ? ఇవన్నీ నాయకత్వంపై ఆధారపడి ఉంటాయి. కౌన్సిల్‌తో సమ న్వయం సాధించడం, అధికార యంత్రాంగంతో సమర్థంగా పని చేయడం, ప్రజా సమస్యలకు వేగంగా స్పందించడం ? ఇవి విజయవంతమైన పట్టణ పాలనకు అవసరమైన లక్షణాలు. అందువల్ల ఈ ఎన్నికలు కేవలం రాజకీయ విజయాల కొలమానం కాకుండా పట్టణ ప్రజల జీవన నాణ్యతను ప్రభావితం చేసే నిర్ణాయక దశ. పూర్వ ఎన్నికలతో పోలిస్తే పట్టణ ఓటర్ల ప్రాధాన్యతల్లో మార్పు కనిపిస్తోంది. వ్యక్తిగత సేవా చరిత్ర, స్థానిక సమస్యలపై అవగాహన, అభివృద్ధి దృక్కోణం ? ఇవి అభ్యర్థుల ఎంపికలో కీలక ప్రమాణాలుగా మారాయి. పార్టీ గుర్తింపు ఉన్నప్పటికీ, స్థానిక నాయకత్వం ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఇది పట్టణ ప్రజాస్వామ్యంలో పరిపక్వతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు.పార్టీల వ్యూహాల పరంగా చూస్తే స్పష్టమైన సంఖ్యాబలం ఉన్న చోట నాయకత్వ ఎన్నికలు సులభంగా జరిగే అవకాశం ఉంది. హంగ్ పరిస్థితుల్లో మాత్రం చర్చలు, మద్దతు సమీకరణాలు కీలకం. ప్రతి పార్టీ తనకు అనుకూలమైన కూటమి నిర్మాణానికి ప్రయత్నిస్తోంది. స్వతంత్ర సభ్యుల ప్రాధాన్యం పెరగడంతో రాజకీయ చాతుర్యం పరీక్షకు లోనవుతోంది. ఈ ప్రక్రియ మొత్తం పట్టణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు. మొత్తం మీద ఈ పట్టణ ఎన్నికలు తెలంగాణ రాజకీయ దిశను ప్రతిబింబిస్తున్నాయి. ప్రజా తీర్పు ఆధారంగా ఏర్పడే కౌన్సిళ్లు, వాటి నుంచి ఎన్నికయ్యే నాయకత్వం పట్టణాభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించే సామర్థ్యం కలిగి ఉంది. పారదర్శక పరిపాలన, సమర్థ సేవల అమలు, ప్రజల భాగస్వామ్యం ? ఇవే విజయవంతమైన పట్టణ పాలనకు మూల స్తంభాలు. నేడు జరుగుతున్న మేయర్, చైర్మన్ ఎన్నికలు ఆ దిశగా కీలక అడుగు. పట్టణ ప్రజాస్వామ్యం బలపడితేనే రాష్ట్ర అభివృద్ధి స్థిరంగా ముందుకు సాగుతుంది. తెలంగాణ పట్టణ రాజకీయాల్లో ఈ ఎన్నికలు ఒక కీలక మైలురాయిగా నిలిచి, భవిష్యత్ పాలనా రూపురేఖలను నిర్దేశించనున్నాయి.

## ప్రారంభమైన సీబీఎస్ఈ పరీక్షలు



మొదటి పరీక్ష రాస్తేనే రెండో దానికి అవకాశం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:**సీబీఎస్ఈ పదో తరగతి బోర్డు పరీక్షలు మంగళవారం (ఫిబ్రవరి 17) నుంచి ప్రారంభమైనాయి. మరోవైపు ఈ ఏడాది నుంచి సీబీఎస్సీ టెన్త్ పరీక్షలు రెండు విడతల్లో జరగనున్నట్లు ఇప్పటికే బోర్డు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తొలి విడత పక్కన పెట్టి.. నేరుగా రెండో ఎడిషన్‌లో మాత్రమే పరీక్షలు రాస్తామంటూ కొందరు విద్యార్థులు బోర్డుకు అభ్యర్ధనలు చేశారు. వీటిని బోర్డు తోసిపుచ్చింది. విద్యార్థులంతా తొలి విడత పరీక్షలకు తప్పనిసరిగా హాజరుకావాలని, అలా హాజరైన వారికి మాత్రమే రెండో విడతలో అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. ఈ క్రమంలో రెండో విడతలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అర్హతలను బోర్డు ప్రకటించింది. అవేంటంటే..విద్యార్థులంతా తొలి విడత పరీక్షలకు తప్పనిసరిగా హాజరుకావాలి. ఇందులో ఉత్తీర్ణత సాధించినవారు మెరుగైన మార్కుల కోసం మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్, ల్యాంగ్వేజెస్ వంటి ఏవైనా 3 సబ్జెక్టుల్లో స్కోర్ మెరుగుపరచుకోవడానికి రెండో విడత రాసేందుకు అవకాశం ఉంటుంది.మొదటి విడత పరీక్షలో మూడు లేదా అంతకంటే ఎక్కువ పరీక్షలకు హాజరుకానివారు రెండో ఎడిషన్ పరీక్షలు రాయడానికి అనుమతి ఉండదు. ఈ విద్యార్థులు ఎసెన్షియల్ రిపీట్ కేటగిరీలో ఉంచుతారు. వీరంతా మరుసటి ఏడాది ఫిబ్రవరిలో జరిగే పరీక్షలకు మాత్రమే అనుమతిస్తారు.తొలి విడతలో రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను కంపార్ట్‌మెంట్ కేటగిరీలో ఉంచుతారు. దీనికింద రెండో ఎడిషన్ రాయడానికి ఆ విద్యార్థులు అనుమతి ఉంటుంది. 10వ తరగతి బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు స్వతంత్ర అదనపు సబ్జెక్టులలో హాజరయ్యేందుక అవకాశం ఉండదు.

కంపార్ట్‌మెంట్ ప్లస్ ఇంప్రూవ్‌మెంట్

**తొలి విడతలో ఉత్తీర్ణులైన విద్యార్థులు స్కోర్ పెంచుకునేందుకు రాయవచ్చు**

కాగా పదో తరగతి పరీక్షలు ఏడాదికి రెండుసార్లు చేపట్టనున్నట్లు సీబీఎస్సీ బోర్డు వెల్లడించిన సంగతి తెలిసిందే. సీబీఎస్ఈ పదో తరగతి తొలి విడత పరీక్షలు మార్చి 11 వరకు కొనసాగనున్నాయి. అయితే ఫిబ్రవరిలో జరిగే ప్రధాన పరీక్షల్లో మూడు లేదా అంతకంటే ఎక్కువ సబ్జెక్టులు రాయని ఏ విద్యార్థి కూడా అదే ఏడాది మే నెలలో జరిగే రెండవ బోర్డు పరీలక్షకు హాజరు కావడానికి అనుమతి ఉండదని జదీూజు స్పష్టం చేసింది. విద్యార్థులపై బోర్డు పరీక్షల ఒత్తిడి తగ్గించేందుకు వీలుగా నూతన జాతీయ విద్యా విధానం (చీజూూ) ఈ సిఫార్సులు చేసింది.

# కొర్రలు వర్సెస్ గోధుమ రవ్వ.. మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్‌లో ఏది బెటర్..!





కొర్రలు అధిక ఫైబర్, కాల్షియం, ఐరన్ కలిగి బరువు తగ్గింపు, మధుమేహ నియంత్రణకు అద్భుతంగా పనిచేస్తాయి. గోధుమ రవ్వతో పోలిస్తే, కొర్రలు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, ఎముకలను బలపరుస్తాయి, రక్తహీనతను నివారిస్తాయి. శక్తినిచ్చి, చర్మ ఆరోగ్యాన్ని కాపాడే కొర్రలు సంపూర్ణ ఆరోగ్యానికి ఉత్తమమైన ఎంపిక. కొర్రలు ఫైబర్ ఎక్కువగా ఉండి ఎక్కువసేపు ఆకలి రాకుండా చేస్తాయి. కొర్రలు కాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ః కాంప్లెక్స్ వంటి పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఎముకలు, రక్తం, జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. కొర్రలలో అధిక మొత్తంలో కాల్షియం ఉంటుంది. ఇది ఎముకలు, దంతాల బలాన్ని పెంచుతుంది. ఆస్టియోపోరోసిస్ వంటి ఎముకల సమస్యలను నివారించడంలో సహాయపడుతుంది. గోధుమ రవ్వ శరీరానికి శక్తినిచ్చే కార్బోహైడ్రేట్లను అందిస్తుంది. డైట్ లక్ష్యాన్ని బట్టి ఈ రెండింటినీ ఎంచుకోవాలి. శ్రమ ఎక్కువగా చేసే వారికి గోధుమ రవ్వ సరిపోతుంది. బరువు తగ్గే డైట్‌లో కొర్రలు ఐదు రెట్లు ఎక్కువగా పనిచేస్తాయి. బరువు తగ్గాలంటే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న కొర్రలు ఎక్కువగా ఉపయోగపడతాయి. కొర్రలు కడుపుకు తేలికగా జీర్ణమవుతాయి. కొర్రలు మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా ఉపయోగకరం. ఎందుకంటే, ఇందులో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటాయి., అంటే ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతాయి. జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం, గ్యాస్ లాంటి సమస్యలు తగ్గుతాయి. రక్తంలో షుగర్ లెవెల్స్ స్థిరంగా ఉండటానికి ఇది సహాయపడుతుంది. శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తూ అలసట తగ్గుతుంది. కొన్ని రోజుల్లోనే గోధుమ రవ్వ రుచికి అలవాటు పడిపోతారు. కొర్రలలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది మలబద్ధకం, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలను తగ్గిస్తుంది. గోధుమ రవ్వలో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల కడుపు ఎక్కువసేపు నిండిన భావన కలుగుతుంది.కొర్రలలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది, ఇది రక్తహీనత (అనీమియా) నివారణకు సహాయపడుతుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. కొర్రలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మరియు అమినో ఆమ్లాలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇవి వృద్ధాప్య లక్షణాలను తగ్గించి, చర్మం ప్రకాశవంతంగా కనిపించేలా చేస్తాయి.

# అవిసె గింజలతో చెడు కొలెస్ట్రాల్‌కు చెక్..



ఆరోగ్యంగా ఉండాలని ఎన్నో రకాల విదేశీ ఆహార పదార్థాల కోసం వెతుకుతూ ఉంటాం. కానీ మన వంటగదిలోనే పోషకాల గని దాగి ఉందని చాలామందికి తెలియదు. అవే 'అవిసె గింజలు'. చూడటానికి చిన్నవిగా కనిపించినా, ఇవి చేసే మేలు మాత్రం అపారం. ముఖ్యంగా గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ, పెరుగుతున్న బరువును అదుపు చేయడంలోనూ ఇవి మ్యాజిక్ లా పనిచేస్తాయి. నేటి కాలంలో ఒత్తిడి, సరిగ్గా లేని ఆహారపు అలవాట్ల వల్ల వచ్చే కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి సమస్యలకు అవిసె గింజలు ఒక సహజ సిద్ధమైన మందుగా ఉపయోగపడతాయి. అవిసె గింజల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే ఆల్ఫా లైనోలిక్ యాసిడ్ (ఒఒం) గుండె కండరాలను బలపరచడమే కాకుండా, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. అంతేకాకుండా, వీటిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండే ఈ గింజలను ప్రతిరోజూ ఒక చెంచా పొడి రూపంలో లేదా స్మూతీలలో కలుపుకొని తీసుకోవడం వల్ల గుండె పదిలంగా ఉంటుంది.

మన శరీరంలో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో అవిసె గింజలు అద్భుతంగా పనిచేస్తాయని పలు పరిశోధనలు వెల్లడించాయి. ఇందులో ఉండే కరగని ఫైబర్ (పీచు పదార్థం) జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. దీర్ఘకాలిక మలబద్ధక సమస్యతో బాధపడేవారు ఒక గ్లాసు నీటిలో నానబెట్టిన అవిసె గింజలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది మెటబాలిజం రేటును పెంచి, శరీరాన్ని చురుకుగా ఉంచుతుంది. బీపీ లేదా హైపర్ టెన్షన్ తో సతమతమయ్యే వారు ప్రతిరోజూ అవిసె గింజలను తీసుకోవడం శ్రేయస్కరం. ఇది సిస్టోలిక్, డిస్టోలిక్ బ్లడ్ ప్రెషర్ రెండింటినీ అదుపులో ఉంచుతుంది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ లో ఒక టేబుల్ స్పూన్ లేదా రాత్రి డిన్నర్ సమయంలో వీటిని ఆహారంతో పాటు తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా వాడటం వల్ల రక్తపోటు సహజంగానే అదుపులోకి వస్తుంది. వెయిట్ లాస్ జర్నీలో ఉన్నవారికి అవిసె గింజలు ఒక ఉత్తమ ఆహారం. ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల వీటిని తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. దీనివల్ల పదే పదే ఆకలి వేయదు, తద్వారా అతిగా తినడం తగ్గుతుంది. బరువు నిర్వహణలో ఉన్నవారు సలాడ్లు, చపాతీలు లేదా యోగార్ట్ లో వీటి పొడిని వేసుకొని తీసుకోవచ్చు.షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారికి, ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి అవిసె గింజలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని పొడి రూపంలో తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు హఠాత్తుగా పెరగకుండా ఉంటాయి. యోగార్ట్ లేదా పన్నీర్ వంటి ప్రోటీన్ ఆహారంతో కలిపి వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సున్నితత్వం పెరుగుతుంది. ఇందులో ఉండే లిగనన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి. అవిసె గింజలు మన ఆరోగ్యానికి ప్రకృతి ప్రసాదించిన వరం. అయితే వీటిని నేరుగా తినడం కంటే వేయించి లేదా పొడి చేసి తీసుకోవడం వల్ల పోషకాలు శరీరానికి మెరుగ్గా అందుతాయి. చపాతీ పిండిలో లేదా కూరల్లో కూడా వీటి పొడిని వాడుకోవచ్చు.

# రోజుకో అరటిపండు తింటే.. శరీరంలో జరిగేది తెలిస్తే నోరెళ్లబెడతారు



తక్కువ ధరలో.. సామాన్యుడికి సైతం అందుబాటులో ఉండే అరటిపండు తింటే డాక్టర్‌కు దూరంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో, ముఖ్యంగా జీర్ణవ్యవస్థను కాపాడటంలో అరటిపండును మించిన పండు లేదని పరిశోధనల్లో తేలింది. అందుకే దీనిని పొట్టకు అమృతం అని పిలుస్తారు. పోషకాల గని: ఒక అరటిపండును కేవలం చిరుతిండిగా చూడకూడదు. ఇది పోషకాల పవర్‌హౌస్. ఒక సాధారణ పరిమాణంలో ఉండే అరటిపండు సుమారు 105 కేలరీల శక్తిని అందిస్తుంది. ఇందులో 1.29 గ్రాముల ప్రోటీన్, 3.07 గ్రాముల ఫైబర్ ఉండటంతో పాటు విటమిన్ బి6, విటమిన్ సి పుష్కలంగా లభిస్తాయి. ముఖ్యంగా ఇందులో ఉండే 88.4 గ్రాముల నీటి శాతం శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. కొవ్వు శాతం దాదాపు శూన్యం కావడంతో బరువు తగ్గాలనుకునే వారు కూడా దీనిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. జీర్ణవ్యవస్థకు ప్రాణవాయువు: అరటిపండు జీర్ణక్రియను మెరుగుపరచడంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే రెసిస్టెన్స్ స్టార్చ్, ప్రీబయోటిక్ ఫైబర్ పేగులలోని మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా మారుతాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థ చురుగ్గా మారుతుంది. పచ్చి అరటిపండ్లలో ఉండే యాంటీ అల్సర్ గుణాలు కడుపులో గ్యాస్ సమస్యలను తగ్గించడమే కాకుండా కడుపు లోపలి పొరను రక్షిస్తాయి. తద్వారా అల్సర్లు, మలబద్ధకం వంటి సమస్యల నుండి శాశ్వత ఉపశమనం లభిస్తుంది. రక్తపోటు నియంత్రణలో మేటి: ప్రస్తుత ఒత్తిడితో కూడిన జీవితంలో రక్తపోటు అనేది ఒక సాధారణ సమస్యగా మారింది. అరటిపండులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది శరీరంలోని అదనపు సోడియం ప్రభావాన్ని తగ్గించి, రక్తనాళాల మీద ఒత్తిడిని తగ్గిస్తుంది. రోజూ ఒక అరటిపండు తింటే గుండె ఆరోగ్యంగా ఉండటమే కాకుండా స్ట్రోక్ వంటి ప్రమాదాలు దరిచేరకుండా ఉంటాయి. తక్షణ శక్తి - ఒత్తిడి నివారణ: పని ఒత్తిడిలో ఉన్నప్పుడు లేదా వ్యాయామం చేసిన తర్వాత నీరసంగా అనిపిస్తే.. అరటిపండు ఒక ఇన్స్టంట్ ఎనర్జీ బూస్టర్‌లా పనిచేస్తుంది. ఇందులో ఉండే సహజ చక్కెరలు తక్షణ శక్తినిస్తాయి. అంతేకాకుండా దీనిలోని యాంటీఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి మెదడును ప్రశాంతంగా ఉంచుతాయి.

# చిన్న వయసులోనే పిల్లల్లో మానసిక సమస్యలు కారణం అదేనని అంటున్న నిపుణులు!



చిన్న వయసులోనే పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం వల్ల వారి మానసిక, శారీరక అభివృద్ధి కుంటుపడుతుంది. కొంతమంది పిల్లలు ఈ మొబైల్ ఫోన్లకు ఎంతగా బానిసలయ్యారంటే తమ తల్లిదండ్రులతో కూడా సమయం గడపడం లేదు. వారి నుంచి మొబైల్ ఫోన్లను లాక్కుంటే తీవ్ర స్థాయిలో కోపం, అసహనం, మానసిక ఒత్తిడిని ప్రదర్శిస్తుంటారు. మొబైల్ ఫోన్లు, టీవీలు పిల్లల బాల్యాన్ని దోచుకుంటున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నేటి కాలంలో పిల్లలు బయట ఆడుకునే బదులు టీవీ చూస్తూ, ఫోన్లు వాడుతూ సమయం గడుపుతున్నారు. ఇది వారి మానసిక ఆరోగ్యం, శారీరక అభివృద్ధిని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తోంది.న్యూరో కేర్ సెంటర్‌కు చెందిన డాక్టర్ జాలీ జైన్ గుప్తా మాట్లాడుతూ.. సాధారణంగానే నేటితరం తల్లిదండ్రులు తమ పిల్లలకు తగినంత సమయం ఇవ్వలేకపోతున్నారు. అంతేకాకుండా పిల్లలు అల్లరి చేయకుండా ప్రశాంతంగా ఉంచడానికి మొబైల్ ఫోన్లు, టీవీల ముందు కూర్చోబెడుతున్నారు. ఇది పిల్లల మానసిక సమతుల్యతను మరింత దిగజార్చుతుంది. అంతేకాకుండా వారి సామాజిక, శారీరక అభివృద్ధి కూడా కుంగిపోతుంది. ఆటలు, క్రీడలు వంటి సహజ కార్యకలాపాలు కూడా తగ్గుతున్నాయి. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలతో పాటు తమకు తాముగా కఠినమైన పరిమితులను ఏర్పరచుకోవడం వంటి కొన్ని చిట్కాలను పాటించడం మంచిదని అన్నారు. 2 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న పిల్లలను మొబైల్ ఫోన్లకు పూర్తిగా దూరంగా ఉంచాలి. వారికి వీడియో కాల్స్ చేయడానికి కూడా అనుమతించకూడదు. ఈ వయస్సులో స్క్రీన్ వాడకంవల్ల మెదడు అభివృద్ధిపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుంది. 2 సంవత్సరాల కంటే ఎక్కువ వయసున్న పిల్లలకు స్క్రీన్ సమయం చాలా పరిమితం చేయాలి. చదవడానికి ఉపయోగించినప్పటికీ రోజుకు 15 నిమిషాల కంటే ఎక్కువ సమయం ఇవ్వకూడదు. వారిని ఆన్‌లైన్ గేమ్స్, వీడియోలు, రీల్స్‌కు దూరంగా ఉంచాలి. వీటన్నిటితో పాటు మొబైల్ ఫోన్లు ఉపయోగించే సమయాన్ని పరిమితం చేయాలి.

# బిజినెస్

## టీసీఎస్‌ను వెనక్కి నెట్టిన ఐసీఐసీఐ బ్యాంక్




దేశీయ ఐటీ సేవల దిగ్గజం టీసీఎస్‌కు వరుస దెబ్బలు తగులుతున్నాయి. మార్కెట్ విలువ పరంగా దేశంలో అత్యంత విలువైన సంస్థల జాబితాలో టీఎస్‌ను ప్రభుత్వ రంగ దిగ్గజం ఎస్‌బీఐ అధిగమించిన ఒకరోజులోనే మరో స్థానం కోల్పోయింది. గురువారం ప్రైవేట్ రంగ అతిపెద్ద ఐసీఐసీఐ బ్యాంక్ టీసీఎస్‌ను దాటి ఐదో స్థానం దక్కించుకుంది. దీంతో టీసీఎస్ ఆరో స్థానానికి పడిపోయింది. బ్లూమ్‌బెర్గ్ డేటా ప్రకారం, 2009, జూన్ తర్వాత మొదటిసారిగా ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాప్‌లో టీసీఎస్‌ను అధిగమించింది. సాయంత్రం స్టాక్ మార్కెట్లు ముగిసే సమయానికి ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ. 10.21 లక్షల కోట్లు ఉండగా, టీసీఎస్ విలువ రూ. 9.96 లక్షల కోట్లకు చేరింది. గురువారం ఐసీఐసీఐ బ్యాంక్ షేర్ ధర దాదాపు 22 శాతం పెరిగి రూ. 1,432కి చేరింది. ఇదే సమయంలో టీసీఎస్ షేర్ సుమారు 6 శాతం క్షీణించి రూ. 2,741.90 వద్ద ముగిసింది. ఇది 2020, డిసెంబర్ తర్వాత అత్యల్ప స్థాయి. బీఎస్ఈ డేటా ప్రకారం, ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ. 19.71 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో అత్యంత విలువైన సంస్థగా ఉంది. దీని తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్(రూ. 14.19 లక్షల కోట్లు), భారతీ ఎయిర్‌టెల్(రూ. 11.51 లక్షల కోట్లు)తో తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి.

## రిలయన్స్ చేతికి వెనెజువెలా చమురు!




వెనెజువెలా నుంచి ముడిచ మురును నేరుగా కొనుగోలు చేయడానికి, అమెరికా నుంచి సాధారణ లైసెన్స్‌ను ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) పొందింది. ప్రపంచంలోనే, ఒకేచోట అతిపెద్ద రిఫైనింగ్ సముదాయాన్ని గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కంపెనీ నిర్వహిస్తున్న ఆర్ఐఎల్, ఇందుకోసం భారీఎత్తున చమురు దిగుమతి చేసుకుంటూ ఉంటుంది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో, రష్యా నుంచి చమురు దిగుమతులను సంస్థ నిలిపేసిన సంగతి విదితమే. వెనెజువెలా నుంచి చమురు దిగుమతులు ప్రారంభమైతే, రిలయన్స్ రిఫైనింగ్ మార్జిన్లూ బలోపేతం కానున్నాయి. గత నెలలో వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధంలోకి తీసుకున్న అమెరికా, ఆ దేశ ముడిచమురు పరిశ్రమపై ఆంక్షలను సడలించింది. ఇప్పటివరకు ట్రేడర్ల ద్వారా వెనెజువెలా చమురును విక్రయించడానికి అమెరికా అనుమతి ఇచ్చింది. ఇప్పుడు ఆర్ఐఎల్‌కు లభించిన సాధారణ లైసెన్స్ వల్ల, ఏదైనా సంస్థ వెలికితీసిన లేదా ఆధీనంలో ఉన్న చమురును నేరుగా కొనుగోలు చేసే అధికారం లభిస్తుంది. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో పాలనపై 2019–20లో అమెరికా ఆంక్షలు విధించింది. అప్పటివరకు వెనెజువెలా ముడిచమురును ఆర్ఐఎల్ కొనుగోలు చేసినా, అంతటితో ఆపేసింది. 2024లో తాత్కాలిక ఉపశమనం ఇవ్వడంతో, మళ్లీ చమురును కొనుగోలు చేసింది. ఈ ఏడాదిలో ట్రేడర్ల ద్వారా వెనెజువెలా విక్రయాలు ప్రారంభమయ్యాక.. అంతర్జాతీయ ట్రేడింగ్ సంస్థ విటోల్ నుంచి 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రభుత్వ రంగ సంస్థలు ఐఓసీ, హెచ్‌పీసీఎల్ కూడా 2 మిలియన్ బ్యారెళ్లు కొనుగోలు చేశాయి. ఇందులో 5 లక్షల బ్యారెళ్ల చమురును విశాఖపట్నంలోని యూనిట్‌కు హెచ్‌పీసీఎల్ కేటాయించిందని సమాచారం.

## ఇన్ఫోసిస్ ఉద్యోగులకు 85 శాతం బోనస్

# ఫిబ్రవరి నెల జీతంతో పాటుగా..




భారత ఐటీ రంగం దిగ్గజం ఎనిటనీబఎబ ఉద్యోగులకు గుడ్ న్యూస్ అందించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలోని మూడో త్రైమాసికానికి (క్యూ3) సంబంధించి ఉద్యోగులకు చెల్లించే పనితీరు ఆధారిత బోనస్‌ను సగటుగా 85 శాతంగా ప్రకటించింది. ఇది ఇటీవల త్రైమాసికాలతో పోలిస్తే అత్యధిక బోనస్‌గా నిలవడం గమనార్హంగా చెప్పుకోవచ్చు. ఈ బోనస్ మొత్తం ఉద్యోగులకు ఫిబ్రవరి నెల జీతంతో పాటు చెల్లించనున్నట్లు సంస్థ అంతర్గత సమాచారంలో పేర్కొంది. ఇటీవల కాలంలో ఐటీ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ.. ఎనిటనీబఎబ మాత్రం వ్యాపార పరంగా స్థిరమైన ప్రదర్శన చూపింది. ముఖ్యంగా కొత్త ఒప్పందాలు దక్కించుకోవడం, ప్రాజెక్టుల అమలు మెరుగ్గా సాగడం వంటివి ఈ బోనస్ పెంపుకు ప్రధాన కారణాలుగా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. బోనస్ శాతం పెరగడం వల్ల ఉద్యోగుల మనోధైర్యం గణనీయంగా పెరిగిందని.. మార్కెట్‌లో టెక్నాలజీ షేర్లపై ఒత్తిడి ఉన్నా ఉద్యోగుల్లో మాత్రం సానుకూల భావన కనిపిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ త్రైమాసికంలో ఉద్యోగుల వ్యక్తిగత పనితీరు ఆధారంగా బోనస్ శాతాలు మారాయి. కొంతమంది ఉద్యోగులు 75 శాతం నుంచి 100 శాతం వరకు బోనస్ పొందినట్లు తెలిపారు. గత త్రైమాసికంతో పోలిస్తే సుమారు 10 నుంచి 15 శాతం వరకు ఎక్కువ బోనస్ దక్కిన సందర్భాలు కూడా ఉన్నాయి. అత్యుత్తమ పనితీరు కనబరిచిన కొందరికి పూర్తిస్థాయి. అంటే 100 శాతం బోనస్ లభించడం విశేషం. గత కొన్ని త్రైమాసికాల్లో ఇంత అధిక స్థాయిలో బోనస్ ఇవ్వడం అరుదైన విషయమని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఎనిటనీబఎబలో సుమారు 3.2 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ బోనస్ నిర్ణయం ఇటీవల విడుదలైన ఉద్యోగుల పనితీరు రేటింగ్స్ తర్వాత రావడం గమనించదగ్గ అంశం. గత సంవత్సరం కూడా పనితీరు ఆధారంగా సంస్థ 5 శాతం నుంచి 8 శాతం వరకు జీత పెంపు ఇచ్చిన సంగతి ఉద్యోగుల్లో ఆశలు పెంచుతోంది. ఈసారి బోనస్ పెరగడానికి ప్రధాన కారణం కంపెనీ ఆర్థిక పనితీరు మెరుగ్గా ఉండటమే. ఆదాయ వృద్ధి అంచనాల్లో స్థిరత్వం, లాభాల్లో మెరుగుదల, అలాగే కీలక మార్కెట్ల నుంచి వచ్చిన ఆర్డర్లు సంస్థకు బలాన్నిచ్చాయి. జనవరిలో ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో కంపెనీ మేనేజ్‌మెంట్ కూడా భవిష్యత్తుపై సానుకూల దృక్పథాన్ని వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు ఇచ్చిన అధిక బోనస్ సంస్థ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. బోనస్ పెరగడంతో పాటు, ఇప్పుడు ఉద్యోగులు తదుపరి దశగా జీతం పెంపు (పే రైజ్)పై ఆశలు పెట్టుకున్నారు. కంపెనీ మానవ వనరుల విభాగం గతంలో నిర్వహించిన టౌన్‌హాల్ సమావేశాల్లో కూడా వేరియబుల్ పే మెరుగ్గా ఉంటుందన్న సంకేతాలు ఇచ్చింది.

## ఫుడ్ డెలివరీ మార్కెట్‌లోకి అడుగు పెట్టిన ఫ్లిప్‌కార్ట్!




ఈ కామర్స్ విభాగంలో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చి ముందంజలో ఉన్న ఫ్లిప్‌కార్ట్.. ఇప్పుడు ఫుడ్ డెలివరీ రంగంలో కూడా అడుగుపెట్టనుంది. అయితే, కంపెనీ నిజానికి ఎప్పుడు ఈ సేవను ప్రారంభించనుందో, జొమాటో ఏ స్విగ్గీ వంటి ఫుడ్ డెలివరీ లీడర్లకు గట్టి పోటీ ఇవ్వగలదా అనే విషయాలు ఆసక్తి కలిగిస్తున్నాయి.వార్తల ప్రకారం, ఫ్లిప్‌కార్ట్ 2026 మే–జూన్ నాటికి బెంగళూరులో ప్రయోగాత్మకంగా ఫుడ్ డెలివరీ ప్రారంభించే అవకాశం ఉంది. ఆ తరువాత, 2026 చివరి లేదా 2027 ప్రారంభంలో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా ఈ సర్వీస్ అందుబాటులోకి రానుందని అంచనా.వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీలోకి అడుగుపెట్టిన తర్వాత, జొమాటో ఏ స్విగ్గీ వంటి లీడర్లకు గట్టి పోటీగా మారే అవకాశం ఉంది. కంపెనీ మార్కెట్ విలువ 2025 ఆర్థిక సంవత్సరానికి 9 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2030 నాటికి 25 బిలియన్ డాలర్ల వరకు చేరుతుందని అంచనా.ఫుడ్ డెలివరీ కోసం ఫ్లిప్‌కార్ట్ ఇప్పటికే ప్రత్యేక టీమ్ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గమనించదగ్గ విషయం ఏమిటంటే, రెండేళ్ల క్రితం ఫ్లిప్‌కార్ట్ ఓలా, పేటీఎం వంటి సంస్థలతో కలిసి ాఔఆఆ ద్వారా ఫుడ్ డెలివరీ రంగంలోకి రావాలని యోచించినప్పటికీ, ఆ చర్చలు ముందుకు వెళ్లలేదు. ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ మళ్లీ తెరమీదకు వచ్చింది, కానీ ఫ్లిప్‌కార్ట్ నుండి ఇంకా అధికారిక ప్రకటనలేదు.ప్రస్తుతం ఫుడ్ డెలివరీ కోసం మార్కెట్లో పలు ప్లేయర్లు ఉన్నా, జొమాటో ఏ స్విగ్గీ మాదిరిగానే సక్సెస్ సాధించలేకపోయారు. ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్ ప్రవేశించడం వల్ల ఫుడ్ డెలివరీ విభాగంలో ఎంత వరకు విజయం సాధించగలదో త్వరలోనే తెలుస్తుంది. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్ ఫుడ్ డెలివరీ వార్తలు బయటి వినిపించగానే, జొమాటో, స్విగ్గీ షేర్లలో కొద్దిగా తగ్గుదల కనిపించింది.

# స్పోర్ట్స్

## పాక్‌తో మ్యాచ్..

# అర్ష్‌దీప్ సింగ్ కంటే అతడే బెటర్





టీ20 ప్రపంచకప్–2026లో హైవోల్టేజ్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. ఈ మెగా టోర్నీలో భాగంగా ఆదివారం (ఫిబ్రవరి 15) కొలంబో వేదికగా భారత్–పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి దాయాది జట్టుకు మరోసారి ఓటమి రుచిని చూపించాలని భారత్ పట్టుదలతో ఉంది. అయితే పాక్ జట్టులో అద్భుతమైన స్పిన్నర్లు ఉండడంతో భారత్‌కు జట్టుకు గట్టి పోటీ ఎదురు కానుంది అని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత టీమ్ మెనెజ్‌మెంట్‌కు మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కీలక సూచన చేశారు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ స్థానంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోవాలని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. కాగా గురువారం(ఫిబ్రవరి 12) నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 93 పరుగుల తేడాతో భారీ విజయం సాధించినప్పటికీ, అర్ష్‌దీప్ సింగ్ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. "నమీబియాతో మ్యాచ్‌లో భారత బౌలర్లందరూ వికెట్లు తీశారు. అర్ష్‌దీప్ ఓ వికెట్ పడగొట్టినప్పటికి భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. అతడికి మూడు ఓవర్లు మాత్రమే కెప్టెన్ బౌలింగ్ చేయించాడు. శివమ్ దూబే సైతం రెండు ఓవర్లు బౌలింగ్ చేశాడు. హార్దిక్ పాండ్యా కూడా తన నాలుగు ఓవర్ల కోటాను పూర్తి చేశాడు. సూర్యకుమార్ యాదవ్ బౌలింగ్‌ను రొటేట్ చేసిన విధానం చూస్తుంటే పాక్ మ్యాచ్ కోసం ఒక ప్రణాళికతో ఉన్నట్లు కన్పిస్తోంది. పాక్‌తో మ్యాచ్‌కు అర్ష్‌దీప్ సింగ్ స్థానంలో కుల్దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశముంది. ఎందుకనేమో నమీబియాతో మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్‌కు బదులుగా పాండ్యాతో మొదటి ఓవర్ను బౌలింగ్ వేయించాడు. అదేవిధంగా శ్రీలంక పిచ్‌లు స్పిన్‌కు ఎక్కువగా అనుకూలిస్తాయి. భారత్ గతంలోనూ ఇక్కడ ముగ్గురు స్పిన్నర్లతో ఆడింది. కాబట్టి కుల్దీప్‌ను జట్టులోకి తీసుకోవడం మేలు" అని గవాస్కర్ 'స్టార్ స్పోర్ట్స్' డిబేట్‌లో పేర్కొన్నాడు.

## ఒమన్‌ను చిత్తు చేసిన ఐర్లాండ్.. సెమీస్ ఆశలు సజీవం




టీ20 ప్రపంచకప్–2026లో ఐర్లాండ్ బోణీ కొట్టింది. శనివారం కొలంబో వేదికగా జరిగిన గ్రూప్–బి మ్యాచ్‌లో ఒమన్‌పై 96 పరుగుల భారీ తేడాతో ఐర్లాండ్ ఘన విజయం సాధించింది. దీంతో ఐరిష్ జట్టు తమ ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు సాధించింది. టాపార్డర్ విఫలమైనప్పటికి మిడిలార్డర్ బ్యాటర్లు లోర్కాన్ టక్కర్, గారెత్ డెలానీ, జార్జ్ డాక్రెల్ అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. ముఖ్యంగా టక్కర్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. టక్కర్ కేవలం 51 బంతుల్లో 94 పరుగులు (10 ఫోర్లు, 4 సిక్సర్లు) చేసి నాటౌట్‌గా నిలిచాడు. డెలానీ 30 బంతుల్లో 56 పరుగులతో మెరుపు హాఫ్ సెంచరీ సాధించాడు. జార్జ్ డాక్రెల్ కేవలం 9 బంతుల్లోనే 5 సిక్సర్ల సాయంతో 35 పరుగులు చేశాడు. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ మూడు, కలీం రెండు వికెట్లు సాధించారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్.. ఐర్లాండ్ బౌలర్ల ధాటికి 18 ఓవర్లలో 139 పరుగులకే కుప్పకూలింది. ఒమన్ బ్యాటర్లలో ఆమిర్ కలీం (50),హమ్మద్ మీర్జా (46) రాణించగా.. మిగితా ప్లేయర్లంతా దారుణంగా విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో జాషువా లిటిల్ 3 వికెట్లు పడగొట్టగా.. బారీ మెక్‌కార్తీ, మాథ్యూ హంఫ్రీస్ చెరో రెండు వికెట్లు తీశారు.

## క్రికెట్‌కు బ్రేక్.. పదో తరగతి పరీక్షలు రాయనున్న వైభవ్ సూర్యవంశీ



నిన్నటివరకు మైదానంలో బౌలర్లను బెంబేలెత్తించిన భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు క్లాస్‌రూమ్‌లో కూర్చుని పరీక్షలు రాసేందుకు సిద్ధమయ్యాడు. ఫిబ్రవరి 17 నుంచి ప్రారంభం కానున్న సీబీఎస్‌ఈ పదో తరగతి బోర్డు పరీక్షలకు అతడు హాజరు కానున్నాడు. బిహార్‌లోని సమస్తిపూర్‌లోని పోదార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వైభవ్ ఈ పరీక్షలు రాయనున్నాడు. వైభవ్ సూర్యవంశీ మా పాఠశాలలో 10వ తరగతి బోర్డు పరీక్షలకు హాజరు కానున్నాడు. అతడికి ఇప్పటికే అడ్మిట్ కార్డ్ అందించాము. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు వైభవ్ రాక కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అతడు ఇంకా విద్యార్థి కాబట్టి ఎటువంటి ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం లేదు. అందరితో కలిసే పరీక్షలు రాయనున్నాడు. అందుకు తగ్గట్టు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు పోదార్ స్కూల్ ప్రిన్సిపాల్ నీల్ కిషోర్ సిన్హా పేర్కొన్నారు. కాగా 14 ఏళ్ల వైభవ్ ఐపీఎల్–2025లో రాజస్తాన్ తరపున కేవలం 15 బంతుల్లో సెంచరీ సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆ తర్వాత కూడా భారత్–ఎ జట్టు, అండర్–19 జట్టు తరపున సంచలన ప్రదర్శనలు చేశాడు. ఇటీవల జరిగిన అండర్–19 ప్రపంచకప్‌లో సైతం దుమ్ములేపాడు. ఇంగ్లండ్‌తో జరిగిన అండర్–19 ప్రపంచకప్ ఫైనల్‌లో 175 పరుగులతో సత్తాచాటిన వైభవ్.. భారత్‌ను ఛాంపియన్‌గా నిలిపాడు. మొత్తంగా 439 పరుగులు చేసిన వైభవ్ 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' గా నిలిచాడు.



# విశ్వక్ సేన్ 'ఫంకీ'కి డీసెంట్ స్టార్ట్.. వాలెంటైన్స్ వీక్ ఎఫెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా, 'జాతిరత్నాలు' ఫేమ్ దర్శకుడు అనుదీప్ కేవీ కాంబినేషన్‌లో వచ్చిన అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ ఫంకీ బాక్సాఫీస్ వద్ద డీసెంట్ ఓపెనింగ్స్ నమోదు చేసింది. ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మొదటి రోజే ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 2.5 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. వాలెంటైన్స్ వీక్ కావడంతో ముఖ్యంగా యూత్ ఆడియన్స్ థియేటర్లకు ఆకర్షితులవుతున్నట్టు కనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రానికి మంచి స్పందన లభిస్తోంది. ముఖ్యంగా నైజాం ఏరియాలో సుమారు రూ. 1.25 కోట్లు గ్రాస్ వచ్చినట్లు సమాచారం.
ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు రూ. 1 కోటి వరకు వసూళ్లు నమోదయ్యాయి. ఇక ఇతర రాష్ట్రాలు, ఓవర్సీస్ కలుపుకుని మరో రూ. 25 లక్షల వరకు గ్రాస్ వచ్చినట్లు ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. అనుదీప్ కేవీ స్టైల్ కామెడీ టైమింగ్, విశ్వక్ సేన్ ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్ సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సుమారు రూ. 15 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా బ్రేక్ ఈవెన్ సాధించాలంటే వచ్చే రోజుల్లో నిలకడైన కలెక్షన్లు అత్యవసరం. అయితే నేడు వాలెంటైన్స్ డే, రేపు ఆదివారం సెలవు దినం కావడంతో వీకెండ్‌లో వసూళ్లు పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. యంగ్ ఆడియన్స్ నుండి మంచి టాక్ రావడం కూడా సినిమాకు ప్లస్ పాయింట్‌గా మారుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కయాదు లోహర్ నటించగా, సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందించారు. ఇప్పటికే పాటలు సోషల్ మీడియాలో చార్ట్‌బస్టర్లుగా మారి సినిమాకు మంచి బజ్ తీసుకొచ్చాయి. మొత్తానికి కామెడీ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికగా వచ్చిన 'ఫంకీ'కి మొదటి రోజు డీసెంట్ స్టార్ట్ లభించడం చిత్రబృందానికి ఊరటనిచ్చింది. వీకెండ్ కలెక్షన్లు ఎలా ఉంటాయన్నదే ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది.




## 'బ్యాండ్ మేళం' వాలెంటైన్స్ గ్లింప్స్ వైరల్.. రోషన్‌శ్రీదేవి ఎమోషనల్ లవ్ స్టోరీపై పెరిగిన అంచనాలు

టాలీవుడ్ యంగ్ పెయిర్ హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటిస్తున్న లేటెస్ట్ లవ్ అండ్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్ బ్యాండ్ మేళం పై రోజురోజుకీ ఆసక్తి పెరుగుతోంది. కొత్త దర్శకుడు సతీష్ జవ్వాజి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ రచయిత కోన వెంకట్ సమర్పిస్తున్నారు. కోన ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై కావ్య, శ్రావ్యలు నిర్మిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం యువ ప్రేక్షకుల్లో మంచి బజ్ సొంతం చేసుకుంది. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్రబృందం 'బ్యాండ్ మేళం' స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌లో హీరో తన ప్రేమను వ్యక్తపరుస్తూ చెప్పిన ఎమోషనల్ డైలాగ్స్ ప్రేక్షకులను హత్తుకునేలా ఉన్నాయి. రొమాంటిక్ టోన్‌తో పాటు భావోద్వేగ సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ గ్లింప్స్ సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం విశేషం. 'బ్యాండ్ మేళం' పూర్తి స్థాయి ప్రేమకథగా ఉండబోతున్నప్పటికీ, ఇందులో కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేసినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతోంది. యువతను ఆకట్టుకునే రొమాన్స్‌తో పాటు హృదయాన్ని తాకే ఎమోషనల్ కంటెంట్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇంతకుముందు 'కోర్ట్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రోషన్‌శ్రీదేవి జంట మరోసారి ప్రేక్షకుల ముందుకు రావడం ఈ ప్రాజెక్ట్‌కు ప్లస్ పాయింట్‌గా మారింది.

# రాజాసాబ్‌లో డూప్ అంటూ ట్రోలింగ్.. స్పందించిన హీరోయిన్



ప్రభాస్– మారుతి కాంబినేషన్‌లో 'ది రాజాసాబ్' సినిమా ప్రకటించినప్పటి నుంచి విమర్శలు వెంటాడుతూనే ఉన్నాయి. తీరా సినిమా రిలీజయ్యాక కూడా ట్రోలింగ్స్ మరింత పెరిగాయే తప్ప ఆగలేవు. ముఖ్యంగా ప్రభాస్‌కు చాలాచోట్ల డూప్ ఉపయోగించడంపై విపరీతమైన విమర్శలు వచ్చాయి. ఓ ఫైట్ సీన్ కోసం హీరోయిన్ మాళవిక మోహనన్‌కు కూడా డూప్ ఉపయోగించడంతో తనను కూడా ట్రోల్ చేశారు.
ట్రోలింగ్‌పై స్పందించిన హీరోయిన్ తాజాగా ఈ వివాదంపై మాళవిక మోహనన్ స్పందించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ట్వీట్ చేసింది. ది రాజాసాబ్ సినిమాలో నేనే స్వతాహాగా స్టంట్స్ చేశానని చెప్పుకున్నాను. అయితే నా బాడీ డబుల్ (డూప్) యాక్షన్ సీన్‌లో ఉన్నట్లుగా ఓ ఫోటో వైరలవుతోంది. ఆ ఫోటోలో ఉన్న వ్యక్తి స్టంట్ ఆర్టిస్ట్.. అలాగే నా డూప్ కూడా!

**చిన్నతనం నుంచే..**

ముందుగా నేను చెప్పొచ్చేదేంటంటే.. నాకు యాక్షన్ అంటే ఇష్టం. ఫైట్ సన్నివేశాల్లో పాల్గొనడాన్ని ఆస్వాదిస్తాను. చిన్నతనం నుంచే నేను స్పోర్టివ్ అమ్మాయిని. కొత్త విషయాలు నేర్చుకోవడం, శరీరాన్ని ఛాలెంజ్ చేయడం అంటే చాలా ఇష్టం. రెండో విషయం.. సెట్‌లో ఎప్పుడూ స్టంట్ డబుల్స్ సిద్ధంగా ఉంటారు. నటీనటులు సొంతంగా యాక్షన్ సీన్స్ చేసినా సరే వారు అందుబాటులోనే ఉంటారు.

**రిస్కీ షాట్స్ మాత్రం..**

వారు అనుభవజ్ఞులు కాబట్టి.. యాక్షన్ డైరెక్టర్ వారిని ఫైట్ రిహార్సల్స్ చేయమని చెప్తాడు. ఫైనల్ షాట్ మాత్రం మాపై చిత్రీకరిస్తారు. అయితే కొన్ని సన్నివేశాలు చాలా ప్రమాదకరం అని భావించినప్పుడు నటులకు బదులుగా స్టంట్ డబుల్‌ను సీన్ పూర్తిచేయమని అడుగుతారు. ఎందుకంటే ప్రొఫెషనల్స్ అయితే ఏ సమస్యా లేకుండా వాటిని ఈజీగా చేయగలరు.

**వివరణ అక్కర్లేదు**

ఫైనల్‌గా.. నేను ఫైట్ సీన్స్ సమర్థవంతంగా చేసేందుకు నా స్టంట్ డబుల్ ఎంతగానో తోడ్పడింది అంటూ వీడియోలు షేర్ చేసింది. ఒక్క ట్వీట్ ద్వారా యాక్షన్ సీన్స్ తానే చేసినట్లు క్లారిటీ ఇచ్చింది. ఇది చూసిన అభిమానులు నువ్వు టాలెంటెడ్ అని మాకు తెలుసు.. నువ్వు ఎలాంటి వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు అంటున్నారు. ప్రస్తుతం రాజాసాబ్ హాట్‌స్టార్‌లో అందుబాటులో ఉంది.



# 'విశ్వనాథన్ అండ్ సన్స్'గా సూర్య వైరల్ అవుతున్న టైటిల్!

తమిళ అగ్ర దర్శకుడు సూర్య, దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించి ఆసక్తికరమైన అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. చూబతీఅఖు46 గా రాబోతున్న ఈ ప్రాజెక్ట్‌కి 'విశ్వనాథన్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకోగా.. కేవలం ఐదు రోజుల చిత్రీకరణ మాత్రమే మిగిలి ఉండటంతో నిర్మాతలు పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి సారించారు. ఈ చిత్రం విడుదల తేదీపై నిర్మాత నాగవంశీ క్లారిటీ ఇస్తూ.. సూర్య నటిస్తున్న మరో చిత్రం 'కరుప్పు' విడుదలైన మూడు నాలుగు నెలల తర్వాతే ఈ సినిమా థియేటర్లలోకి వస్తుందని స్పష్టం చేశారు. 'కరుప్పు' చిత్రం ఏప్రిల్ 2026లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉండటంతో, వెంకీ అట్లూరి దర్శకత్వంలోని ఈ మూవీ జూలై లేదా ఆగస్టు 2026లో విడుదల కానుంది. సూర్య కెరీర్‌లో విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

## ధనుష్‌తో పెళ్లి పుకార్లపై మృణాల్ ఠాకూర్ ఫుల్ క్లారిటీ.. ఏప్రిల్ 1న చేసుకుంటా అంటూ సెటైర్



సినీ ఇండస్ట్రీలో రూమర్స్ అనేవి కొత్త విషయం కాదు. ఇద్దరు నటీనటులు కలిసి ఒక ఈవెంట్‌లో కనిపించినా, సోషల్ మీడియాలో వారిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందనే వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. ఇదే పరిస్థితి ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మరియు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విషయంలో కూడా కనిపిస్తోంది. గత కొద్ది రోజులుగా వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారన్న ప్రచారం సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకూ హాట్ టాపిక్‌గా మారింది. ఈ రూమర్స్‌కు అసలు కారణం ఒక పార్టీ. ఓ ప్రైవేట్ ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ ఇద్దరూ కలిసి కనిపించడంతో మొదట సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దానికి తోడు మృణాల్ నటించిన ఓ సినిమా ఈవెంట్‌కు ధనుష్ హాజరుకావడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అప్పటి నుంచి వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని, త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారనే వార్తలు వరుసగా వినిపించాయి. మృణాల్ గతంలో "మేము కేవలం మంచి స్నేహితులమే" అని చెప్పినా కూడా ఈ ప్రచారానికి బ్రేక్ పడలేదు. కొందరు అయితే మరో అడుగు ముందుకేసి వాలెంటైన్స్ డే రోజున అంటే ఫిబ్రవరి 14న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారని కథనాలు సృష్టించారు.ఇటీవల తన హిందీ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ ఠాకూర్‌ను యాంకర్ నేరుగా ఈ విషయంపై ప్రశ్నించాడు. "ఫిబ్రవరి 14న ధనుష్‌తో పెళ్లి చేసుకుంటున్నారా?" అని అడగగా మృణాల్ నవ్వుతూ వ్యంగ్యంగా సమాధానం ఇచ్చింది. "ఫిబ్రవరి 14 కాదుడ ఏప్రిల్ 1న చేసుకుంటానేమో. ఎందుకంటే అది ఏప్రిల్ ఫూల్స్ డే కదా!" అంటూ చమత్కరించింది. ఈ వ్యాఖ్య సోషల్ మీడియాలో వెంటనే వైరల్ అయింది. అదే ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ, "ఈ రూమర్స్ ఎక్కడి నుంచి వచ్చాయో కూడా నాకు తెలియదు. కొందరు 'మృణాల్ పెళ్లి అధికారికంగా ఖరారు అయింది' అంటూ ప్రచారం చేస్తున్నారు. ఇది నిజంగా భయంకరంగా ఉంది" అని చెప్పింది. ఇలా క్లియర్ క్లారిటీ ద్వారా ధనుష్‌తో పెళ్లి వార్తలకు మృణాల్ పూర్తిగా చెక్ పెట్టినట్టే అయ్యింది.గతంలో ఈ డేటింగ్ రూమర్స్‌పై మృణాల్ ఒక పోస్ట్ పెట్టి "విని నవ్వుకుంటాం" అని రాసింది. అయితే ఇప్పుడు మొదటిసారి ఓ ఇంటర్వ్యూలో డైరెక్ట్‌గా స్పందించి పూర్తి క్లారిటీ ఇచ్చింది. ప్రస్తుతం వీరిద్దరి మధ్య ఎలాంటి రిలేషన్ లేదని, కేవలం స్నేహం మాత్రమేనని మరోసారి స్పష్టమైంది.

# 'ప్రపంచం భారత్‌కు వస్తోంది'

దిల్లీ వేదికగా జరగుతున్న 'ఏఐ-ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ 2026' కోసం ప్రపంచవ్యాప్తంగా ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదకగా వారికి స్వాగతం పలికారు. ప్రపంచం ఇప్పుడు ఇండియాకు వస్తోందన్నారు. ఈ మెగా ఈవెంట్‌ను ప్రారంభించడానికి ముందు ఆయన ఎక్స్ లో పోస్టు చేశారు. ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ కోసం దేశ విదేశాల నుంచి ప్రతినిధులు రావడం ఎంతో గర్వకారణమన్నారు. 'ఏఐపై చర్చకు ప్రపంచాన్ని ఒకే వేదికపై తీసుకువస్తున్నాం. దిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం ప్రపంచ నలుమూలల వచ్చిన నాయకులు, పారిశ్రామిక వేత్తలు, ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, టెక్ నిపుణులను స్వాగతిస్తున్నా. ఇది మా దేశానికి గర్వకారణం. అలాగే భారత యువత సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపిస్తోంది. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రపంచ అభివృద్ధికి భారత్ సహకారాన్ని అందిస్తోందనడాన్ని ఈ సమ్మిట్ మరింత బలపరుస్తుంది' అని ప్రధాని మోదీ రాసుకొచ్చారు. ఏఐ ఇప్పటికే పలు రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తోందని ప్రధాని మోదీ అన్నారు. 'ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పాలన, పరిశ్రమలు వంటి రంగాల్లో మార్పులు వచ్చాయి. ఏఐ వినియోగం బాధ్యతాయుతంగా ఉండాలి. ప్రపంచ స్థాయిలో చర్చలకు ఈ సమ్మిట్ దోహదపడుతుంది. ఈ సమ్మిట్ ఫలితాలు ప్రగతిశీల, వినూత్నమైన, అవకాశాల



ఆధారిత భవిష్యత్తును రూపొందించడంలో సహాయపడతాయని నేను విశ్వసిస్తున్నా. 1.4 బిలియన్ భారతీయుల వల్లే దేశం ఏఐ మార్పులో ముందంజలో ఉంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్ ఎకోసిస్టమ్, ఆధునిక పరిశోధనలు ఇవన్నీ ఏఐ పట్ల భారత్‌కు ఉన్న ఆశయం, బాధ్యతను ప్రతిబింబిస్తున్నాయి' అని ప్రధాని మోదీ తెలిపారు.

**భారత్ మండపం వేదికగా ఏఐ ఎక్స్‌పో**

ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు ఏఐ ఇండియా ఇంపాక్ట్ సమ్మిట్ దిల్లీలోని మండపంలో జరగనుంది. ఈ సమ్మిట్‌తో పాటు 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో' కూడా జరుగుతుంది. దీనిని సోమవారం ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ఇది ఏఐ పాలసీ, ఇన్నోవేషన్, అమలు ఇలా అన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చేలా రూపకల్పన చేశారు. 70,000 చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణంలో ఈ ఎక్స్‌పో ఉంటుంది. గ్లోబల్ టెక్ కంపెనీలు, స్టార్టప్‌లు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల పాల్గొనున్నాయి. ఈ ఎక్స్‌పోలో ఏఐ ఎకోసిస్టంలో అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని హైలైట్ చేస్తూ 13 దేశాల పెవిలియన్‌లను ఏర్పాటు చేశారు. పీపుల్-ప్లానెట్- ప్రోగ్రెస్ అనే మూడు ప్రధాన థీమ్‌లుగా ఈ ఎక్స్‌పోను విభజించారు. 300కి పైగా ఎగ్జిబిషన్ పెవిలియన్లు, ప్రత్యక్ష డెమో ప్రదర్శనలు ఉంటాయి. వ్యవసాయం నుంచి విద్య, ఆరోగ్యం వరకు వివిధ రంగాల్లో ఏఐ ఎలా ఉపయోగపడుతుందో ప్రత్యక్షంగా చూపించనున్నారు.

**స్టార్టప్‌లకు భారీ వేదిక**

600కి పైగా హై-పొటెన్షియల్ స్టార్టప్‌లు పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో చాలా వరకు వాస్తవ జీవితంలో ఉపయోగిస్తున్న ూ× సొల్యూషన్లు ఉన్నాయి. 2.5 లక్షలకు పైగా సందర్శకులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో 500కు పైగా సెషన్స్, 3,250కి పైగా స్పీకర్లు, ప్యానెలిస్టులతో 500కు పైగా సెషన్లు నిర్వహించనున్నారు. ఏఐ గవర్నెన్స్ నుంచి ఇండస్ట్రీ అప్లికేషన్ల వరకు చర్చలు జరగనున్నాయి. ఏఐ ఇండియా ఇంపాక్ట్ గ్లోబల్ సౌత్‌లో జరగుతున్న తొలి అంతర్జాకీయ సమ్మిట్‌గా గుర్తింపు పొందింది. ఇక ఈ సమ్మిట్‌లో ఇండియా ఏఐ మిషన్ కింద 12 స్వదేశీ ఏఐ ఫౌండేషన్ నమూనాలను ఆవిష్కరించనున్నారు. భారత డేటాసెట్‌లపై శిక్షణ పొంది, దేశంలోని 22 అధికారిక భాషలకు అనుగుణంగా అభివృద్ధి చేశారు.

# పార్లమెంట్ సజావుగా సాగడం రాహుల్‌కు ఇష్టం లేదు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మండిపడ్డారు. పార్లమెంట్ సజావుగా సాగడం లోక్‌సభలో విపక్షనేతకు ఇష్టం లేదని ఆరోపించారు. కొన్ని ఎన్జీఓలు కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని రాహుల్‌కు భోదించాయని, అందుకే ఆయన సభను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. "రాహుల్ గాంధీకి సభ సజావుగా సాగడం ఇష్టం లేదు. అందుకే ఆయన సభలో సమస్యలను సృష్టించడంపై ఆసక్తి చూపిస్తున్నారు. కాంగ్రెస్‌కు మంచి రోజులు వస్తాయని రాహుల్ గాంధీకి కొన్ని ఎన్జీఓలు బోధించాయి. కానీ వారికి ఎప్పటికీ మంచి రోజులు రావు. తదుపరి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సీట్ల సంఖ్య మరింత తగ్గుతుంది. ప్రతిపక్షాలు సభను అడ్డుకోవడంపై పాలక కూటమికి (ఎన్డీఏ) ఎటువంటి సమస్య లేదు. ఎందుకంటే సభలో పరిస్థితిని చక్కదిద్దడానికి నేను అనేక ప్రయత్నాలు చేశాను. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కేసీ వేణుగోపాల్, మరికొంత మంది నేతలతో సభ సజావుగా జరగడం గురించి మాట్లాడాను." అని కిరణ్ రిజిజు తెలిపారు.

**విపక్ష పార్టీలన్నీ కాంగ్రెస్‌తో లేవు : కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**

ప్రతిపక్షాల పార్టీలన్నీ కాంగ్రెస్‌తో లేవని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో చిన్న పార్టీలు మాట్లాడే సమయాన్ని కోల్పోతున్నందున సభను నిలిపివేయవద్దని కాంగ్రెస్‌పై ఒత్తిడి ఉందని తెలిపారు. "చిన్న పార్టీలు తమకు కేటాయించిన సమయాన్ని పార్లమెంట్‌లో ఉపయోగించుకోలేకపోతున్నాయి.



అందుకే అవి రాహుల్ గాంధీపై అసంతృప్తిగా ఉన్నాయి. చిన్న పార్టీల్లో కొన్ని స్పీకర్‌పై విపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై సంతకం కూడా చేయలేదు. ఇతర రాజకీయ పార్టీలకు చెందిన కొందరు ఎంపీలు సభ సజావుగా పనిచేయాలని కోరుకుంటున్నామని నాకు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా ఎన్నికల్లో ఓడిపోవడంతో నిరాశలో కూరుకుపోయింది." అని రిజిజు వ్యాఖ్యానించారు.

**వాడీవేడీగా బడ్జెట్ సమావేశాలు**

గత నెల (జనవరి) 28న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు మొదలయ్యాయి. సమావేశాల ప్రారంభమైన రోజే (జనవరి 28న) పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మాట్లాడారు. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. అయితే ఈ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం నుంచి వాడీవేడీగా సాగాయి. సభలో గందరగోళం నెలకొనడంతో లోక్‌సభ, రాజ్యసభ పలుమార్లు వాయిదా పడ్డాయి. ఈ నేపథ్యంలో రాహుల్‌పై కిరణ్ రిజిజు మండిపడ్డారు.

**సభను కుదిపేసిన ఆర్మీ మాజీ చీఫ్ బుక్ అంశం**

ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవణె రాసిన పుస్తకాన్ని సభలోకి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీసుకొచ్చారు. అలాగే సభలో ఈ బుక్‌లోని అంశాలకు ప్రస్తావించారు. ప్రధాని మోదీకి సైతం ఈ పుస్తకాన్ని అందిస్తానని రాహుల్ తెలిపారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం ఏర్పడింది. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొంది. ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను సభలో ఎలా ప్రస్తావిస్తారని రాహుల్‌పై బీజేపీ భగ్గుమంది. లోక్‌సభలో రాహుల్ తీరుపై మండిపడింది. దీంతో సభలో గందరగోళం నెలకొంది. రాహుల్‌ను మాట్లాడనివ్వాలని వెల్‌లోకి కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు దూసుకెళ్లారు. ఈ క్రమంలో కొందరు స్పీకర్‌పై కాగితాలు విసిరారు. దీంతో ఎనిమిది మంది విపక్ష ఎంపీలను పార్లమెంట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

**స్పీకర్ అవిశ్వాస తీర్మానం**

సభలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, 8 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేయడం వంటి కారణాలతో విపక్షాలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చాయి. సభను నిర్వహించడంలో స్పీకర్ ఓం బిర్లా తీవ్ర పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని, రాజ్యాంగబద్ధ కార్యాలయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించాయి. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ తదితర పార్టీలకు చెందిన 118 మంది ఎంపీలు ఈ అవిశ్వాస తీర్మానం నోటీసుపై సంతకాలు చేశారు.

# దేశవ్యాప్తంగా సీసీటీవీలు ఏర్పాటు

డ్రగ్స్ రవాణాను అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా పటిష్ఠమైన 'సీసీటీవీ కెమెరాల నెట్‌వర్క్'ను ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. అంతేకాకుండా, దశాబ్దాలుగా దేశాన్ని భయపెడుతున్న నక్సలిజం సమస్యకు ఈ ఏడాది మార్చి 31 నాటికి శాశ్వతంగా చరమగీతం పాడబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు భారతదేశ అంతర్గత భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దేశ యువతను పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాల మహమ్మారిని సమూలంగా అంతం చేసేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. దిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భవిష్యత్ కార్యాచరణను వివరించారు. "రాబోయే కొద్ది నెలల్లోనే కొత్త 'జాతీయ భద్రతా నిర్మాణాన్ని' ఏర్పాటు చేస్తాం. దీని ప్రధాన లక్ష్యం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడమే. ఇందుకోసం దేశంలోని అన్ని రాష్ట్రాలను కలుపుతూ ఒక భారీ సీసీటీవీ నెట్‌వర్క్‌ను సృష్టిస్తాం. వీటిని పర్యవేక్షించడానికి 'ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్' ఏర్పాటు చేస్తాం. ఈ నిఘా వ్యవస్థకు చట్టపరమైన రక్షణ కూడా కల్పిస్తాం. దీనివల్ల డ్రగ్స్ నేరాలను రియల్ టైమ్‌లో పసిగట్టడం సులభమవుతుంది" అని షా అన్నారు.

**సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత**

కేవలం అంతర్గత భద్రతే కాదు, సరిహద్దుల రక్షణపైనా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని షా తెలిపారు. "దేశంలోని ప్రతి భూ సరిహద్దులో భద్రతా ఏర్పాట్లను ఆధునీకరిస్తాం. నిఘా వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేస్తాం. ఫెన్సింగ్ (కంచె), ఇతర మౌలిక సదుపాయాలను బలపరుస్తాం. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు భద్రతా దళాల మధ్య సమన్వయం పెంచుతాం. అక్రమ ప్రవేశాలకు ఇక ఆస్కారం ఉండదు" అని తెలిపారు. అమిత్ షా తన ప్రసంగంలో మావోయిస్టుల ఏరివేతపై స్పష్టమైన డెడ్‌లైన్ విధించారు. "నక్సలిజం ఒకప్పుడు దేశంలోని 11 రాష్ట్రాలకు విస్తరించి పెద్ద సవాలుగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ సమస్య దాదాపుగా కొలిక్కి వచ్చింది. ప్రభావిత ప్రాంతాలను మావోయిస్టుల చెర నుంచి



విడిపించడానికి మనం చాలా దగ్గరగా ఉన్నాం. మార్చి 31, 2026 నాటికి దేశం నుంచి మావోయిస్టు హింసను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం. ఇది మన భద్రతా దళాలకు దక్కే అతిపెద్ద విజయం." అని అన్నారు.

**భద్రతకు స్వర్ణయుగం**

గత 12 ఏళ్ల కాలాన్ని (2014 నుంచి 2026 వరకు) భారత అంతర్గత భద్రత చరిత్రలో 'స్వర్ణయుగం'గా అమిత్ షా అభివర్ణించారు. "2014కు ముందు దేశాన్ని కశ్మీర్ సమస్య, ఈశాన్య రాష్ట్రాల్లో అలజడి, మావోయిస్టు హింస అనే మూడు ప్రధాన సమస్యలు వేధించేవి. ఈ మూడు సమస్యలు 3-4 దశాబ్దాలుగా దేశాన్ని పట్టిపీడించాయి. కానీ ఆర్టికల్ 370 రద్దు తర్వాత పరిస్థితులు మారాయి. కశ్మీర్, ఈశాన్య భారతం, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో హింస 80 శాతం తగ్గింది. ఈ మూడు ప్రాంతాలు పూర్తిగా హింస రహితంగా మారే రోజు ఎంతో దూరంలో లేదు" అని వివరించారు.

**ఈశాన్యంలో శాంతి పవనాలు**

ఈశాన్య రాష్ట్రాల్లో వచ్చిన మార్పులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రస్తావించారు. "అక్కడ 10,000 మందికి పైగా యువకులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. 20కి పైగా శాంతి ఒప్పందాల ద్వారా ఆ ప్రాంతంలో ప్రశాంతత నెలకొల్పగలిగాం" అని అన్నారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో తెచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాల గురించి కూడా షా మాట్లాడారు. "రాబోయే కాలంలో ఈ చట్టాలను సంపూర్ణంగా, సమర్థవంతంగా అమలు చేయడం పైనే హోం శాఖ దృష్టి సారిస్తుంది. పోలీసులకు, దర్యాప్తు సంస్థలకు దీనిపై పూర్తి స్థాయి శిక్షణ ఇస్తున్నాం. వారికి కావాల్సిన పరికరాలను సమకూరుస్తున్నాం" అని చెప్పారు.

**దిల్లీ పోలీసులకు ప్రశంసలు**

దేశ రాజధాని రక్షణలో దిల్లీ పోలీసులు చూపుతున్న తెగువను మంత్రి అమిత్ షా కొనియాడారు. "పార్లమెంట్ దాడి కేసు అయినా, ఎర్రకోట సమీపంలో బాంబు పేలుడు అయినా, దిల్లీ పోలీసులు సమర్థవంతంగా పనిచేశారు. క్లిష్టమైన కేసులను ఛేదించడంలో వారి నైపుణ్యం అద్భుతం. దేశ రక్షణలో వారు చేస్తున్న కృషి వెలకట్టలేనిది. 2029 నాటికి దేశం ఎదుర్కొంటున్న అన్ని భద్రతా సవాళ్లను సమన్వయంతో, నిరంతర కృషితో అధిగమిస్తాం" అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

## మతపరమైన ప్రదేశాల్లో మహిళల వివక్ష కేసు

కేరళలోని శబరిమల ఆలయంతో సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళల ప్రవేశంపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును విచారించేందుకు తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. ఈ విచారణను ధర్మాసనం ఏప్రిల్ 7న ప్రారంభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమల్య బాగ్చి, విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం చెప్పింది. ఇది ఏప్రిల్ 22 నాటికి ముగిసే అవకాశం ఉందని పేర్కొంది. మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14లోపు లిఖితపూర్వక వాదనలను సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. శబరిమలతో పాటు మసీదులు, దర్గాలోకి మహిళల ప్రవేశంపై కూడా విచారించనుంది. అలాగే ఇతరులను పెళ్లి చేసుకున్న పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవండ వంటి అంశాలపై పరిగణనలోకి తీసుకుంది. అయితే నిర్ణయించిన షెడ్యూల్‌కు కట్టుబడి ఉండాలని అన్ని పక్షాలకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. 2019లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఏర్పాటు చేసిన 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్ష పిటిషన్ల నిర్వహణను ఇప్పటికే నిర్ణయించిందని తెలిపారు. అయితే కొవిడ్ కారణంగా ఈ అంశంపై విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత మరో కొత్త ధర్మాసనంతో దీనిపై విచారణ జరపనున్నట్లు వెల్లడించారు.

**విచారణ పూర్తి షెడ్యూల్**

సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం, దర్మాసనం ఏప్రిల్ 7న ఉదయం 10:30 గంటలకు విచారణను ప్రారంభిస్తుంది.

ఏప్రిల్ 7 నుంచి 9 వరకు రివ్యూ పిటిషనర్ల వాదనలు

ఏప్రిల్ 14 నుంచి 16: రివ్యూ వ్యతిరేక పక్షాల వాదనలు

ఏప్రిల్ 21: రీజాయిండర్ సమర్పణలు

ఏప్రిల్ 22: అమికస్ కురియే తుది వాదనలు

నోడల్ కౌన్సిల్లు అండ్ అమికస్ నియామకాలు

2018 శబరిమల తీర్పు సమీక్షించాలనే మద్దతుదారుల తరఫున నోడల్ న్యాయవాదిగా కృష్ణ కుమార్ సింగ్‌ను, వ్యతిరేక పక్షాల తరఫున శాశ్వతి పారిని ధర్మాసనం నియమించింది. అమికస్ కురియేగా సీనియర్ అడ్వకేట్ కే పరమేశ్వర్, సహాయకుడిగా శివం సింగ్ నియమితులయ్యారు. 2018 శబరిమల తీర్పును సమీక్షించాలనే పటిషన్లకు కేంద్ర ప్రభుత్వ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మద్దతు తెలిపారు. అన్ని వయస్సుల మహిళలకు ప్రవేశం అనుమతించిన తీర్పును మళ్లీ పరిశీలించాలని సూచించారు. 2018లో శబరిమలలో 10 నుంచి 50 ఏళ్ల మధ్య మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని రద్దు చేస్తూ ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పునిచ్చింది. ఈ ఆచారం లింగ వివక్షగా పేర్కొంది. అయితే ఈ తీర్పుపై భారీ నిరసనలు జరిగాయి. తీర్పును సమీక్షించాలంటూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ కేసును 2019లో 9మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి రిఫర్ చేసింది. 2020 మే 11న రివ్యూ పిటిషన్ల దశలో కూడా న్యాయపరమైన ప్రశ్నలను ప్రధాన ధర్మాసనానికి పంపించే అధికారం కోర్టుకు ఉంటుందని స్పష్టం చేసింది.

**ధర్మాసనం ముందున్న కీలక ప్రశ్నలు**

ఇక 2020లో రూపొందించిన ఏడు ప్రధాన న్యాయపరమైన ప్రశ్నల ఆధారంగానే ప్రస్తుత విచారణ సాగనుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం మత స్వేచ్ఛ హక్కు పరిధి ఎంత? ఆర్టికల్ 25 వ్యక్తిగత హక్కులు, ఆర్టికల్ 26 మత సంస్థల హక్కులు మధ్య సంబంధం ఏంటి? వంటి ప్రశ్నలను ధర్మాసనం పరిశీలించనుంది. అలాగే మత సమూహానికి చెందని వ్యక్తి పిల్ ద్వారా ఆచారాలను ప్రశ్నించవచ్చా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

## యక్షగానంలో దుమ్మురేపిన దివ్యాంగ బాలలు

ఆంధ్రప్రదేశ్‌లో కూచిపూడి, తెలంగాణలో చిందు భాగవతం లాగే కర్ణాటకలో యక్షగానం ఫేమస్. విశేషం ఏమిటంటే, యక్షగానం ప్రదర్శనలో పురుషులే భాగమవుతారు. స్టేజీపైకి వచ్చి యక్షగానం ప్రదర్శన ఇచ్చేందుకు ఒక్కో కళాకారుడు ఏళ్ల తరబడి శ్రమిస్తుంటాడు. కానీ కొందరు దివ్యాంగ బాలురు కేవలం 6 నెలల శిక్షణతో స్టేజీపై దుమ్మురేపారు. నటన, భావోద్వేగం, పాత్రలకు తగిన ముఖ కవళికలు, ఆకట్టుకునే ఆహార్యంతో భళా అనిపించారు. శిక్షణ, అవకాశం లభిస్తే ఏ కళారూపంలోనైనా తాము రాణించగలరని చాటి చెప్పారు. మంగళూరుకు చెందిన దివ్యాంగ బాలల కళా నైపుణ్యంపై కథనమిది. మంగళూరు నగరంలోని శక్తినగర్‌లో సానిధ్య స్పెషల్ చిల్డ్రన్స్ స్కూల్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఉంది. ఇందులో ఎంతోమంది దివ్యాంగ బాల, బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విద్యాసంస్థలో విద్యార్థులకు చదువుతో పాటు డ్యాన్సింగ్, సింగింగ్, పెయింటింగ్ లాంటి కళలు, స్వయం ఉపాధి పనులనూ నేర్పిస్తుంటారు. సానిధ్య ఇన్‌స్టిట్యూట్ వార్షికోత్సవం సందర్భంగా ఏటా మంగళూరు నగరంలోని అతిపెద్ద కద్రి పార్కులో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. వీటిని చూసేందుకు యావత్ నగరం నుంచి ప్రజలు తరలి వస్తుంటారు. ఈసారి వార్షికోత్సవం కోసం కొన్ని నెలలు ముందు నుంచే పిల్లలకు వివిధ కళారూపాలలో ట్రైనింగ్ ఇచ్చారు. పిల్లలు యక్షగానం నేర్చుకోవడం చాలా టఫ్. అందుకే ఆరు నెలల ముందు నుంచే ఈవిభాగంలో 15 మంది బాలురకు ట్రైనింగ్‌ను మొదలుపెట్టారు. ఈసారి కద్రి పార్కులో నిర్వహించిన సానిధ్య ఇన్‌స్టిట్యూట్ వార్షికోత్సవంలో దివ్యాంగ బాలురు ప్రదర్శించిన యక్షగానం అందరినీ ఆకట్టుకుంది. 'వరాహ అవతారం' అనే పురాణ గాథపై బాలురు ఇచ్చిన యక్షగానం ప్రదర్శన అందరి మన్ననలు అందుకుంది. భూదేవిని రక్షించేందుకు విష్ణుమూర్తి ధరించే వరాహ అవతారమే ఈ పురాణ గాథలోని ముఖ్యాంశం. శ్రీమహావిష్ణువు ధరించిన పది ప్రధాన అవతారాలలో వరాహ అవతారం మూడోది. దీనిపై యక్షగానం ప్రదర్శన కోసం ముందుగానే సానిధ్య ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు డైలాగ్‌లను కళాకారులతో చెప్పించి, ప్రత్యేక స్టూడియోలో వాటిని రికార్డు చేయించారు. ఆ రికార్డెడ్ డైలాగ్‌లను కద్రి పార్కులో ఏర్పాటు చేసిన స్టేజీపై ప్రదర్శించారు. ఈ డైలాగ్‌లకు అనుగుణంగా దివ్యాంగ బాలలు అద్భుతంగా జీవకళ ఉట్టిపడేలా భావ వ్యక్తీకరణ చేశారు. వారి ముఖ కవళికలు, కాళ్ల కదలికలు, ఆహార్యం, భావోద్వేగాలను వ్యక్తం చేసిన తీరు వీక్షకుల మనసులను హత్తుకుంది. యక్షగానంలో తమకు కేటాయించిన పాత్రల్లో ఆ బాలలు జీవించిపోయారు. రికార్డెడ్ సౌండ్‌లను వింటూ ఆ పిల్లలు నటిస్తున్నారు అంటే వీక్షకులు ఎవరూ నమ్మలేకపోయారు. అంతగా పాత్రల్లో దివ్యాంగ బాలలు ఇమిడిపోయారు. ఈ యక్షగాన కళారూపం ప్రదర్శనకు కద్రి ఏరియాకు చెందిన కళాకారుడు శరత్ కుమార్ కద్రి దర్శకత్వం వహించారు. సహాయ దర్శకుడిగా సుజీత్ కుమార్ వ్యవహరించారు.

**ఇదే తొలిసారేం కాదు**

సానిధ్య ఇన్‌స్టిట్యూట్ దివ్యాంగ బాలలు యక్షగాన ప్రదర్శన ఇవ్వడం ఇదే తొలిసారేం కాదు. గత 12 ఏళ్లుగా వాళ్లు ఈ క్లిష్టమైన నృత్య కళా విభాగంలో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇంతకుముందు గురుదక్షిణ, దేవీ మహత్మ్యం, భక్త ప్రహ్లాద, జాంబవతీ కళ్యాణం, భస్మాసుర మోహిని, లంకా దహనం, శ్రీకృష్ణ జన్మ – కంస వధ, శ్వేతకుమార చరిత్ర, జటాయు మోక్షం, మహిషి మోక్షం, నాగాస్త్ర కుంభకర్ణ కలగ వంటి పురాణ గాథలపై ఈ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన బాలలు ప్రదర్శనలిచ్చారు. సానిధ్య ఇన్‌స్టిట్యూట్ దివ్యాంగ బాలల యక్షగాన ప్రదర్శనలు కద్రి పార్కుకే పరిమితం కాలేదు. వారు రాష్ట్ర రాజధాని బెంగళూరులోని విధాన సౌధ, సుత్తూరు మఠంలలోనూ ప్రదర్శనలిచ్చి ప్రశంసలను అందుకున్నారు. కేవలం 3 నుంచి ఆరు నెలల్లోనే ఏ అంశంపై అయినా యక్షగానాన్ని ప్రదర్శించేలా సిద్ధం కావడం ఈ ఇన్‌స్టిట్యూట్ దివ్యాంగ బాలల ప్రతిభ, అంకితభావాలకు నిదర్శనం.

**'డైలాగ్స్‌ను వింటూ అద్భుతంగా ప్రదర్శన'**

'మేం చాలా ఏళ్లుగా కద్రి పార్క్‌లో సానిధ్య ఇన్‌స్టిట్యూట్ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నాం. మా కల్చరల్ కార్యక్రమాల్లో యక్షగానం అనేది ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంటుంది. ఈ సంవత్సరం మా ఇన్‌స్టిట్యూట్ పిల్లలు 'వరాహావతారం' అనే అంశంపై యక్షగానాన్ని ప్రదర్శించారు. కళాకారులతో రికార్డ్ చేయించిన డైలాగ్స్‌ను వింటూ, బాలలు స్టేజీపై ప్రదర్శన ఇచ్చారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137